సురవరం సుధాకరరెడ్డి
వ్యాసాలు – లేఖలు
రూ॥200/- పేజీలు:290

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

మిషన్ భగీరథ ట్యాంక్‌లో దిగి ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృతి 03

బిహార్‌లో సిపిఐ ప్రబల శక్తి అందుకు తగ్గట్లుగానే సీట్లు కోరుతున్నాం సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా 12

సంపుటి 08, సంచిక: 280 | బుధవారం | 10-09-2025 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్



**ఎన్‌డిఎ అభ్యర్థికి 452, ఇండియా అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు**

- ఓటు వేసిన 767 మంది ఎంపిలు
- చెల్లని ఓట్లు 15
- 98.2 శాతం ఓటింగ్
- రాజ్యాంగంకోసం పోరు కొనసాగుతుంది : జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



**న్యూఢిల్లీ:** భారత ఉపరాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ తరపున పోటీచేసిన రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు వచ్చాయి. ‘ఇండియా కూటమి’ ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు లభించాయి. అధికారపార్టీ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఊహించినదానికంటే ఎక్కువగా 152 ఓట్ల మెజారిటీ లభించింది. ప్రతిపక్ష శిబిరం నుండి కూడా ఆయనకు ఓట్లు పడ్డాయి. రిటర్నింగ్ అధికారి పి.సి.మోదీ (రాజ్యసభ సెక్రటరీ జనరల్) మంగళవారం రాత్రి ఉపరాష్ట్రపతి ఎన్నిక ఫలితాన్ని వెల్లడించారు. రాధాకృష్ణన్ దేశ ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారని ఆయన ప్రకటించారు. ఈ ఎన్నికల ఫలితాన్ని ఎన్నికకమిషన్‌కు తెలియజేస్తానన్నారు. 752 ఓట్లు చెల్లుబాటుకాగా, 15 ఓట్లు చెల్లుబాటు కాకుండా వృధా అయ్యాయని చెప్పారు. పార్లమెంటు ఉభయసభలకు చెందిన మొత్తం 781 మంది సభ్యులకుగాను 767 మంది ఎంపీలు ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి నిర్ణీత ప్రకారం 315 ఓట్లు రావాల్సి ఉండగా 15 ఓట్లు తక్కువ వచ్చాయి. ఫలితాలు రావడానికి ముందుగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ మాట్లాడుతూ, ప్రతిపక్షం ఐక్యంగా ఉందని, 315 మంది ఎంపీలు ఓట్లు వేశారని చెప్పారు. ఐతే దీనిపై బిజెపి నాయకులు స్పందిస్తూ, ప్రతిపక్షంలో కొందరు ఎంపీలు ఉద్దేశపూర్వకంగా తరువాయి 2లో

## నేపాల్‌లో హింసాకాండ

### ప్రధానమంత్రి ఓలి రాజీనామా
### జనరేషన్ జెడ్ ఉద్యమంతో రాజకీయ సంక్షోభం

- పార్లమెంటు భవనం దగ్ధం చేసిన నిరసనకారులు
- ఓలి సహా పలువురి నాయకుల ఇళ్ళకు నిప్పు
- సోషల్ మీడియాపై నిషేధం రద్దు, దర్యాప్తునకు ఆదేశం
- రెండోరోజు ఆగని హింస, కర్ఫ్యూ ఉల్లంఘన
- విమాన రాకపోకలు రద్దు,రంగంలోకి సైన్యం





**ఖాట్మండు:** నేపాల్‌లో సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా మొదలైన ‘‘జనరేషన్ జెడ్ ఉద్యమం’’ రాజకీయ భూకంపం పుట్టించింది. ప్రధానమంత్రి కె.పి.శర్మఓలి రాజీనామా చేయగా, ప్రదర్శకులు పార్లమెంటు భవనానికి నిప్పుపెట్టారు. మంటల్లో పార్లమెంటు భవనం దగ్ధమవుతున్న దృశ్యాలను అంతర్జాతీయ మీడియా చూపించింది. ప్రధానమంత్రి సహా పలువురు నాయకుల ఇళ్ళను ప్రదర్శకులు దగ్ధం చేశారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక సోషల్ మీడియాపై నిషేధాన్ని రద్దుచేశారు. ఐతే మంగళవారం మధ్యాహ్నం యువకులు పెద్దసంఖ్యలో ఆయన అధికారిక కార్యాలయంలోకి ప్రవేశించి, పోలీసు కాల్పుల్లో 19 మంది మరణించిన ఘటనలకు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువకులు చేసిన డిమాండ్‌ను గౌరవించి వెంటనే ఆయన రాజీనామా సమర్పించారు. దేశంలో పరిస్థితులు చక్కబడి శాంతి నెలకొనేవరకూ సైన్యమే ప్రధానపాత్ర నిర్వహించే అవకాశం ఉంది. కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్స్), కాంగ్రెస్‌పార్టీ నాయకత్వానగల కూటమి ప్రభుత్వం 2024 జులై 15 నుండి అధికారంలో కొనసాగుతోంది. ఓలి రాజీనామాకు ముందుగా, దేశంలో ఈ అల్లర్లు వెనుక కారణాలు, అసలు సమస్యపై లోతుగా దర్యాప్తు జరపాలని అధికారులను తరువాయి 2లో

## గ్రూప్–1 పరీక్ష పేపర్లు పునః మూల్యాంకనం

- కుదరకపోతే మళ్లీ పరీక్ష నిర్వహించాలి
- మొత్తం ప్రక్రియ ఎనిమిది నెలల్లోపు పూర్తిచేయాలి
- హైకోర్టు కీలక తీర్పు
- తుది మార్కులు, జనరల్ ర్యాంకింగ్ రద్దుచేసిన ఉన్నత న్యాయస్థానం

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రూప్ –1 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు మంగళవారం కీలక తీర్పు చెప్పింది. మెయిన్స్ పరీక్ష పేపర్లను పునః మూల్యాంకనం చేయాలని టిజిపిఎస్‌సిని ఆదేశించింది. ఇప్పటికే ప్రకటించిన తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ జాబితాలను రద్దు చేసింది మెయిన్స్ అభ్యర్థుల పేపర్లు పునఃమూల్యాంకనం చేసి అర్హుల జాబితాను ప్రకటించాలని ఆదేశించింది. అనంతరం నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని, సుప్రీం కోర్టు సంజయ్ సింగ్ వర్సెస్ యుపిఎస్‌సి కేసు తీర్పులోని గైడ్‌లైన్స్ మేరకు మోడరేషన్ విధానంలో పునః మూల్యాంకాన్ని మాన్యువల్ పద్ధతిలో చేయాలని పేర్కొంది. పునః మూల్యాంకనం చేయలేకపోతే తిరిగి గ్రూప్ 1 పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఇదంతా ఎనిమిది నెలల్లోగా పూర్తి చేయాలని తెలిపింది. గ్రూప్–1 తరువాయి 2లో


03

- మళ్ళీ పరీక్ష నిర్వహించాలి : కెటిఆర్
- పరీక్ష నిర్వహణలో ప్రభుత్వం విఫలం : బిజెపి
- తగిన నిర్ణయం తీసుకుంటాం : మంత్రి జూపల్లి
- నిరుద్యోగులకు మంచిచేసే చర్యలే చేపడతాం : ఎంపి చామల

### బంగారం ధరకు రెక్కలు

ఒక్కరోజే రూ.5వేలు పెరిగిన పసిడి ధర!

### హిమాచల్‌కు రూ. 1500కోట్లు పంజాబ్‌కు రూ. 1600 కోట్లు

తక్షణ సాయం ప్రకటించిన ప్రధాని మోదీ

05

## ఫార్ములా ఇ-రేస్ కేసు
## చార్జిషీట్ దాఖలుకు అనుమతివ్వండి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు లేఖ రాసిన ఎసిబి?
- దర్యాప్తు నివేదిక ప్రభుత్వానికి అందజేత
- లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చు : కెటిఆర్




ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఇ–కార్ రేస్ కేసులో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు విచారణ పూర్తి చేశారు. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలంటూ ఎసిబి అధికారులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు లేఖ రాసినట్లు సమాచారం. కొత్త చట్టాల ప్రకారం ప్రజాప్రతినిధిని ఏదైనా కేసులో అరెస్టు చేయాలన్నా, చార్జిషీట్ దాఖలు చేయాలన్నా గవర్నర్ అనుమతి తప్పనిసరి. అయితే ఫార్ములా ఇ–కార్ రేస్ 2023లో చోటుచేసుకుంది. ఇందులో ఎ1గా ఎమ్మెల్యే కెటిఆర్ ఉండడంతో గవర్నర్ అనుమతి తప్పనిసరి అయ్యింది. గవర్నర్ అనుమతి రాగానే కెటిఆర్‌ను అరెస్టు చేయవచ్చు లేదంటే చార్జిషీట్ దాఖలు చేయవచ్చు. ఈ మేరకు దాదాపు 9 నెలల పాటు కేసులో విచారణ జరిపిన ఎసిబి అధికారులు పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. అదేవిధంగా కేసులో నిందితులుగా ఉన్న వారిపై చార్జిషీట్ దాఖలు చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఫార్ములా ఇ–రేసు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ మేరకు దాదాపు 9 నెలల పాటు కేసులో విచారణ జరిపిన ఎసిబి అధికారులు పూర్తి నివేదికను ఇవాళ ప్రభుత్వానికి అందజేశారు. అదేవిధంగా కేసులో నిందితులుగా ఉన్న వారిపై చార్జిషీట్ దాఖలు చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వద్దకు రిపోర్టు చేరింది. అక్కడి నుంచి అనుమతి రాగానే ఫార్ములా ఈరేసు కేసులో ఎ1గా ఉన్న తరువాయి 2లో

## రూ.4 లక్షలు లంచం
## పట్టుబడిన అధికారిణి

- ఎల్‌ఆర్‌ఎస్ క్లియర్ చేసేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేసిన మణిహారిక
- నార్సింగ్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎసిబి అధికారులు



ప్రజాపక్షం/గండిపేట

నార్సింగి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారిక 4 లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హాండెడ్ పట్టుబడింది. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే మంచిరేవులలో వినోద్ అనే వ్యక్తి తన ప్లాట్ విషయంలో ఎల్‌ఆర్‌ఎస్ క్లియర్ చేయడానికి దరఖాస్తు చేసుకున్నాడు ఎల్‌ఆర్‌ఎస్ క్లియర్ తరువాయి 12లో



## తెలంగాణలో విద్యాభివృద్ధికి అండగా నిలవండి

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి
- యంగ్ ఇండియా స్కూళ్లు, ఇతర విద్యా సంస్థల అభివృద్ధికి రూ.30 వేల కోట్ల వ్యయం అవుతుందని వెల్లడి
- గత ప్రభుత్వం తీసుకున్న రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అనుమతివ్వాలని విజ్ఞప్తి

హైదరాబాద్/హైదరాబాద్

తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని వివరించారు. రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు కేంద్ర మంత్రికి సిఎం తెలిపారు. ఈ నిధుల తరువాయి 12లో

## ఇజ్రాయెల్ ఘాతుకం
## హమాస్ అగ్రనేతలపై బాంబుదాడులు

### ఖతార్ రాజధాని దోహాలో శాంతిచర్చలకు వెళ్లినవారిపై దుశ్చర్య తీవ్రంగా ఖండించిన ఐరాస సెక్రెటరీ జనరల్


(హమాస్ నేతల ఫైల్ ఫొటో)

**గాజా:** ఖతార్ దేశం రాజధాని దోహానగరంలోని కేంద్ర కార్యాలయంలో హమాస్ అగ్ర నాయకత్వం చర్చలు జరుపుతుండగా వారిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ ఐడిఎఫ్, ఐఎస్ఎలు మంగళవారం బాంబు దాడులు చేశాయి. హమాస్ అగ్రనాయకత్వం హతమైనట్లు తాము ఆశాభావంతో ఉన్నామని ఇజ్రాయెల్ మంగళవారం రాత్రి ప్రకటించింది. ఈ దాడుల్లో 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌పై దాడికి ప్రత్యక్ష సూత్రధారులు ఖలీల్ హయ్యా, ఖాలెద్ మషాల్ తదితరులు ఉన్నట్లు సమాచారం. ఐతే బాంబు దాడుల్లో హమాస్ కీలక నేతలు ఎవరైనా మరణించారా? లేదా గాయపడ్డారా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఖతార్‌లో అనేకచోట్ల బాంబుపేలుళ్ళు సంభవించాయి. హమాస్ సంస్థ నాయకులపై ఇజ్రాయెల్ గురిపెట్టి లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసింది. ఖతార్‌లో దాడులు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ముందుగానే తెలియజేశారని, అందుకు ట్రంప్ అనుమతించారని ఇజ్రాయెలీ సీనియర్ అధికారులు చానెల్–12 కు చెప్పారు. దోహాలో దాడులు చేసేందుకు నెతన్యాహూ ఐడిఎఫ్‌కు ముందుగానే పూర్తి అనుమతి మంజూరుచేశారు. ఖతార్‌లో జరిగిన దాడులను ఆ దేశ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ కూడా ఈ దాడులను తరువాయి 12లో



నిబంధనావళిలో పెనుమార్పులు తెచ్చిన సిపిఐ 5వ కాంగ్రెస్ – 6లో



# ప్రపంచం
WORLD NEWS

## జపాన్ ప్రధాని రేసులో నలుగురు



**టోక్యో :** జపాన్ ప్రధానమంత్రి పదవికి కొత్త నాయకుణ్ణి అక్టోబరు నాలుగో తేదీన ఎన్నుకుంటారు. ఈ పోటీలో అధికార ఎల్‌డిపి నుండి నలుగురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అందులో తకయుకి కొబయాషి, కొయిజుమి, తకైచి, యోషిమస హయాషి పోటీ పడుతున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి, ప్రధానమంత్రి పదవికి షిగెరు ఇషిబా (78) మూడురోజులక్రితం రాజీనామా చేశారు. అధికార లిబరల్ డెమొక్రటిక్‌పార్టీ (ఎల్‌డిపి)లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత రావడంతో రాజీనామా చేశారు. లిబరల్ డెమొక్రటిక్‌పార్టీ వచ్చేనెల మొదటివారంలో సమావేశమై కొత్త నాయకుణ్ణి ఎన్నుకున్న తర్వాత పార్లమెంటు సమావేశం జరుగుతుంది.

## రష్యా ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు..
# ఏకాకి కాలేదు



యూరప్ కల చెదిరింది :లావరోవ్ విమర్శ

**మాస్కో :** రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందని, ప్రపంచదేశాలతో సంబంధం లేకుండా ఏకాకిగా మారుతుందని యూరోపియన్ యూనియన్ దేశాలు కన్న కలలు నెరవేరలేదని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్‌రోవ్ విమర్శించారు. పశ్చిమదేశాలతో సమానంగా రష్యా కూడా కొనుగోలు శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవడంద్వారా యూరప్‌లో అతిపెద్ద ఐదవ ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. కొనుగోళ్ళకు సంబంధించి కరెన్సీ ఎక్స్ఛేంజ్ రేట్లలో సమానత్వం సాధించి ప్రపంచంలో అమెరికా, చైనా, భారత్ తర్వాత నాలుగోస్థానంలో రష్యా నిలిచిందని, యూరప్ దేశాలతో సమానమైన కొనుగోలు సామర్థ్యాన్ని (పిపిపి) సాధించి ఆ ఖండంలో ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ స్థానంలో నిలబడిందని సాక్షాత్తూ ప్రపంచబ్యాంకు, పశ్చిమ దేవాల బ్యాంకుల గణాంకాలే చెబుతున్నాయని ఎంజిఐఎంఓ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ లావరోవ్ చెప్పారు. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభించిన తర్వాత రష్యా ఆర్థిక వ్యవస్థ సంపూర్ణంగా పతనం అవుతుందని పశ్చిమ దేశాలు అంచనా వేశాయని, వారి కలలు నెరవేరకపోవడంతో నిరాశచెందాయన్నారు. షాంఘై సహకార సంస్థ సదస్సు, బ్రిక్స్ సదస్సుల నేపథ్యంలో రష్యా ప్రాధాన్యత బయటపడిందని, పశ్చిమదేశాలు చేస్తున్న ప్రచారం వట్టి బూటకం అని తేలిపోయిందని విమర్శించారు.

# రష్యా– ఉక్రేన్ పరస్పర దాడులు



### డోనెట్స్క్‌లో 21 మంది వృద్ధులు మృతి
### ఒక్కరోజులో 1,425 మంది సైనికులు మృతి

**కీవ్:** ఉక్రేన్–రష్యా మంగళవారం పరస్పర యుద్ధ దాడు లు చేసుకున్నాయి. తూర్పు ఉక్రేన్‌పై రష్యా గ్లైడ్ బాంబులతో చేసిన దాడులల్లో మంగళవారం 21 మంది మరణించారు. మరో పాతికమంది మరణించారు. డోనెట్స్క్ రీజియన్‌లోని యరోవా గ్రామంపై రష్యా ప్రయోగించిన బాంబు లు పడ్డాయని, పెన్షన్‌కోసం లైను లో నిలబడిన వృద్ధులు ఈ దాడిలో మరణించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. దీనిని కిరాతకమైన చర్యగా పేర్కొంటూ అంతర్జాతీయ సమాజం వెంటనే స్పం దించాలని కోరారు. అదేవిధంగా ఉక్రేన్ కూడా బెలగొరేడ్ ప్రాంతంపై 89 డ్రోన్లు ప్రయోగించిందని ఆ ప్రాంత గవర్నర్ వ్యాచస్లేవ్ గ్లాడ్‌కోవ్ చెప్పారు. బెల్గొరోడస్కీ జిల్లాలోని ఐదు గ్రామాలపై ఉక్రేన్ మానవ రహిత దాడులు చేసి విధ్వంసం సృష్టించిందని తెలిపారు. వీటిల్లో ఏడు డ్రోన్లు వాల్యుస్కీ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో దాడులు చేసినట్లు చెప్పారు. క్రాస్నోయరుర్సుస్కీ జిల్లాలో డ్రోన్ల దాడివల్ల ఎక్కువ నష్టం జరిగిందని చెప్పారు. అదేవిధంగా రష్యా సైనికవర్గాలు మంగళవారం ఒక ప్రకటన చేస్తూ గడచిన 24 గంటల్లో నలుచెరగులా ప్రధాన యుద్ధ ప్రాంతాలలో 1,425 మంది ఉక్రేన్ సైనికులు మరణించారని తెలిపింది. టాస్‌వార్తా సంస్థ ఈ విషయం వెల్లడిస్తూ, ఉత్తరప్రాంత సరిహద్దులో జరిగిన యుద్ధంలో 165 మంది ఉక్రేన్ సైనికులు మరణించారని తెలిపింది. పశ్చిమప్రాంత యుద్ధభూమిలో 240 మంది, దక్షిణప్రాంత యుద్ధప్రాంతంలో 230 మంది ఉక్రేన్ సైనికులు మరణించారు. సెంట్రల్ బ్యాటిల్‌గ్రూప్‌కు చెందిన 515 మంది, ఈస్ట్‌బ్యాటిల్‌గ్రూప్‌లో 265 మంది మరణించారు. కాగా జెలెన్స్కీ ఒక ప్రకటన చేస్తూ, రష్యాపై పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించాలని ప్రపంచ దేశాలను కోరారు. ప్రపంచదేశాలు ఈ విషయంలో మౌనం పాటించకూడదన్నారు. ఈ విషయంల అమెరికా, యూరప్ దేశాలు వెంటనే ప్రతిస్పందించాలన్నారు. జి–20 కూడా తన అభిప్రాయం చెప్పాలని జెలెన్స్కీ కోరారు. డోనెట్స్క్ గవర్నర్ వాడైమ్ ఫిలాష్కిన్ ఒక ప్రకటన చేస్తూ, ఇది యుద్ధం కాదనీ, ఇది పూర్తిగా ఉగ్రవాదమని విమర్శించారు.

## నార్వేలో వరుసగా రెండోసారి
# వామపక్ష లేబర్‌పార్టీ విజయభేరి




**ఓస్లో:** నార్వేలో వామపక్ష లేబర్‌పార్టీ దేశాధికారాన్ని నిలబెట్టుకుంది. వామపక్ష లేబర్‌పార్టీ ప్రధానమంత్రి జోనాస్ గహర్ స్టోయిర్ (65) పార్లమెంటు ఎన్నికల్లో వరుసగా రెండోసారి విజయం సాధించి ప్రధానమంత్రి పదవి నిలబెట్టుకున్నారు. 28 శాతం ఓట్లు లేబర్‌పార్టీ సంపాదించుకుంది. 99 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి లేబర్‌పార్టీతోపాటు దానికి మద్దతుగా ఉన్న ఇతర వామపక్షాలు కూడా కలిసి మొత్తం 87 పార్లమెంటరీ స్థానాలు గెలుచుకున్నాయి. మిగిలిన 82 స్థానాలకు పచ్చిమితవాద ప్రోగ్రెస్ పార్టీ, సెంటర్ రైట్ పార్టీలు గట్టిపోటీ ఇస్తున్నాయి. ఐతే 2021 నాటి కంటే ఈ ఎన్నికల్లో మితవాదులు తమ బలాన్ని రెట్టింపు చేసుకుని సవాలు విసిరారు. ద్రవ్యోల్బణం, సంపదపన్ను రద్దు, ప్రజాజీవనంలో నాణ్యతా ప్రమాణాల పెరుగుదల వంటి అంశాలే ఈ సారి ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారాయి. ఉక్రేన్‌లో యుద్ధం, డోనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలు, గాజాలో ఇజ్రాయెల్ దారుణకాండ వంటి అంశాలు కూడా ఎన్నికల్లో ప్రధానంగా చర్చకు వచ్చాయి. దేశంలో ఆర్థికవ్యవస్థ స్థిరత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు లేబర్‌పార్టీకే పట్టం కట్టారని విశ్లేషకులు చెప్పారు. లేబర్‌పార్టీకి మద్దతుగా మరో నాలుగు వామపక్ష పార్టీలు కూడా అధికారంలో భాగం పంచుకుంటూ ఆయనకు పూర్తి భరోసా ఇస్తున్నాయి. 2021 నుండీ ఆయన నార్వే ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల పార్టీలో ఎదురైన అంతర్గత ఆటుపోట్లు తట్టుకుని నిలబడి పార్టీని ఎన్నికల్లో గెలుపుతీరాలకు తీసుకువెళ్ళారు. దేశంలో జీవన వ్యయాల భారాలు లేకుండా చేస్తానని, ప్రజలకు అందుబాటులో సరుకులు ఉంచుతానని, వారి వేతన స్థితిగతులను మెరుగుపరుస్తానని, అంతర్జాతీయంగా నార్వేదేశాన్ని కేంద్రస్థానంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ప్రజలకు ఆయన వాగ్దానం చేశారు. దేశంలో మితవాదులు విజృంభిస్తున్నప్పటికీ తట్టుకుని నిలబడి దేశంలో సోషల్ డెమోక్రసీని నిలబెట్టుకోగలిగామని ఆయన తన సందేశంలో చెప్పారు. జోనాస్ గహర్ స్టోయిర్ 2014 నుండీ లేబర్‌పార్టీ నాయకుడుగా కొనసాగుతున్నారు. జెన్స్‌స్టోల్టెన్‌బెర్గ్ ప్రధానమంత్రిగా ఉండగా గహర్ స్టోయిర్ 2005 నుండి 2012 వరకూ విదేశాంగమంత్రిగా పనిచేశారు. తర్వాత మరో ఏడాది ఆరోగ్యశాఖామంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. రాయల్ నార్వేజియన్ నేవల్ అకాడమీలో ఆయన తొలుత ఉన్నతాధికారిగా పనిచేశారు. రాజనీతి శాస్త్రం చదువుకున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో విద్యార్థిగా అంతర్జాతీయ సంబంధాలపై అధ్యయనం చేశారు. రష్యా,ఫిన్లాండ్,స్వీడన్ సరిహద్దులుగా ఉన్న ఉత్తర యూరప్ దేశం నార్వే.

## నేపాల్‌లో హింసాకాండ
(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. దీర్ఘకాలంగా నేపాల్ రాజకీయాల్లో కొనసాగుతున్న కె.పి.శర్మ ఓలి ఇంతకుముందు రెండుసార్లు ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారన్న కారణంతో పాటు ఆన్‌లైన్ వేదికలు ప్రభుత్వంవద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో విఫలం కావడంతో ఓలి మంత్రివర్గం సోషల్‌మీడియాపై గడచిన గురువారం నిషేధం విధించింది. దేశం లో కొద్దిరోజులుగా ''జనరేషన్ జెడ్ ఉద్యమం'' అవినీతికి వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేస్తోంది. ఇటీవల 'నెపోకిడ్స్' సోషల్‌మీడియా వేదిక ద్వారా ప్రభుత్వ వ్యతిరేక దుష్ప్రచారం విపరీతంగా పెరిగిపోయింది. సోమవారం అర్థరాత్రి ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం రద్దుచేసినప్పటికీ, యువకుల మృతికి, దేశంలో అవినీతికి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ యువకులు రెండోరోజు నిరసనలు కొనసాగించారు. విద్యార్థులను చంపకండి అంటూ వారు నినాదాలు చేశారు. మంత్రులపై భౌతక దాడులు చేశారు. 2008లో నేపాల్‌లో రాచరిక వ్యవస్థ అంతమై ప్రజాస్వామ్య పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ ఆవిర్భవించింది. కర్ఫ్యూను ఉల్లంఘించి యువకులు కొనసాగించిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనప్రదర్శనలు, హింస రెండోరోజు ఉద్ధృతరూపం దాల్చింది. సమస్య పరిష్కరించేందుకు ఆయనకంటే ముందుగా మరో నలుగురు మంత్రులు రాజీనామాలు సమర్పించారు. తొలుత సోమవారం రాత్రి నేపాల్ హోంమంత్రి రమేశ్ లేఖక్ రాజీనామా చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ప్రధానమంత్రి రాజీనామా చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేస్తూ రెండోరోజు రాజకీయ నాయకుల ప్రైవేటు నివాసాలను లక్ష్యంగా చేసుకుని గృహ దహనాలకు, ప్రభుత్వ భవంతులపై దాడులకు పాల్పడ్డారు. ప్రధానమంత్రి ప్రైవేటు గృహాన్ని దగ్ధం చేశారు. దేశాధ్యక్షుడు పౌడల్, సోమవారం రాజీనామా చేసిన మాజీ హోంమంత్రి రమేశ్ లేఖక్ నివాసాన్ని, కమ్యూనిస్టు నేత ప్రచండ, నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దూబే తదితరుల ఇళ్ళను దగ్ధం చేశారు. ఆర్థికమంత్రి విష్ణుప్రసాద్ పౌడేల్‌ను ప్రదర్శకులు వీధుల్లో వెంబడించి దాడిచేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. షేర్‌బహదూర్ దూబే, ఆయన భార్య, విదేశాంగమంత్రి అర్జున్ రాణా దేవుబాలపై కూడా ప్రదర్శకులు దాడి చేశారు. దేశవ్యాప్తంగా కలంకి, కలిమతి, తహఛల్, బనేశ్వర్‌లలో కూడా హింసాకాండ కొనసాగింది. లలిత్‌పూర్ జిల్లాలోని ఛ్యాసల్, ఛాపగావు, థెచోయో ప్రాంతాలలో కూడా నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. పరిణామాలతో అధికారపార్టీ, ఇతర పార్టీల నాయకుల కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాయి. ప్రదర్శకులు త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలోకి దూసుకువెళ్ళడంతో విమానాల రాకపోకలను రద్దుచేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

సోషల్ మీడియాపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ అంతకుముందురోజు ఆదివారం నేపాల్ జర్నలిస్టులు నిరసన ప్రదర్శన జరిపారు. ముఖ్యమైన సోషల్ మీడియాపై నిషేధంవల్ల నేపాల్ దేశం, ప్రజలు డిజిటల్ టెక్నాలజీలో ప్రపంచంకంటే వెనుకబడిపోతారని నేపాల్ కంప్యూటర్ అసోసియేషన్ (సిఎఎన్) అధ్యక్షుడు సునైనా ఘిమైర్ హెచ్చరించారు. అందరితో చర్చించి ఆచరణాత్మక పరిష్కారం సాధించాలని కోరారు.

నేపాల్ ప్రభుత్వం ఈనెల 4వ తేదీన మొత్తం 26 సోషల్ మీడియా వేదికలను నిషేధించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. చైనాకు చెందిన ''టిక్‌టాక్'' తప్ప సోషల్ మీడియా వేదికలన్నీ నేపాల కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఇచ్చిన గడువుతేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో విఫలమయ్యాయని అం దుకే నిషేధం విధించామని ప్రభుత్వం పేర్కొంది. దేశాన్ని కించపరచేవిధంగా అహంకారపూరితమైన ద్వేష ప్రచారం చేస్తే సహించబోమని, ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారి చేతుల్లో ప్రదర్శకులు తోలుబొమ్మల్లా మారారని ప్రధానమంత్రి కె.పి. శర్మ ఓలి ఆదివారం విమర్శించారు. అధికారపార్టీ సోషల్ మీడియాకు వ్యతిరేకం కాదన్నారు.

### భారత్ సరిహద్దులు కట్టుదిట్టం

నేపాల్‌లో జనరేషన్ జెడ్ ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చి హింసాత్మకంగా మారడంతో భారత ప్రభు త్వం సరిహద్దు ప్రాంతాన్ని కట్టుదిట్టం చేసింది. ప్రజలు వలసలు రాకుండా అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతాదళం అప్రమత్తమైంది. నేపాల్‌లో ఉన్న భారత జాతీయులు జాగ్రత్తలు పాటించాలని, హింసకు దూరంగా సురక్షితంగా ఉండాలని సలహా ఇచ్చింది. ఆ దేశానికి కొద్దిరోజులు రాకపోకలను రద్దుచేసుకోవాలని కూడా కేంద్ర ప్రభు త్వం భారతీయులకు సలహా ఇచ్చింది. ఆ దేశంలో ఏర్పడిన రాజకీయ అస్థిరత, ఇతర పరిణామాలను కూడా జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు భారత విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. తోటి సన్నిహితదేశంలో రాజకీయ పరిణామాలపై విదేశాంగశాఖ స్పందిస్తూ, చర్చల ద్వారా వారు సమస్యలు పరిష్కరించుకుంటారన్న ఆశాభావం వ్యక్తం చేసింది.

## పునః మూల్యాంకనం
(మొదటి పేజీ తరువాయి)

మూల్యాంకనాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై రెండు ఆప్షన్స్‌తో కూడిన కీలక తీర్పును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు మంగళవారం వెలువరించారు. గ్రూప్ 1 మూల్యాంకనం తిరిగి నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కొందరు అభ్యర్థులు, ఉద్యోగ ఎంపిక ప్రక్రియ మొదలయ్యే దశలో కోర్టు జోక్యం చేసుకోరాదని మరికొందరు అభ్యర్థులు దాఖలు చేసిన సుమారు 20 పిటిషన్లపై న్యాయమూర్తి సుదీర్ఘంగా వాదనలు విన్నాక తీర్పును గత జులై 7న వాయిదా వేశారు. మంగళవారం 222 పేజీల తీర్పును వెలువరించారు. సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో అనేక లోపాలకు పాల్పడిందన్నారు. ఆచరణలో అనేక అవకతవకలు జరిగాయని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు, వాళ్ల సమర్పించిన పత్రాల పరిశీలన, విశ్లేషణ తరువాత గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను కమిషన్ పారదర్శకంగా నిర్వహించలేదని తేలిందన్నారు. కమిషన్ పారదర్శకత, సమగ్రతను కొనసాగించలేదని, పక్షపాతంతో వ్యవహరించిందని తప్పుపట్టారు. కమిషన్ ఉద్యోగ నియామక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. నిర్లక్ష్యం, అసమర్థత కనబడ్డాయన్నారు. నిరుద్యోగ యువత ఎంతో శ్రమించి గ్రూప్ 1 ఉద్యోగం సాధించాలనే ప్రయత్నాలకు అవరోధం కల్పించిందన్నారు. నిత్యం పది గంటలకుపైగా చదువుకోవడం, కోచింగ్ సెంటర్స్‌కు వెచ్చించడం, ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసి చదివిన అభ్యర్థులకు నిరాశ చేకూర్చిందన్నారు. మూల్యాంకన వ్యవహారంతోపాటు విధానపరంగా కూడా కమిషన్ లోపాలకు పాల్పడిందన్నారు. గతంలో రెండుసార్లు గ్రూప్–1 పరీక్ష రద్దు అయ్యాయని, ఈ మేరకు హైకోర్టు వెలువరించిన తీర్పుల తర్వాత కమిషన్‌లో మార్పులు రాలేదన్నారు. గత మార్చి 10వ తేదీన వెలువరించిన తుది మార్కుల జాబితాను, 30వ తేదీ నాటి జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సంజయ్ సింగ్– యు.పి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేసులో సుప్రీం కోర్టు తీర్పులోని సూచనల మేరకు మోడరేషన్ పద్ధతిలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల సమాధాన పత్రాలను మాన్యువల్‌గా తిరిగి మూల్యాంకనం చేయాలని కమిషన్‌ను ఆదేశించారు. ఇలా చేశాకే ఫలితాలను వెల్లడించి నోటిఫికేషన్‌కు అనుగుణంగా పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఒకవేళ పునః మూల్యాంకనం చేయలేకపోతే, గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను రద్దు చేయాలని, ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు తిరిగి మెయిన్స్ పరీక్ష జరపాలన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 19వ వెలువడిన ఉద్యోగ నోటిఫికేషన్ (నెం.02/ 2024) మేరకు పరీక్షలను నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియ 8 నెలల్లోగా పూర్తి చేయాలన్నారు.

జనరల్ ర్యాకింగ్స్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తమ తీర్పుకు అనుగుణంగా మళ్లీ మూల్యాంకనం చేయాలని, పునః మూల్యాంకనం సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్ నిర్వహించాలన్నారు.2024 సంవత్సరం ఫిబ్రవరి 19వ తేదీన 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌కు అనుగుణంగానే తిరిగి పోస్టుల భర్తీ ఉండాలన్నారు అదే ఏడాది మే/జూన్ నెలల్లో ప్రిలిమ్స్, అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలు జరిగాయని, ఈ ఏడాది మార్చిలో మెయిన్స్ ఫలితాలు వెలువడ్డాయని, గత ఏప్రిల్‌లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కూడా పూర్తైందని తీర్పులో ప్రస్తావించారు. అర్హత సాధించిన పలువురు అభ్యర్థులు పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు.ఈ నేపథ్యంలో హైకోర్టు, న్యాయమూర్తి టీజీపీఎస్సీకి రెండు ఆప్షన్లు హైకోర్టు రెండు సూచనలు చేశారు. మెయిన్స్ అభ్యర్థుల పేపర్లు పునః మూల్యాంకనం చేయాలని, పునః మూల్యాంకనం సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్ నిర్వహించాలని కమిషన్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా, సింగిల్ జడ్జి తీర్పుపై ద్విసభ్య ధర్మాసనం ఎదుట అప్పీల్ దాఖలు చేయాలనే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

## అండగా నిలవండి
(మొదటి పేజీ తరువాయి)

సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితి నుంచి మినహాయించాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో సుమారు 90 శాతంగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాలలోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సిఎం వివరించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో నార్త్ బ్లాక్‌లోని ఆమె కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కేంద్ర మంత్రికి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు సిఎం వివరించారు. ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, 2.70 లక్షల మంది విద్యార్థులకు ఈ పాఠశాలలలో చదువుకునే అవకాశం లభిస్తుందని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు.

### రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించండి

గత ప్రభుత్వం ఇష్టానుసారంగా అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చిందని, వాటి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారిన నేపథ్యంలో వాటి రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఎంపిలు డాక్టర్ మల్లు రవి, పోరిక బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్
(మొదటి పేజీ తరువాయి)

15 ఓట్లు చెల్లుబాటు కాకుండా వృధా చేశారన్న సంకేతాలు కనిపిస్తున్నాయని, వారంతా పరోక్షంగా రాధాకృష్ణన్‌కు అనుకూల ఓటు వేశారని చెప్పుకున్నారు. బిజెపి ఎంపి సంజయ్ జైశ్వాల్ మాట్లాడుతూ, దాదాపు 40 మంది ఎంపీలు తమ మనస్సాక్షి చెప్పినట్లుగా విని ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ఇచ్చి ఓటు వేశారని, అందుకే అనేక ఓట్లు వృధా చేసినట్లు కనిపిస్తోందన్నారు.

పార్లమెంటు కొత్త భవనం 'వసుధ'లోని రూమ్ నెంబర్ 101లో ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ముగిసేనాటికి 98.2 శాతం ఎంపీలు ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. 12 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. పోలింగ్ పూర్తయిన గంట తర్వాత కొత్త పార్లమెంటు భవనంలో పి.సి.మోదీ పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ''ఇండియా కూటమి'' అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, రాధాకృష్ణన్ మధ్య ముఖాముఖీ పోటీ జరిగింది. ప్రతిపక్షాలు ఈ ఎన్నికను మతఛాందసవాదులకు,ప్రజాస్వామ్యవాదులకు మధ్య సైద్ధాంతిక పోరాటంగా ప్రకటించాయి. ఈ ఎన్నికల్లో పార్టీల తరపున ఎలాంటి విప్ అమలులో లేదు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అందరికంటే మొదట ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. ''ఉపరాష్ట్రపతి ఎన్నిక–2025లో ఓటుహక్కు ఉపయోగించుకున్నాను'' అని పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ వరదప్రాంతాలలో పర్యటనకు బయలుదేరేముందు, ఎక్స్‌వేదికగా మోదీ పోస్టింగ్ పెట్టారు. ప్రధానమంత్రి తర్వాత ముందుగా ఓటువేసినవారిలో కాంగ్రెస్‌పార్టీ మాజీఅధ్యక్షురాలు సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ, సమాజ్‌వాదీపార్టీ నాయకుడు రామ్‌గోపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్, నస్సెర్ హుస్సేన్, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, అర్జున్ రామ్ మేఘూవాల్, ప్రహ్లాద్ జోషి, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ హరివంశ్, జితేంద్రసింగ్, ఎల్.మురుగన్ తదితర పలువురు ప్రముఖులు ఓటు వేశారు. 92 ఏళ్ళు వయసుగల మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ వీల్‌ఛైర్‌లో వచ్చి ఓటు వేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఇద్దరూ చేయి చేయి పట్టుకుని నడుచుకుంటూ పోలింగ్ బూత్ వద్దకు రావడం కనిపించింది. ఉదయం నుండే ఎంపీలు క్యూలైనులో నిలబడ్డారు. బిఆర్‌ఎస్ (4), బిజెడి(7)పార్టీలకు చెందిన 11 మంది ఎంపీలు ఈ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో తాము పాల్గొనడం లేదని ఆ పార్టీల నాయకత్వాలు ముందే ప్రకటించాయి. మధ్యాహ్నంలోపే ముమ్మర ఓటింగ్ జరిగింది. జమ్మూ,కశ్మీరు బారాముల్లా నుండి లోక్‌సభ ఎంపి, ఇంజనీర్ రషీద్ (58) పోలీసు కస్టడీ మధ్య కోర్టు అనుమతితో ఓటు వేసేందుకు వచ్చారు. 2019 నుండీ రషీద్ తీహార్ జైలులో ఉన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) రైసీద్‌ను చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నియంత్రణ చట్టం కింద అరెస్టు చేసింది. రషీద్ ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

### ప్రధానమంత్రి అభినందన

ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి మోదీ రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలియజేశారు. రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్ పదవిలో ఉన్నారు. ఆయన కరడుగట్టిన ఆర్‌ఎస్‌ఎస్ వాది. తొలుత ఆయన జనసంఘ్‌లో ఉన్నారు. తర్వాత తమిళనాడు బిజెపిలో పాత్ర వహించారు. ''అభినందనలు తిరు సి.పి.రాధాకృష్ణన్‌జీ, మీరు మీ జీవితాన్ని సమాజ సేవకే అంకిం చేశారు, పేదల సాధికారతకు ధారవోశారు'' అని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ఇంకా రెండు సంవత్సరాలు గడువు ఉండగానే, జగదీప్ ధన్‌కర్ జులై 21న ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు.

### రాజ్యాంగం కోసం పోరు కొనసాగుతుంది
జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ఈ ఎన్నిక రాజ్యాంగంకోసం జరిగే పోరాటమని, ఈ ఎన్నిక తర్వాత కూడా ఈ పోరాటం కొనసాగుతుందని 'ఇండియా కూటమి' ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ''పజల మనస్సాక్షిని మేల్కొలిపేందుకు మాత్రమే నేను ప్రయత్నం చేస్తున్నారు, ది రాజ్యాంగంకోసం జరిగే పోరాటం, ఈ పోరు కొనసాగుతుంది, నామీద ప్రేమచూపించి నన్ను పోటీలో ఉంచిన అందరికీ, ప్రతిస్పందించిన పౌర సమాజానికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను'' అని సుదర్శన్‌రెడ్డి చెప్పారు.

ఎన్‌డిఎ అధికార కూటమి తరపున ఎన్నికల ప్రక్రియకు ఏజంట్లుగా కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు, రామ్ మోహన్ నాయుడుతో పాటు శివసేన లోక్‌సభ ఎంపి శ్రీకాంత్ షిండే నియమితులయ్యారు. మేం కేవలం గెలుస్తామనే భరోసా మాత్రమే కాదు, చాలా ఖచ్చితమైన విజయం సాధిస్తామన్న విశ్వాసం ఉంది అని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పోలింగ్ సమయంలో పాత్రికేయులతో అన్నారు.

## ఆర్‌ఆర్‌ఆర్‌కు 90శాతం భూసేకరణ పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రీజినల్ రింగు రోడ్డుకు (ఉత్తర భాగం) సంబంధించి 90 శాతం భూ సేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి ఆర్థిక, క్యాబినెట్ అనుమతులు ఇప్పించాలని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కోరారు. జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ (ఎంఆర్‌టిహెచ్) నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డిపిఆర్‌కు అనగుణంగా రీజినల్ రింగు రోడ్డు (దక్షిణ భాగం) కు అనుమతులు ఇప్పించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ మంగళవారం సాయంత్రం కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రావిర్యాల ఆమన్‌గల్ మన్ననూర్ రహదారిని నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిగా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మన్ననూర్‌శ్రీశైలం (ఎన్‌హెచ్ 765) నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి గడ్కరీని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ మంచిర్యాల మధ్య నూతన గ్రీన్ ఫీల్డ్ రహదారిని జాతీయ రహదారిగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారికి అనుమతి ఇవ్వాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు.

# పత్తిపై దిగుమతి సుంకం ఎత్తివేత

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికా దిగుమతి పత్తిపై దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం మన రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం పామాయిల్ పంటపై దిగుమతి సుంకాలను పెంచి పామాయిల్ రైతులను రక్షించాలని కేంద్రాన్ని కోరుతుంటే, అమెరికా నుండి దిగుమతి అయ్యే పత్తిపై సుంకాన్ని ఎత్తివేయడం కేంద్ర ద్వంద్వ వైఖరిని ప్రతిబింబిస్తోందని మంత్రి అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుల్లో ఒకటైనప్పటికీ, అమెరికా ఒత్తిడికి మేరకు పత్తి దిగుమతులపై అమలులో ఉన్న 11 శాతం సుంకాన్ని (బిసిడి + ఎఐడిసి+ ఎస్‌డబ్ల్యుఎస్) ప్రధాని మోదీ ప్రభుత్వం ఎత్తివేసిన నిర్ణయం దేశీయ రైతులకు తీవ్రమైన దెబ్బ అన్నారు. ఆగస్టు 19 నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు మాత్రమేనని ప్రకటించిన ఈ మినహాయింపును తాజాగా డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించడం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ సదస్సులో రైతుల ప్రయోజనమే తమ ప్రథమ కర్తవ్యమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి అందుకు వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల పత్తి రైతులు ఆర్థికంగా నష్టపోనున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా వాడకాన్ని తగ్గించడానికి శాశ్వత చర్యలు తీసుకొనేందుకు వీలుగా రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు కల్పించాలని, ఆర్గానిక్ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించి దేశంలో యూరియా వాడకాన్ని తగ్గించేలా దీర్ఘకాల చర్యలు చేపట్టాలని మంత్రి కేంద్రాన్ని డిమాండ్ చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మిషన్ భగీరథ ట్యాంక్‌లో దిగి ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృతి



**ప్రజాపక్షం/చర్ల :** మండల పరిధిలోని ఉంజుపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరద వాటర్ ట్యాంక్‌లో సెంట్రింగ్ సరిచేసే నిమిత్తం దిగిన ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మొదట దిగిన కూలీ ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లగా అతన్ని కాపాడేందుకు వెళ్లిన మరో ముగ్గురు కూలీల్లో ఇద్దరు కూడా మృతి చెందారు. వారిని చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఇద్దరి మృతి చెందగా, మరో ఇద్దర్ని భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృత చెందిన వారిలో కాకా మహేష్, నీలం తులసీ రామ్, ఏపిలోని చోడవరంకు చెందిన మరో వ్యక్తి ఉన్నారు. సిఐ రాజు వర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా ఉద్యమ దిక్సూచి సురవరం

### వందేళ్ల పోరాట నవ యవ్వని సిపిఐ
### ప్రజా ఉద్యమ నిర్మాణమే సురవరానికి సరైన నివాళి
### సంస్మరణ సభలో అఖిలపక్ష నేతలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అరవై ఐదేళ్ల ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించి చారిత్రిక ఉద్యమ విజయాలను చవిచూసిన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజా ఉద్యమ దిక్సూచి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. విద్యార్థి దశ నుంచే ధిక్కార స్వరంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సురవరం అంచలంచెలుగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థాయికి చేరారని ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని ఆయన స్ఫూర్తి భవిష్యత్తు ఉద్యమానికి ప్రేరణ అని ఆయన తెలిపారు. ఇటీవల మరణించిన సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. సభకు ముందు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణానికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి నిరంతర అధ్యయనశీలి అని తన వాదన పటిమతో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. కమ్యూనిస్టులు మరణించి సైతం ప్రజల మదిలో జీవిస్తారని సుధాకర్ రెడ్డి అదే కొవకు చెందిన వారన్నారు. వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి మరణంతో ఓ ప్రజా గొంతుక మూగబోయిందన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తపించిన సుధాకర్‌రెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీలో చంద్ర రాజేశ్వరరావు తర్వాత అత్యున్నత స్థాయికి చేరిన తెలుగుబిడ్డ అని ఆయన తెలిపారు. పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలోనే తాను ఓనమాలు నేర్చుకున్నానని సుధాకర్‌రెడ్డి లాంటి నేతలు మరణించడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. కమ్యూనిస్టులకు ప్రజలే ముఖ్యమని పదవులు కాదని తెలిపిన పాయం తాను ఇప్పటికీ ఎప్పటికీ కమ్యూనిస్టులను గౌరవిస్తూనే ఉంటానన్నారు. మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టులు మరణించిన ప్రజల గుండెల్లో జీవించి ఉంటారని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరి మధు, సిపిఎం నాయకులు అన్నవరపు సత్యనారాయణ, మాజీ జెడ్పి ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, ఆళ్ల మురళి, టిడిపి నాయకులు కె.అనంతరాములు, వివిధ ప్రజా సంఘాల నేతలతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, వెంకటేశ్వరరావు, కె.సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేందర్, ఉదయ్ భాస్కర్, కొత్తగూడెం సొసైటీ ఛైర్మన్ మండే వీరహన్మంతరావు, గ్రంథాలయ ఛైర్మన్ పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. కంచర్ల జమలయ్య ఆహుతులను వేదికపైకి ఆహ్వానించారు.

# పెట్టుబడులతో తెలంగాణకు రండి

### తిరుపూరు పారిశ్రామికవేత్తలతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణాలో దుస్తుల (అప్పెరల్) పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాల్సిందిగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తమిళనాడులోని తిరుపూరు దుస్తుల తయారీపరిశ్రమల యాజమాన్యాలను ఆహ్వానించారు. ఇక్కడి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వస్త్ర పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రపంచస్థాయి మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరు, తిరుపూరులను మంగళవారం ఆయన సందర్శించిన సందర్భంగా అక్కడి పారిశ్రామిక వర్గాలు, ఎగుమతిదారులతో మాట్లాడారు. అతి పెద్ద అప్పెరల్ తయారీ కేంద్రంగా తిరుపూరు గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని ఆయన అన్నారు. 10 వేల దుస్తుల పరిశ్రమలతో 'నిట్ వేర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తిరుపూరు లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని ప్రశంసించారు. దేశంలోని 90 శాతం దుస్తులు, క్యాజువల్ వేర్, స్పోర్ట్స్‌వేర్, సాక్సులు, టోపీల లాంటివి కాటన్ ఉత్పత్తులు తిరుపూరు నుంచే ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. 1990 నుంచి తిరుపూరు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన దుస్తులను ఎగుమతి చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేసారు. నాణ్యతతో కూడిన రెడీమేడ్స్ తయారీకి అవసరమయ్యే లాంగ్ స్టేపుల్ (పొడవు పోగుల) కాటన్ తెలంగాణాలో సమృద్ధిగా అందుబాటులో ఉందని శ్రీధర్‌బాబు వారికి వివరించారు. తెలంగాణా వ్యవసాయ, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసే రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావాల్సిందిగా వారిని కోరారు. త్వరలో దీనికి సంబంధించిన సమాచారం అందజేస్తామని తెలిపారు.

అందరితో చర్చించిన తర్వాత తెలంగాణా నూతన టెక్స్ టైల్స్ పాలసీని రూపొందిస్తామని వెల్లడించారు. అమెరికా విధించిన 50 శాతం సుంకాల నేపథ్యంలో ఎగుమతులు దెబ్బతిన్నాయని, ఈ సమయంలో వస్త్ర పరిశ్రమ చేపట్టాల్సిన కార్యాచరణపైన కూడా చర్చించవచ్చని శ్రీధర్ బాబు అన్నా రు. ఈ సందర్భంగా ఆయన హీరో ఫ్యాషన్ గ్రూప్ (రామ్ రాజ్ కాటన్స్) ఛైర్మన్ కెఆర్ నాగరాజన్, ఎండి సుందరమూర్తిలను ప్రత్యేకంగా కలిసారు. సౌత్ ఇండియా మిల్స్ అసోసియేషన్ (సిమా) సెక్రటరీ జనరల్ కె.సెల్వరాజ్, సంస్థ సభ్యులను తెలంగాణాలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. సులభతరపారిశ్రామిక విధానాల అమలుతోతమ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేసారు. తిరుపూరు ఎగుమతిదారుల సంఘం గౌరవఛైర్మన్ డా.ఎ.శక్తివేల్, అధ్యక్షుడు కెఎం.సుబ్రమణియన్, కార్యవర్గ సభ్యులు తితుకుమరన్, కుమార్ దొరైస్వామి, సౌత్ ఇండియా మిల్స్ అసోసియేషన్‌కు చెందిన కె.సెల్వరాజ్, గోపీ కుమార్ (చంద్ర గ్రూప్), ప్రతినిధి ఎం.ప్రభు దామోదరన్(ఇండియన్ టెక్స్ ప్రెన్యూర్స్ ఫెడరేషన్ కోయంబత్తూరు)లతో శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. పెట్టుబడులతో వస్తే వారికి కావాల్సిన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తిరుపూరులోని నేతాజీ అప్పెరల్ పార్కును సందర్శించి ఇండస్ట్రీ ప్రతినిధులతో మాట్లాడారు. పర్యటనలో టిజిఐఐసి ఎండీ శశాంక, తెలంగాణా టెక్స్‌టైల్స్, అప్పెరల్ విభాగం డైరెక్టర్ ధరణి కుమార్ కోగంటి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు క్రమశిక్షణకు సూచిక

### 'ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్-2025' ప్రారంభ సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడలు పోటీలకు మాత్రమే కాకుండా క్రమశిక్షణ, విధులు, అంకిత భావానికి సూచికగా నిలుస్తాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీసు అకాడమీలో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్2025 ప్రారంభోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిధిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల జైళ్ల శాఖల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ.. జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు. ప్రిజన్ సిబ్బంది, ప్రజల దృష్టికి దూరంగా ఉన్నప్పటికీ, అంతర్గత భద్రతను కాపాడడంలో జైళ్లలో సంస్కరణలను సాధ్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారని ఆయన హైలైట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం జైళ్ల సంస్కరణలలో చేస్తున్న ప్రగతిశీల చర్యలను ఆయన కొనియాడారు. 2024 రిపబ్లిక్ డే సందర్భంగా 231 మంది ఖైదీలను మంచి ప్రవర్తన కారణంగా విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ విడుదల కేవలం శిక్షా రాయితీలు మాత్రమే కాక, వారికి కొత్త జీవితాన్ని అందించే ఆశాకిరణాలని ఆయన అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 7వ అఖిల భారత జైలు డ్యూటీ మీట్ – 2025 సెప్టెంబర్ 9 నుండి 11 వరకు హైదరాబాదులోని ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని 21 రాష్ట్రాలు మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 1,300 మందికి పైగా జైలు సిబ్బంది (ఇందులో 184 మంది మహిళలు) పాల్గొని 36 విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. వీటిలో ప్రథమ చికిత్స, వెల్ఫేర్ పథకాలు, క్విజ్, కంప్యూటర్ నైపుణ్యం వంటి వృత్తి సంబంధిత పోటీలు, అలాగే అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, కరాటే, క్రావ్ మాగా, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి క్రీడలు, సాంస్కృతిక పోటీలు ఉంటాయి. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రం రెండవసారి ఆతిథ్యం ఇస్తోంది. 2015లో తొలిసారి నిర్వహించగా, 2022లో అహ్మదాబాద్‌లో జరిగిన 6వ జైలు డ్యూటీ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ఈసారి తొలిసారిగా ఆల్ ఇండియా టెక్నో ఎక్స్‌పో మరియు జైలు ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ డిజి డా.సౌమ్య మిశ్రా, డిజిపి డాక్టర్ జితేందర్, అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పరీక్షలు నిర్వహించాలి

### హైకోర్ట్ తీర్పు చరిత్రాత్మకం.. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రూప్ 1 పరీక్షల అంశంలో హైకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చిందని, ప్రభుత్వం కేవలం రీవాల్యుయేషన్‌కు పోకుండా, గతంలో తప్పు చేసిన వారి చేతికే మళ్లీ సమస్యను అప్పగించకుండా తిరిగి పరీక్షలను నిర్వహించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు డిమాండ్ చేశారు. టిఎస్‌పిఎస్‌సి అవినీతి, పరీక్షల అస్తవ్యస్త నిర్వహణపై సిట్టింగ్ హైకోర్ట్ లేదా సుప్రీం కోర్ట్ జడ్జితో జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, సమగ్రంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలను అమ్ముకుంటూ వ్యాపారం చేసిన బ్రోకర్లు, తప్పిదాలు చేసిన అధికారులు బయటకు రావాలన్నారు. ఎవరు ఉద్యోగాలను అమ్ముకున్నారో తేలాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్ని ఉద్యోగాలు ఇస్తుందో తేల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెండు లక్షల ఉద్యోగాల విషయంలో వాస్తవాల కోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. గతంలో ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగులోకి వచ్చినప్పుడు అప్పటి సిఎం కెసిఆర్ వెంటనే పరీక్షను రద్దు చేశారని కెటిఆర్ గుర్తు చేశారు.

**'గ్రూప్-1 తీర్పు' ప్రభుత్వానికి చెంపపెట్టు : రాంచందర్ రావు**

గ్రూప్1 పరీక్ష పత్రాల రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. గ్రూప్1 పరీక్ష నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నోటిఫికేషన్ విడుదల నుండి మూల్యాంకణం వరకు అన్ని తప్పుడు పద్ధతులలోనే టిజిపిఎస్‌సి అవలంభించిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని, వేలాది మంది అభ్యర్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడిందని దుయ్యబట్టారు. ఒకే పరీక్ష కేంద్రంలోని ఒకే గదిలో ఎక్కువ మంది అభ్యర్థులు ఎంపిక కావడం, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని రాంచందర్ రావు ఆరోపించారు.

**తీర్పును పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటాం : మంత్రి జూపల్లి**

గ్రూప్ 1 విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. కోర్టు తీర్పును పరిశీలించి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని మంత్రి చెప్పారు. పదేళ్లు గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేని అసమర్థత గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు.

**నిరుద్యోగులకు మంచి చేసే నిర్ణయం తీసుకుంటాం : ఎంపి చామల**

నిరుద్యోగులకు మంచి చేసే విధంగా టిజిపిఎస్‌సి, ప్రభుత్వం కలిసి నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గ్రూప్ 1 విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బిఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు అడ్డగోలుగా కామెంట్స్ చేస్తున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు మీరు పరిష్కారం గురించి మాట్లాడాల్సింది పోయి రాజకీయంగా మాట్లాడుతుండడం దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. డిఎస్‌సి, గ్రూప్1,2,4 పరీక్షలు పెట్టని బిఆర్‌ఎస్ నేతలు నేడు మాట్లాడడం గర్హనీయమన్నారు. టిజిపిఎస్‌సి పరీక్ష పేపర్లను జిరాక్స్ సెంటర్ల వద్ద అమ్ముకున్నది బిఆర్‌ఎస్ నేతలు కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత డిఎస్‌సి ద్వారా11 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, గ్రూప్ 1,2 పరీక్షలు పెట్టామని, ఉద్యోగాలను భర్తీ చేయాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నామన్నారు.

## ఎల్లంపల్లి ప్రాజెక్టును పూర్తి చేసింది టిఆర్‌ఎస్సే : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిఆర్‌ఎస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఎల్లంపల్లి ప్రాజెక్టును రూ.2052 కోట్లతో పూర్తి చేసి, 2016లో పూర్తిస్థాయిలో 20 టిఎంసిల నీటిని నింపామని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎల్లంపల్లి నుండి మిడ్ మానేరు వరకు కెనాల్స్, గ్రావిటీ కెనాల్, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, పంప్ హౌస్‌లను నిర్మించిందే బిఆర్‌ఎస్ అని, ఇవన్నీ కాళేశ్వరం ప్రాజెక్ట్ భాగంగానే నిర్మించామని వివరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌ఎలు సబితా ఇంద్రారెడ్డి, ముఠాగోపాల్, కాలేరువెంకటేష్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ సిఎం శంకుస్థాపన చేసిన వాటికి కూడా బిఆర్‌ఎస్ నిర్మించిన కాళేశ్వరం నీళ్లనే తీసుకెళ్తున్నారన్నారు. ఎల్లంపల్లి కెపాసిటీ 20 టిఎంసిలులు డెడ్ స్టోరేజ్ మూడు టిఎంసిలు, మిగిలిన 17 టిఎంసిల్లో సొంత ఆయకట్టు 1,65,000 ఎకరాలు అంటే 12 టిఎంసిలు పోతాయని, ఎన్‌టిపిసి విద్యుత్ ఉత్పత్తికి ఆరున్నర టిఎంసిలు అని అన్నారు. ఎల్లంపల్లి కెపాసిటీకి మించి మరో 20 టిఎంసిలు హైదరాబాద్‌కు ఎలా తెస్తారని ఆయన సిఎంను ప్రశ్నించారు. ఎల్లంపల్లి నుండి మల్లన్న సాగర్‌కు నీళ్లు గాలిలో వస్తున్నాయా అని ఎద్దేవా చేశారు. ఎల్లంపల్లి నుండి హైదరాబాద్‌కు మంచినీళ్లు తీసుకొచ్చే లైన్‌లో రైల్వే, మిలిటరీ స్థలాల అనుమతులు పెండింగ్ ఉంటే, రెండు సంవత్సరాల్లో రైల్వే, మిలిటరీ అధికారులను ఒప్పించి, తాము మెప్పించి హైదరాబాద్‌కు వాటర్ సప్లై స్కీమ్‌ను పూర్తి చేశామని హరీశ్‌రావు వివరించారు. కృష్ణ ఫేజ్ నాలుగు పనులను కూడా పూర్తి చేసి కృష్ణ నీళ్లను కూడా హైదరాబాద్ తెచ్చిందే కెసిఆర్ అని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ 1600 కోట్లను ఖర్చు చేసి 56 రిజర్వాయర్లు, 2600 కిలోమీటర్ల పైప్‌లైన్లు ఏర్పాటు చేశామన్నారు. నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజ్ నుంచి కూడా నీళ్లు తీసుకోవాలని,భవిష్యత్తులో వందేళ్ల కోసం నాగార్జునసాగర్ నుండి 60 టిఎంసిల నీళ్లు తీసుకోరావాలని సుంకిశాలను ప్రారంభించామని తెలిపారు.

## 16న హ్యూమన్ ట్రాఫికింగ్ – బాండెడ్ లేబర్ సమస్యలపై మీడియా వర్క్‌షాప్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'హ్యూమన్ ట్రాఫికింగ్ – బాండెడ్ లేబర్' అంశాలపై ప్రత్యేక మీడియా వర్క్‌షాప్‌ను ఈ నెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు తెలంగాణ మీడియా అకాడమి, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజెఎం) సంయుక్త ఆధ్వర్యంలో జరగనుంది. మీడియా ప్రతినిధులకు అవగాహన పెంపొందించడం, నేరాల తీవ్రతను అర్థం చేసుకోవడం, బాధితుల పట్ల ప్రదర్శించే వైఖరి లక్ష్యంతో ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్ బాధితుల పునరావాసం, న్యాయపరమైన, సమాజపరమైన మద్దతు అంశాలపై నిపుణులు ప్రసంగించనున్నారు. మీడియా పాత్ర, బాధితుల గౌరవాన్ని కాపాడుతూ సమగ్ర కథనాలను తయారు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. సివిల్ సొసైటీ ప్రతినిధులు, న్యాయ నిపుణులు, అనుభవజ్ఞులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ వేదిక జర్నలిస్టులు, ఎడిటోరియల్ టీమ్‌లకు అత్యంత ఉపయోగకరంగా ఉండనుంది. తెలంగాణ మీడియా అకాడమి ఈ సమస్యపై జర్నలిజానికి అవసరమైన అవగాహనను పెంచే లక్ష్యంతో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూ వస్తోందని తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఐజెఎం సంస్థ ఈ రంగంలో దేశవ్యాప్తంగా చేసిన అవిశ్రాంత సేవను మనందరికీ పరిచయం చేస్తూ, న్యాయవ్యవస్థతో కలిసి పనిచేస్తోందని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనదలచిన మీడియా ప్రతినిధులు ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం 1 గంట వరకు తమ పేరు, సంస్థ పేరు, హోదా, పనిచేస్తున్న ప్రదేశంతోపాటు తమ మొబైల్ నెంబర్‌ను మీడియా అకాడమి కార్యాలయ మేనేజర్ మొబైల్ నెంబర్ 7093600977కు వాట్సాప్ ద్వారా రిజిష్టర్ చేసుకోవాలన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణలో కుట్ర

### బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సిబిఐ విచారణ జరిపించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని బిజెపి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్‌ఎస్‌ను కాపాడే ప్రయత్నంలో భాగంగానే కేవలం మూడు బ్యారేజీలపై మాత్రమే విచారణకు అప్పగిస్తూ జిఓ జారీ చేసిందని విమర్శించారు. కానీ మూడు బ్యారేజీల విలువ కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమేనని, మిగతా లక్షల కోట్ల అవినీతిపై స్పష్టత లేదన్నారు. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసినా, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు మరమ్మతులు చేశారని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ సలహాలు కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ఒక కేసుపై విచారణ మొదలైనప్పుడు ఆధారాలను చెడగొట్టడం నేరమని, ఘోష్ కమిషన్ ఏర్పడిన తర్వాత రిపేర్లు చేయించడం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో స్పష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం జిఓలో 'టరమ్స్ అండ్ రిఫరెన్స్'ను ఎందుకు చేర్చలేకపోతుందని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టులను టెండర్లు లేకుండా ఎవరికి ఇచ్చారు, నాణ్యత లేకుండా పనులు చేసిన కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే అంశాలను జిఓలో పేర్కొనలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అన్ని అవినీతి అంశాలపై పూర్తి విచారణ జరగాలంటే జిఓలో సవరణలు తప్పనిసరి అని పాయల్ శంకర్ అన్నారు. లేకపోతే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కైనట్లే భావించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి 15 రోజుల గడువు ఇస్తున్నామని, జిఓను సవరించి పూర్తిస్థాయి సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ జిఓ సవరణపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

## కెటిఆర్..నీ నోటి దూల తగ్గించుకో..

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపులపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెగ వాగుతున్నాడని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆరోపించారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కెటిఆర్.. నీ నోటి దూల తగ్గించుకో.. బజారు మాటలు ఆపు అంటూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎంఎల్‌ఎలను ఆడా కాదు మగా కాదు అని నోటికొచ్చినట్లు మాట్లాడుతవా..? అని కెటిఆర్‌ను ప్రశ్నించారు. పదేళ్లలో నీ పార్టీలో చేరిన వారంతా అదే కోవకు చెందుతారా..? నువ్వు మొగాడివి అయితే చెప్పు ముందు అని అన్నారు. ప్రతిపక్ష పార్టీ ఎంఎల్‌ఎలని మంత్రి వర్గంలోకి తీసుకున్నవారు ఏ జాబితాలోకి వస్తారు..? ఆ నాడు నీకు ఈ జాతులు గుర్తుకు రాలేదా అని కెటిఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఉన్న పది మంది ఎంఎల్‌ఎలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. అందుకు వాళ్లు సమాధానం ఇస్తారు.. దాని ఆధారంగా స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

## దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎక్కువ మంది ప్రజలు కోరుతున్నారని ధరణి సమస్యలు, పాస్ పుస్తకాల జారీపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని, దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. చర్లపల్లిలోని డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీ కేసులో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## మేధావులను కలుస్తా :కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సామాజిక తెలంగాణ కోసం లెఫ్ట్, రైట్ వింగ్ నాయకులు, మేధావులను కలుస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కెసిఆర్ మూడవసారి గెలిస్తే సామాజిక తెలంగాణ చేసే వారని, ఆయన అజెండాను జాగృతి ముందుకు తీసుకెళ్తుందన్నారు. 'కాళోజీ నారాయణ జయంతి, చాకలి ఐలమ్మ వర్ధంతి' సందర్భంగా హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో వారి చిత్రపటాలకు కవిత మంగళవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిందన్న సిఎం రేవంత్ రెడ్డి అదే ప్రాజెక్ట్‌లోని మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎలా తెస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్‌లో రేవంత్‌రెడ్డి భారీగా అవినీతికి పాల్పడుతున్నారని కవిత ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రముఖ కవులు, రచయితలు ఉషారాణి, డాక్టర్ కాంచనపల్లి, డాక్టర్ చమన్ సింగ్, లక్ష్మి నారాయణ, తిరుమల శ్రీనివాస్ ఆర్య, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: మల్కాజ్‌గిరి సర్కిల్-28**

NIT No. 33/EE-28/SBZ/GHMC/2025-2026 టెండర్ ప్రకటన

**పని పేరు:** నిర్వహణ పనులు - ఇతరాలు-01, **అంచనా విలువ:** రూ.5.20లక్షలు, **బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / ఆఖరి తేది & సమయం:** 09.09.2025న మ.01.00గం.ల నుండి 16.09.2025న మ.01.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్: 9154796465, 7331189186. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 7808-PP/CL/ADVT/1/2025-26, Date: 09-09-2025

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**

ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com

No. E1/DB/MCK/8201/recall/MCK/2025-26 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ రీకాల్ టెండర్ ప్రకటన తేది: 08.09.2025

వివిధ గ్రాంట్ల కింద రూ.135.74లక్షల అంచనా వ్యయంతో 20 పనులకుగాను వివిధ అభివృద్ధి, నిర్వహణ మరియు వెహికిల్ ఇన్సూరెన్స్. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:** 09.09.2025న సా.04.00గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది:** 19.09.2025న సా.04.00గం.ల వరకు, మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్

DIPR R.O. No. : 7777-PP/CL/ADVT/1/2025-26, Date: 09-09-2025

## వెల్లంకి గ్రామాన్ని సందర్శించిన యుపి ప్రజాప్రతినిధులు, అధికారులు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని వెల్లంకి గ్రామపంచాయతీని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. గ్రామంలోని మౌలిక సదుపాయాలైన గ్రామపంచాయతీ కార్యాలయం, రైతువేదిక, గ్రంథాలయాన్ని సందర్శించి సదుపాయాల కల్పన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో సురేష్, డీఎల్‌పీవో ప్రతాప్‌నాయక్, ఎంపీడీవో రాములు, ఎంపీఓ రావుఫ్‌అలీ, ఏఈ పీఆర్ గాలయ్య, ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్ అశిష్‌రాఘవ, ఏపీవో వెంకన్న, టీపీ సుచరిత, పంచాయతీ కార్యదర్శులు మోహన్, సుధా, అంగన్‌వాడి, ఆశా, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ బలోపేతానికి కృషి

**ప్రజాపక్షం/చివ్వెంల :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మోదీన్‌పురం గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలను వీడి కున్నూం ముత్తయ్య ఆధ్వర్యంలో దాదాపు 40 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దారోజు భాగ్యరాజు, ధరావత్ రవి పాల్గొన్నారు.



## వ్యవసాయ అధికారిణి సస్పెన్షన్

**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఆత్మకూర్(ఎస్) మండల వ్యవసాయ అధికారిని దివ్యను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని నెమ్మికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు యూరియా సరఫరా చేస్తుండగా ఆన్‌లైన్, భౌతిక అమ్మకాలలో తేడాలు వచ్చాయి. రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండగా యూరియా లేదంటూ రైతులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో రైతులు గందరగోళానికి గురయ్యారు. యూరియా సరఫరాను సక్రమంగా పర్యవేక్షణ చేయకుండా విధులపట్ల నిర్లక్ష్యం వహించినందుకు గాను ఆమెను సస్పెండ్ చేశారు.

## రెండు గేట్ల ద్వారా నీటి విడుదల



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద తగ్గు ముఖం పట్టడంతో ప్రాజెక్టు అధికారులు రెండు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. మంగళవారం ఉదయం వరకు లక్షకు పైగా కొనసాగిన ఇన్ ఫ్లో ఆ తరువాత వెంటనే వేల క్యూసెక్కులకు తగ్గిపోవడంతో అధికారులు వెంటనే 14 డేట్‌ల ద్వారా కొనసాగిన నీటి విడుదల మొదట ఆరు గేట్లకు పరిమితం చేసి ఆ తర్వాత ఇంకా వరద తగ్గుముఖం పట్టడంతో రెండు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ కు మంగళవారం సాయంత్రానికి 70038 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తూ ఉండటంతో రెండు గేట్లను ఐదు అడుగుల మేర పైకి లేపి 16012 క్యూసెక్కుల నీటిని స్పిల్ వే ద్వారా దిగువకు చేస్తున్నారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు గాను మంగళవారం సాయంత్రానికి 589.10 అడుగులుగా ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలకు 309.3558 టిఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 9349 క్యూసెక్కులు ఎస్ ఎల్ బి సి ఏ ఎం ఆర్ పి ద్వారా 2400క్యూసెక్కులు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 32277క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో ప్రాజెక్టుకు మొత్తం70038 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉండటంతో అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు.

## పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలి

### రాష్ట్ర ఎస్‌సి ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏఎఫ్ఓ విదేశీ విద్య కన్సల్టెన్సీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషన్ చైర్మన్ మాట్లాడుతూ విదేశాలలో ఉన్నత విద్య చదువుకునేందుకు గ్రామీణ విద్యార్థులు ఎఎఫ్ఓ కన్సల్టెన్సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంబేద్కర్, జ్యోతిరావు విదేశీ విద్యా పథకాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించు కోవాలని తెలిపారు. ఉన్నత విద్య ద్వారా తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో పేద విద్యార్థులను విదేశాలకు ఉన్నత విద్యకోసం విద్యార్థులకు సహాయం చేస్తున్న ఏఎఫ్ఓ డైరెక్టర్ సురేష్ నాయకును చైర్మన్ అభినందించారు. సురేష్ నాయక్ మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య చదువుకోవాలని అనుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు తమ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి ఎస్‌టి కమీషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



**ప్రజాపక్షం/చండూరు:** ప్రకృతిని గౌరవించుకొని ప్రతి ఇల్లు మొక్కలతో కళకళలాడాలని , విద్యార్థి దశలో పర్యావరణ పరిరక్షణ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి పిలుపునిచ్చారు. చండూరు మున్సిపల్ కమీషనర్ మల్లేశం ఆధ్వర్యంలో చండూరు హైస్కూల్ లో జరిగిన పర్యావరణ సంరక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. రైజింగ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎనమిది పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన , చిత్రలేఖన పోటీలు గతంలో నిర్వహించగా వాటిలో విజేతలైన వారికి మంగళవారం బహుమతి ప్రదానం ఆర్డీఓ చేతుల మీదుగా అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు మద్దోజు సుధీర్ బాబు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ కమీషనర్ ఎల్. మల్లేశం, మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/గుండాల:** ఫ్రీ ప్రైమరీ స్కూల్ రద్దు చేసి అంగన్‌వాడీ టీచర్లను ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శ అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లను నడిపించాలని ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలకు ఐదు సంవత్సరాల వరకు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ వారికి ఆట పాటలతో పాటు ఎలాంటి ఒత్తిడి లేకుండా దృష్టి చదువు వైపు వెళ్లే విధంగా పిల్లలను ప్రోత్సహిస్తూ ఉన్నారన్నారన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రభుత్వం 36 నెలలు నిండిన పిల్లలకు ఫ్రీ ప్రైమరీ స్కూల్ పేరుతో పౌష్టికాహారాన్ని దూరం చేస్తూ వారిని మానసికంగా ఒత్తిడికి గురయ్యే విధంగా ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లను తీసుకువచ్చారని తక్షణమే ఫ్రీ ప్రై మరీ స్కూల్ అమలు చేయాలని ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలన్నారు.

## కాళేశ్వరం అవినీతిపై సిబిఐ దర్యాప్తు అంటే బిఆర్ఎస్ నాయకులకు వణుకు

### తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని దీనిపై సిబిఐ ఎంక్వైరీ చేయిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే బిఆర్ఎస్ నాయకులకు వణుకెందుకని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 రోజులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిని ప్రజల ముందుకు ప్రభుత్వం తీసుకవచ్చేందుకు అసెంబ్లీలో చర్చిస్తే తమ బండారం బయటపడడంతో గత పాలకులు తట్టుకోలేకపోతున్నారని అన్నారు. గుమ్మడి కాయల దొంగలంటే తడుముకున్నట్లు ఒక్కొక్క నాయకుడు తమకు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, జగదీష్ రెడ్డిలు కాళేశ్వరం జలాలపై క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట ప్రాంతానికి వస్తున్న నీళ్ళు కాళేశ్వరం ద్వారా వస్తున్నాయా లేక ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి వస్తున్నాయా అనే విషయం ప్రజలకు చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వేల కోట్ల రూపాయలు అవినీతి జరగడంతో రాష్ట్రం అప్పులపాలైందని దీని వడ్డి ఖర్చే రూ. 6 నుండి 7 వేల కోట్లు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇది గుదిబండగా మారి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని



చెప్పారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోనే పోచంపల్లి నుండి కాల్వల ద్వారా ఈ ప్రాంతానికి నీళ్ళు వచ్చిన విషయాన్ని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి గమనించాలన్నారు. కాళేశ్వరం లేకుండానే అప్పట్లో రైతులు పంటలు పండించుకున్నారని తెలిపారు. కాళేశ్వరం పేరిట అవినీతికి పాల్పడి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన దోషులను కఠినంగా శిక్షించాల్సిందేనని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యురాలు కవిత కూడా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సామాజిక మాధ్యమాలలో అసభ్య పదజాలం ఉపయోగించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను, కాంగ్రెస్ నాయకులను జగదీష్‌రెడ్డి అవమాన పరుస్తున్నారని తప్పు పట్టారు. యూరియా కొరతపై బిఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయద్దన్న విషయం వారికి తెలియదన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేయాల్సి ఉండగా చైనా నుండి దిగుమతి చేసుకోవడంలో కొంత ఇబ్బంది జరిగినట్లు బిజెపి ప్రజాప్రతినిధులే స్వయంగా చెబుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ వూర రాంమ్మూర్తి యాదవ్, నాయకులు సూదిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తండు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## నేడు సురవరం సంస్మరణ సభ



**ప్రజా పక్షం/నల్లగొండ:** సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి,మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభ ఈనెల10 బుధవారం నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్‌లోగల జీఎల్ గార్డెన్‌లో నిర్వహిం స్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి అంతర్జాతీయ దేశ రాజకీయాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని,నల్లగొండ జిల్లా అభివృద్ధికి దూరదృష్టితో అనేక పథకాలకు రూపకల్పన చేసిన మార్గదర్శకుడు అని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించిన గొప్ప నాయకుడు. రాజకీయ ప్రముఖ చిత్రంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా,రాజకీయ వేత్తగా, మేధావిగా,విలువలతో కూడుకున్న రాజకీయ ప్రముఖుల్లో సురవరం సుధాకర్ రెడ్డికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.నల్లగొండ జిల్లాను శాశ్వత కరువు,ఫ్లోరిన్ భారీ నుండి పారద్రోలటానికి కృష్ణా నదిపై చేపట్టిన ఎస్ఎల్ బిసి,డిండి ఎత్తి పోతలే శరణ్యమని వాటిని పూర్తి చేయుటకు ఆనాటి ముఖ్యమంత్రి పై ఒత్తిడి తీసుకొచ్చారు. కేంద్రం నుండి వచ్చే అనుమతులను తెప్పించుటలో ఆయన కృషి చాలా గొప్పది అన్నారు.ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి,నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీరా రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీని వాస్ రెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు,మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట రెడ్డి,సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డిలు పా ల్గొంటున్నారని తెలిపారు. కావున సంస్మరణ సభలో పార్టీ కార్యకర్తలు,సానుభూతిపరులు,మేధావులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలుగు భాష,సంస్కృతిని శిఖరంలో నిలబెట్టిన ఘనత కాళోజి నారాయణరావుది ప్రభుత్వ డైట్ కళాశాలకళాశాల ప్రిన్సిపాల్ నరసింహ అని కొనియాడారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని కాళోజి నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తెలుగు సాహిత్యం అభివృద్ధి కొరకు ఎంతో పాటు పడారని, శాసనమండలి సభ్యులుగా కూడా పనిచేసి సేవలు అందించారని, ఆయనకు ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు కూడా ఇచ్చిందని అన్నారు. ప్రముఖ రచయిత మేరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో నా గొడవ సాహిత్యం ద్వారా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ,లెక్చరర్స్ నరేందర్ రెడ్డి, బానుప్రకాష్,స్వాతి, వినోద్, హన్మంత్ ఉన్నారు.



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో ఇస్మాయిల్, సూపరిండెంట్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పృథ్వీ, సోమయ్య, బైబిజాన్, రాజేందర్, దశరథ్, మహేశ్వరీ, మహేష్, కవిత, సుధాకర్ పాల్గొన్నారు.

## నాలుగు వేల అమరవీరుల రక్త తర్పణమే...

### తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు జయప్రదం చేయండి : పల్లా నర్సింహారెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/దేవరకొండ:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఈనెల 11 నుండి 17 వరకు ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన నియోజకవర్గ సిపిఐ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాంకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లికించదగినదని అన్నారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని బిజెపి ప్రభుత్వం హిందూ ముస్లీంల మధ్య పోరాటంగా చిత్రీకరించడం విచారకరమని అన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల అమరవీరుల రక్త తర్పణం చేయడం జరిగిందన్నారు. దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి దున్నేవాడిదే భూమి కావాలని లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ కే దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహోత్తరమైన పోరాటాన్ని అవమానపరిచి సాయుధ పోరాట యోధులకు రావాల్సిన ఫించన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబర్ 17 పేరుతో బిజెపి అమరవీరులను స్మరించుకోవడం సిగ్గు చేటని దీని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుండి 17 వరకు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై కక్షగట్టి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటను ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. దీని మూలంగా వ్యాపారస్థులు కూడా యూరియాను కృత్రిమ కొరతగా సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల వ్యవసాయానికి సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదిన నల్గొండ లో జరిగే సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి ఉప్పునూతల వెంకటయ్య అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మైనోద్దీన్, కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జయరాములు, అచ్చయ్య, శైలేష్, రామస్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముద్రబోయిన నారాయణకు సిపిఐ నాయకుల నివాళులు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన సిపిఐ మాజీ గ్రామ శాఖ కార్యదర్శి కామ్రేడ్ ముద్రబోయిన నారాయణ మృతదేహంపై సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య, మండల కార్యదర్శి రేకల శ్రీనివాస్ ,జిల్లా సమితి సభ్యులు శాంతి కుమార్ ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెడే చంద్రయ్య మాట్లాడుతూ కోటమర్తి గ్రామంలో కామ్రేడ్ నారాయణ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీని బలోపేతం చేశాడని, ఆనాటి ఎమ్మెల్యే గుర్రం యాదగిరిరెడ్డి నాయకత్వాన కోటమర్తి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయుటలో నారాయణ పాత్ర ఉన్నదని ఆయన అన్నారు. నారాయణ మృతి సిపిఐ పార్టీకి తీరనిలోటని సంతాపాన్ని తెలియజేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటమర్తి గ్రామ సిపిఐ నాయకులు నిమ్మల బుచ్చయ్య, చింత సోమయ్య, చిప్పలపల్లి నరసింహ, నారాయణ, కుమారుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 15న ఎంజియు 4వ స్నాతకోత్సవం

### యూనివర్సిటీలో రెండు నూతన కోర్సులు ప్రారంభం
### ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** అకాడమిక్ సంవత్సరంలో అత్యుత్తమ ఉత్సవమైన స్నాతకోత్సవానికి మహాత్మా గాంధీ యూనివర్సిటీ సన్నద్ధమవుతున్నట్లు ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. యూనివర్సిటీలోని తన ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా విద్యా సంవత్సరాలలో అభ్యసించిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేసే అతి ముఖ్యమైన విద్యా పండుగ స్నాతకోత్సవమన్నారు. 2007లో ప్రారంభమైన విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకమైన నాల్గవ స్నాతకోత్సవానికి సిద్ధమవడం సంతోషకరమని, మరింత ఉత్సాహాన్ని నింపి అభివృద్ధి పదంలో నడిపించడానికి ఉపయోగపడుతుందన్నారు. సెప్టెంబర్ 15న జరగనున్న స్నాతకోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విశ్వవిద్యాలయ కులపతి హోదాలో హాజరుకానున్నట్లు, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య బిఎస్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. ఈ దఫా 22 పిహెచ్‌డి పరిశోధకులకు,57 మంది పిజి విద్యార్థులకు స్వర్ణ పథకాలు,పట్టాలు అతిధుల చేతులమీదుగా అందించనున్నట్లు తెలిపారు. ఈ స్నాతకోత్సవంతో 2022,23,24 విద్యా సంవత్సరంలో డిగ్రీ 16210,పీజీ,3200,బీఈడీ పూర్తిచేసిన 7800 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రకటించనున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు అధ్యాపకుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అకాడమిక్ చర్చలు, అతిథుల ప్రసంగాలతో కొత్త లక్ష్యాలను నిర్దేశించి వాటి సాధన దిశగా అడుగులు వేయనున్నట్లు ఉపకులపతి తెలిపారు.

**కొత్త కోర్స్‌లకు అనుమతి :** ఈ విద్యా సంవత్సరం నూతనంగా ఎల్‌ఎల్‌బి,ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు అనుమతి లభించినట్లు,రానున్న విద్యా సంవత్సరంలో ఎంఈడి,బిపిఈడి,గవర్నర్స్ వంటి కోర్సుల సాధనకు కృషి చేస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.వివిధ వసతి గృహాలు, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు వివరించారు. అకాడమిక్ సంస్కరణల్లో భాగంగా 75 శాతం హాజరు విధిగా అమలు చేస్తున్నట్లు, నైపుణ్యాల పెంపునకు అదనపు కోర్సులు, టాస్క్ ద్వారా అదనపు తరగతులుతోపాటు వివిధ సంస్థల తో జరిగిన అవగాహన ఒప్పందాలను వివరించారు. 2028లో న్యాక్ అక్రిడిషన్‌లో ఏ ప్లస్ సాధనకు ప్రణాళిక బద్ధంగా సాగుతున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిఓఈ డాక్టర్ జి ఉపేందర్ రెడ్డి,డాక్టర్ లక్ష్మీ ప్రభ,డాక్టర్ సంధ్యారాణి,డాక్టర్ ప్రవళిక పాల్గొన్నారు.

## నానో యూరియాతో అధిక ప్రయోజనం



**ప్రజాపక్షం/ హాలియా:** నానో యూరియా వాడకం వలన రైతులకు, భూసారం పెంపకానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని మండల సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత అన్నారు. మంగళవారం హాలియాలో నానో యూరియా వాడకంపై రైతులు, మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ తో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నానో యూరియా అనేది నానో టెక్నాలజీ సహాయంతో తయారు చేయబడిన ద్రవ రూపంలో ఉండే నత్రజని ఎరువు అని చెప్పారు. దీని వాడకం వలన అనేక ప్రయోజనాలు భూమికి, రైతుకి చేకూరుతుందని తెలిపారు. సాంప్రదాయ యూరియా వాయువుగా మారి వాతావరణంలోకి విడుదలై పర్యావరణానికి హాని చేస్తుందని చెప్పారు. భూగర్భ జల వనరులకు ఈ యూరియా వలన ఇబ్బందులు ఏర్పడడమే కాక నేల కూడా దెబ్బతింటుందని తెలిపారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ మొత్తంలో వాడడం వలన నీటి కాలుష్యం మట్టి కాలుష్యం తగ్గుతుందని సూచించారు. పంటలకు రసాయన ఎరువులు వేస్తేనే దిగుబడులు వస్తాయని ఆలోచనలో ఉన్న రైతులు దానిని మార్చుకోవాలని చెప్పారు. పంటకు ముందు భూమిలో పచ్చి రొట్టె సేంద్రియ జీవనరులు ఎలా ఉపయోగపడతాయో నానో యూరియా కూడా భూమికి అలానే ఉపయోగపడుతుందని తెలిపారు. అందువలన రైతులు నానో యూరియా వాడకం పెంచాలని సూచించారు.

## వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారు

### సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు



**ప్రజాపక్షం/భువనగిరి :** వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రజా విజయాలు వాస్తవాలు వక్రీకరణలు అనే అంశంపై సిపిఎం జిల్లా ప్రజా సదస్సు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అధ్యక్షతన జరిగింది. ఇ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవి. రాఘవులు బీవి,రాఘవులు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతంగ పోరాటం ప్రపంచంలోఎన్నో పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ఈ పోరాటం ద్వారా అనేకమంది కవులు కళాకారులు ముందుకు వచ్చారని బండి యాదగిరి, సుద్దాల హనుమంతు, సి.నారాయణరెడ్డి, కాలోజి నారాయణరావు లాంటివారు అనేకమంది సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు. అలాగే మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఉన్న పల్లె, పల్లెకు, చెట్టుకు, పుట్టకు ఒక చరిత్ర ఉందని ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు తాతల, తండ్రుల వారసత్వం కలిగి ఉందని చరిత్రను వక్రీకరించాలని చూస్తున్న బిజెపికి ఏముందో చూపెట్టగలరా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, గుంటోజు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీ హైకోర్టులో ఐశ్వర్యా రాయ్ పిటిషన్

**న్యూఢిల్లీ:** అనుమతి లేకుండా తన ఫొటోలు, వీడియోలు వాడుతున్నారని ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాయ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన వ్యక్తిగత హక్కులను కాపాడాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కొంతమంది వ్యక్తులు తన పేరు, చిత్రాలు ఏఐ ఆధారిత అశ్లీల కంటెంట్‌లో అనధికారికంగా వాడుతున్నారని, వాటిని వినియోగించకుండా నిరోధించాలని కోరారు. సినీనటి తరపున సీనియర్ న్యాయవాది సందీప్ సేథీ వాదిస్తూ 'పూర్తిగా అసత్యమైన సన్నిహిత ఫొటోలు ఇంటర్నెట్‌లో ప్రచారమవుతున్నాయి. ఎవరికీ ఆమె ఫొటోలు, పేరు వాడుకునే హక్కు లేదు. ఒక వ్యక్తి ఆమె పేరు, ఫొటోలతో డబ్బు వసూలు చేస్తున్నాడు. ఆమె పేరును, రూపాన్ని ఇష్టానుసారం వాడటం దురదష్టకరం' అని కోర్టుకు వివరించారు. కొందరు వ్యక్తులు ఐశ్వర్య ఫొటోలను మార్ఫింగ్ చేసి ఉపయోగించుకుంటున్నారని సందీప్ సేథి న్యాయస్థానం దష్టికి తీసుకొచ్చారు.

## బంగారం ధరకు రెక్కలు

### ఒక్కరోజే రూ.5వేలు పెరిగిన పసిడి ధర!



**న్యూఢిల్లీ :** బలమైన ప్రపంచ ధోరణులకు అనుగుణంగా మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర అమాంతం పెరిగింది. 10 గ్రాముల పసిడి ధర రూ.5,080 పెరిగి రూ.1,12,750కి చేరుకుని జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, సోమవారం 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం రూ.1,07,670 వద్ద ముగిసింది. అయితే మంగళవారం పసిడి ధర ఢిల్లీలో భారీగా పెరిగి రూ.1,12,750 చేరింది. మరోవైపు మంగళవారం వెండి ధర కూడా కిలోకు రూ.2,800 పెరిగి రూ.1,28,800కి (అన్ని పన్నులు కలిపి) చేరుకుంది. జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. గత మార్కెట్ సెషన్‌లో ఈ విలువైన లోహం కిలోకు రూ.1,26,000 వద్ద స్థిర పడింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా మంగళవారం ఔన్సు బంగారం ధర 3,6 59.27 డాలర్లకు చేరుకుంది. స్పాట్ గోల్ ఔన్సు 3,658.38 డాలర్లు వద్ద ట్రేడ్ అయింది.

**ఆ పరిస్థితులే కారణం**

గత వారం అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు వెలువడడంతో బంగారానికి భారీగా డిమాండ్ ఏర్పడిందని వ్యాపారులు తెలిపారు. యుఎస్‌లో బలహీనమైన లేబర్ మార్కెట్ డేటా ద్రవ్య విధాన సడలింపు అవకాశాలను పెంచిందని, ఇది పెట్టుబడిదారులను బంగారం వంటి సురక్షితమైన ఆస్తుల్లో ఇన్వెస్ట్ చేసేందుకు కారణమైందని అభిప్రాయపడ్డారు. డాలర్ ఇండెక్స్ బలహీనపడడం కూడా మరో కారణమని భావిస్తున్నారు. కాగా, డాలర్ ఇండెక్స్ 0.17 శాతం తగ్గి, 97.29 వద్ద ట్రేడవుతోంది.

**విశ్లేషకులు ఏమన్నారంటే?**

బంగారం ధరలు మంగళవారం మరోసారి ఆల్ టైమ్ హైని టచ్ చేశాయని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్‌లోని కమోడిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ తెలిపారు. కేంద్ర బ్యాంకుల నుంచి బలమైన డిమాండ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి పెట్టుబడులు, రేటు కోతలకు సంబంధించిన ఊహాగానాలు విలువైన లోహాలలో ఈ రికార్డు ర్యాలీకి ఆజ్యం పోశాయని అభిప్రాయపడ్డారు. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రభావం గురించి ఆందోళనలు కూడా ఈ ర్యాలీకి దోహదపడ్డాయని పేర్కొన్నారు.

## ఆశ లేకపోతే.. జీవితమే లేదు

### సిఎం పోస్టుపై డికె ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అధికార మార్పిడి వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మరోసారి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆశ లేకపోతే. జీవితమే లేదని, కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందంటూ పేర్కొన్నారు. ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2025 సదస్సులో డికె శివకుమార్ పాల్గొన్నారు.'కాంగ్రెస్ ప్రభు త్వంలోని రెండో సగభాగం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారా..?' అన్న ప్రశ్న ఆయనకు ఎదురైంది. దీనికి డికె స్పందిస్తూ.. 'నేను దీనికి సమాధానం చెప్పలేను. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుంది. ఎవరైనా సరే ఆశతో జీవించాలి. ఆశ లేకపోతే.. జీవితమే లేదు' అంటూ చెప్పుకొచ్చారు. సిఎం మార్పు నిర్ణయం పూ ర్తిగా కాంగ్రెస్ హైకమాండ్‌దేనని తెలిపారు. హైకమాండ్ నిర్ణయం, ఆదేశాల ప్ర కారం ముందుకెళ్తామని చెప్పారు. హైకమాండ్ ఏం నిర్ణయిస్తే.. దాన్ని అంగీ కరిస్తామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## జగదీప్ ధన్కడ్ ఎక్కడ?

### ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రారంభ వేళ జైరాం రమేశ్ నిలదీత



**న్యూఢిల్లీ:** జగదీప్ ధన్కర్ ఎక్కడ? అని భారతదేశ తదుపరి ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే ఓటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమైన సమయంలోనే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ మరోసారి ప్రశ్నించారు. ఆరోగ్య సమస్యలను పేర్కొంటూ జులై 21న ధన్కడ్ అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయనతో సంబంధాలు లేకుండా ఉ న్నారు. 'జగదీప్ ధన్కర్ 50 రోజులుగా అసా ధారణ మౌనాన్ని కొనసాగిస్తున్నారు' అని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఈరోజు తన వారసుడి కోసం ఎన్నికలు జరుగుతున్నందున మోదీ ప్రభుత్వం రైతులను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం, అధికారంలో ఉన్నవారి 'అహంకారం' వల్ల ఎదురయ్యే ప్రమాదాలు మొదలైన వాటిపై తన ఆందోళనలను వ్యక్తం చేసిన తర్వాత ఉపరాష్ట్రపతి పదవికి ఊహించని రాజీనామా తర్వాత దేశం ఆయన మాట్లాడటానికి వేచి ఉంది' అని అన్నారు. ధన్కర్ ఆకస్మిక నిష్క్రమణ రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఆయన రాజీనామా తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి 'ఆయనకు మంచి ఆరోగ్యం' కోరుకుంటూ సంక్షిప్త వీడ్కోలు ప్రకటన వచ్చింది. కానీ ప్రభుత్వం నుంచి వివరణాత్మక వ్యాఖ్య లేదు. ధన్కడ్ కొన్ని నిర్ణయాలతో మోదీ ప్రభుత్వానికి కోపం తెప్పించాడని, ఆయన రాజీనామా చేయవలసి వచ్చిందని చాలా మంది భావిస్తారు. అయితే కేంద్ర హోం అమిత్ షా దానిని తిరస్కరించారు. 19931998 మధ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రాష్ట్ర అసెంబ్లీలో కిషన్‌గఢ్‌కు ప్రాతినిధ్యం వహించారు. జులై 2019 వరకు ఆయన పెన్షన్ పొందినప్పటికీ, పశ్చిమ బెంగాల్ గవర్నర్ అయినప్పుడు అది నిలిచిపోయింది. ప్రస్తుతం 74 ఏళ్ల ధన్కర్ నెలకు రూ.42 వేల పెన్షన్‌కు అర్హులు. రాజీనామా చేసినప్పటి నుంచి నెలకు పైగా ఇంటికే పరిమితమైన తర్వాత దంత పరీక్ష కోసం సెప్టెంబరు 1న ఆయన తన అధికారిక నివాసం నుంచి బయటకు వచ్చారు.

## జైల్లో ఉండలేను..విషమివ్వండి

### కోర్టును కోరిన నటుడు దర్శన్

**బెంగళూరు:** తాను చాలా రోజులుగా సూర్యకాంతిని చూడలేదని... తనకు 'విషం' ఇవ్వాలని జైలులో ఉన్న కన్నడ నటుడు దర్శన్ మంగళవారం కోర్టును కోరారు. రేణుకస్వామి హత్య కేసులో విచారణ సందర్భంగా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సిటీ సివిల్... సెషన్స్ కోర్టు ముందు హాజరయిన దర్శన్... తన చేతుల్లో ఫంగస్ పెరిగిందని కూడా అన్నారు. జైలులో బయటకు అడుగు పెట్టడానికి అనుమతించకపోవడంతో చాలా రోజులుగా సూర్యకాంతిని చూడలేదని ఆయన అన్నారు. తన బట్టలు దుర్వాసన వస్తున్నాయని, జైలులో తాను తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నానని తెలిపారు.

## రాష్ట్రపతి, గవర్నర్లు కేవలం 'నామమాత్రపు అధిపతులే'

### 'సుప్రీం' ముందు వాదనలు వినిపించిన కర్ణాటక ప్రభుత్వం




**కేంద్రంలో, రాష్ట్రాల్లో కేబినెట్ సలహాను బట్టి నడుచుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనానికి వెల్లడి**

**8వ రోజు కొనసాగిన విచారణ**

**న్యూఢిల్లీ :** రాజ్యాంగం పథకం ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు కేవలం 'నామమాత్రపు అధిపతులు' మాత్రమేనని, కేంద్రంలో, రాష్ట్రాల్లో మంత్రి మండలి సహాయం, సలహాను బట్టి నడుచుకోవాల్సి ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టు ముందు గట్టిగా నొక్కిచెప్పింది. కర్ణాటక ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణియన్ ప్రధాన న్యాయమూర్తి బిఆర్. గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్‌కు ఎటువంటి కార్యనిర్వాహక విధులను నిర్వహించనందున వారికి క్రిమినల్ చర్యల నుండి బలం లభిస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులను ప్రస్తావిస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యతీసుకోవడానికి అవసరమైన సంతృప్తే మంత్రి మండలి సంతృప్తి అని సుబ్రమణియన్ జస్టిస్ సూర్యకాంత్, విక్రమ్ నాథ్, పిఎస్.నరసింహ, ఎఎస్.చందుర్కర్‌లు కూడా ప్రాతినిధ్యం వహించిన ధర్మాసనం ముం దు విపులీకరించారు. రాష్ట్రపతి ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి పరిష్కరించేందుకు కోర్టు కాలపరిమితిని విధించవచ్చా అనే విషయమై రాష్ట్రపతి సూచనపై 8వ రోజు విచారణను తిరిగి ప్రారంభిస్తూ, ఎన్నికైన ప్రభుత్వంతోపాటు రాజ్యాంగం ఎలాంటి సమాంతర పరిపాలనను అందించలేదని సుబ్రమణియన్ వాదించారు. సుబ్రమణియన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులు ఉన్నాయన్నారు. గవర్నర్ మంత్రి మండలి సహాయం, సలహాల నుంచి స్వతంత్రంగా వ్యవహరిస్తారని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (ఐపిసి)లోని సెక్షన్ 197కు సంబంధించి తన విచక్షణను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. సెప్టెంబరు 3న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో వాదిస్తూ బిల్లు రూపంలో ప్రజల అభీష్టాన్ని గవర్నర్లు, రాష్ట్రపతి ఇష్టాయిష్టాలకు లోబడి ఉంచరాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఎందుకంటే శాసనప్రక్రియలో కార్యనిర్వాహకుడు జోక్యం చేసుకోకుండా నిషేధించబడింది. తృణమూల్ పాలిత రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ సార్వభౌమాధికారి ఇష్టాన్ని ప్రశ్నించలేరని, అసెంబ్లీ ఆమోదించిన బిల్లు శాసనసామర్థ్యాన్ని పరిశీలించడానికి ముందుకు సాగలేరని గట్టిగా చెప్పింది. ఇది న్యాయవ్యవస్థ పరిధిలోకి వస్తుంది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పరిష్కరించేటప్పుడు రాష్ట్రపతి విచక్షణాధికారాన్ని వినియోగించడానికి న్యాయపరమైన ఉత్తర్వులు, సమయం విధించవచ్చో లేదో తెలుసుకోడానికి మే నెలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆర్టికల్ 143 (1) కింద అధికారాలను ఉపయోగించారు.

## ఢిల్లీ ఎన్‌సిఆర్‌లోని దాదాపు 70శాతం గిగ్‌వర్కర్లు..

**❖డిస్పోజబుల్ ఆదాయ వృద్ధిని చూశారు**
**❖ఎంపవర్ ఇండియా 'శ్వేతపత్రం' వెల్లడి**



**న్యూఢిల్లీ :** ఢిల్లీ ఎన్‌సిఆర్ లోని దాదాపు 70 శాతం గిగ్ వర్కర్లు పార్ట్‌టైమ్, సీజనల్, గిగ్ రోల్స్ ద్వారా తమ డిస్పోజబుల్ ఆదాయంలో పెరుగుదలను చూశారని ఒక శ్వేత పత్రం వెల్లడించింది. ముఖ్యంగా ఢిల్లీ ఎన్‌సిఆర్ యువకులకు ఇ కామర్స్‌నే ప్లాట్‌ఫారమ్‌లు వేగంగా ఎంపిక చేసుకునే యజమానులుగా మారుతున్నాయి. సాంప్రదాయక ఉపాధికి పోటీగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి నిర్మాణాత్మక కెరీర్ పురోగతిని అందిస్తున్నాయని, స్థానిక వర్గాల సహకారంతో ఎంపవర్ ఇండియా తయారుచేసిన శ్వేతపత్రం తెలిపింది.'15జిల్లాలలో 90,000మందికి పైగా పరిశోధనా సంస్థల నుంచి వచ్చిన ప్రతిపాదనలు గిగ్ వర్కర్లతో ప్రత్యక్ష ఇంటర్వ్యూల ఆధారంగా ఈ కామర్స్, రిటైల్ ప్లాట్‌ఫారములు, కెరీర్‌పురోగతి, ఆర్థిక స్థిరత్వం, సమ్మిళిత అవకాశాలను అందించడం ద్వారా సంస్థలను ఎలా పునర్నిర్మిస్తున్నాయో ప్రతినిధి హైలెట్ చేశారు. ఈ పరివర్తనకు అమెజాన్, డెల్హివరీ, మీషోలు సహకారులుగా ఉద్భవించాయి' అని నివేదిక వెల్లడించింది. పార్ట్‌టైమ్ సీజనల్, గిగ్ రోల్స్ ద్వారా 70 శాతం మంది గిగ్ వర్కర్లు తమ డిస్పోజబుల్ ఆదాయంలో పెరుగుదలను చూశారని అధ్యయనం వెల్లడించింది. త్వరిత వాణిజ్యం తరచుగా అధిక ఒత్తిడి లక్ష్యాలతో గుర్తించబడుతుండటంతో చాలామంది యువకార్మికులు స్థిరపడిన రిటైల్, ఈకామర్స్ కంపెనీలు అందించే స్థిరత్వం, దీర్ఘకాలికతను ఎంచుకుంటున్నారు. మౌలిక సదుపాయాలు, సమ్మిళిత కార్యాలయ విధానాలు, నైపుణ్య అభివృద్ధి చొరవలు అర్థవంతమైన గౌరవప్రదమైన ఉపాధిని ఎలా ఎంచుకుంటాయో కూడా ఈ నివేదిక నొక్కిచెబుతోంది. 'అమెజాన్, ఫ్లిప్‌కార్టు వంటి ఇండస్ట్రీ నాయకులు యువత నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాల ద్వారా చివరి మైలు డెలివరీ నెట్‌వర్క్‌లు సాంప్రదాయ రిటైల్ ఉపాధీకరణను అధికారీకరించడం ద్వారా ఈ మార్పును వేగవంతం చేస్తున్నారు' అని నివేదిక పేర్కొంది. దీనిపై ఎంపవర్ ఇండియా డైరెక్టర్ జనరల్ కె.గిరి మాట్లాడుతూ ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో రిటైల్ సెక్టార్ కేవలం ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా, అది దీర్ఘకాలిక ఆర్థిక శ్రేయస్సుకు బాటలు నిర్మిస్తోందన్నారు.

## పాత నిల్వలకూ కొత్త ఎంఆర్‌పి

### జీఎస్టీ రేట్లపై కేంద్రం నిర్ణయం




**న్యూఢిల్లీ:** వస్తు, సేవలు పన్ను (జీఎస్టీ) రేట్లకు సంబంధించి అటు విని యోగదారులకు, ఇటు కంపెనీలకు ఊరట నిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పాత స్టాక్‌కూ గరిష్ఠ రిటైల్ ధరను (ఎంఆర్‌పి) సవరించే అవకాశం కల్పించింది. దీంతో కొత్త స్టాక్ వచ్చేంత వరకూ వేచి చూడాల్సిన అవ సరం లేకుండా పాత స్టాక్ ధరలు కూడా తగ్గనున్నాయి. దీనివల్ల ముఖ్యంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది. జీఎస్టీ శ్లాబులకు సంబంధించి ఇటీవల జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇకపై 5, 18 శాతం శ్లాబ్‌లు మాత్రమే ఉండనున్నాయి. సవరించిన ఎమ్మార్పీని స్టాంపింగ్, స్టిక్కర్ లేదా ఆన్‌లైన్ ప్రింటింగ్ ద్వారా మార్చుకోవచ్చని కేంద్ర వినియోగదారుల వ్యవ హారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. పాత ఎమ్మార్పీ కొనసాగించాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పన్ను తగ్గింపు/పెంపునకు అనుగుణంగా సవరించిన ధర ఉండాలని పేర్కొంది. ఈ మేరకు పత్రికా ప్రకటన ఇవ్వాలని తయా రీదారులు, ప్యాకర్లకు సూచించింది. స్టాక్ పూర్తయ్యేంత వరకు లేదా డిసెంబర్ 31 వరకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పాక్ దుష్ప్రచారం... తిప్పికొట్టిన భారత్

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పెద్దఎత్తున ఫేక్ ప్రచారానికి తెరలేపిన పాకిస్థాన్... దాన్ని ఇంకా కొనసాగిస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా భారత్‌పై విషం చిమ్ముతోంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని అనుకూల ఎక్స్ హ్యాండిల్ల నుంచి ఒకేతరహా ప్రచారం చేయిస్తోంది. దీన్ని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ సమర్థంగా తిప్పికొట్టింది. ప్రధాని నరేంద్రమోదీ, సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది మధ్య చెడిందంటూ ఓ కల్పిత ప్రచారానికి పాక్ తెరతీసింది. యుద్ధ సామగ్రిని అభివృద్ధి చేయకుండా పాక్‌తో వివాదం పెట్టుకోవడం భారత సైన్యానికి ఏమాత్రం ఇష్టం లేదనేది ఆ పోస్టుల సారాంశం. ఒకేతరహా సందేశం వేర్వేరు అకౌంట్ల నుంచి రావడంతో పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం అప్రమత్తమైంది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టంచేసింది. ఇలాంటి అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పౌరులకు సూచించింది.

## ఇజ్రాయిల్‌తో వాణిజ్య ఒప్పందం సిగ్గుచేటు: సీపీఎం

**న్యూఢిల్లీ:** ఇజ్రాయిల్ ఆర్థికమంత్రి బెజలెల్ స్మోట్రిచ్ భారత్‌లో పర్యటించడాన్ని సీపీఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. భారత ప్రభుత్వంతో ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేయడానికి ఆయన ఇజ్రాయిల్ ప్రతినిధి బందానికి నాయకత్వం వహిస్తున్నారు. స్మోట్రిచ్ భారత్ పర్యటనను ఖండిస్తూ మంగళవారం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. 'పచ్చి మితవాద జాత్యాహంకార పార్టీకి చెందిన స్మోట్రిచ్... పలస్తీనా ప్రజలను బలవంతంగా నిరాశ్రయులను చేయడం ద్వారా గాజాస్ట్రిప్‌ను ఆక్రమించాలనుకుంటున్న నెతన్యాహు ప్రభుత్వంలో ప్రముఖ న్యాయవాది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌ను ఇజ్రాయిల్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదనకు ఆయన ప్రధానకర్త. పలస్తీనియన్ల జాతిని ప్రక్షాళన చేయాలన్న సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ అనేక దేశాలు స్మోట్రిచ్ పర్యటనపై నిషేధం విధించాయి. మరికొన్ని దేశాలు ఆంక్షలు విధించాయి. ఆదేశాల్లో బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, నార్వే, నెదర్లాండ్స్, స్లొవేనియా, న్యూజిలాండ్ ఉన్నాయి.

## ఢిల్లీ సచివాలయం... ఎంఎఎంసికి బాంబు బెదిరింపులు



**న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి సచివాలయం, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజ్ (ఎం ఏఎంసీ), యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్స్ (యూ సీఎంసీ) కి మంగళవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయని, వాటిని తరు వాత నకిలీవని అధికారులు తెలిపారు. ఒక కిలోమీటరు పరి ధిలో పేలుడు జరిగేలా ఆర్‌డీఎక్స్ మూడు ప్రదేశాలలో అమర్చబడిందని బెదిరింపులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మూడు ప్రదేశాలలో బాంబు గుర్తింపు, నిర్వీర్య బందాలు (బిడిడిటి) సేవలతో ప్రామాణిక నిర్వహణా విధానాల కింద తక్షణ, సమన్వయంతో చర్యలు తీసుకున్నామని, బాంబు బెది రింపులు నకిలీవని వారు తెలిపారు. పోలీసు డిప్యూటీ కమిషనర్ (షా హదారా) ప్రశాంత్ గౌతమ్ మాట్లాడుతూ 'ఉదయం 11 గంటల సమ యంలో కోల్లెజ్ ప్రాంగణంలో బాంబు ఉన్నట్లు వారికి ఇమెయిల్ అం దిందని జిటిపి ఆసుపత్రిలోని యూసీఎంసీ సమాచారం అందింది' అని అ న్నారు.

భయాందోళనలు సష్టించకుండా కళా శాలను ఖాళీ చేయించా రు. బాంబు డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి భవ నం లోని ప్రతి మూలను తనిఖీ చేశామని డీసీపీ తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు భవనానికి ఎటువంటి ప్రమాదం లేదని, బెదిరింపు నకి లీదని తేలింది. దిల్లీ అగ్నిమాపక దళం (డీఎఫ్‌ఎస్)కు బెదిరింపునకు సంబంధించి ప్రత్యేక కాల్ కూడా వచ్చింది. స్థలానికి తరలించారు.

## ఆపరేషన్ సిందూర్ వేళ 400మంది శాస్త్రవేత్తలు 24 గంటలూ సేవలందించారు

### భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ నారాయణన్

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ సమయంలో 400 మంది శాస్త్రవేత్తలు నిరంతరం పనిచేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ వి. నారాయణన్ వివరించారు. ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ శాటిలైట్ల పనితీరును పరిశీలిస్తూ జాతీయ భద్రత అవసరాలకు అనుగుణంగా ఉపగ్రహాల సమాచారాన్ని అందించినట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎఐఎంఎ) 52వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో ప్రసంగిస్తూ ఈ విషయాన్ని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని ఉపగ్రహాలు నిరంతరం కచ్చితత్వంతో పనిచేస్తూ అవసరమైన సమాచారాన్ని అందించాయి. 400లకు పైగా శాస్త్రవేత్తలు 24 గంటలపాటూ పూర్తి సమయం పనిచేశారు. భూ పరిశీలన, కమ్యూనికేషన్‌కు సంబంధించిన ఉపగ్రహాలన్నీ సంపూర్ణ సేవలు అందించాయి' అని ఇస్రో చైర్మన్ నారా యణన్ అన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు 7700 క్షేత్రస్థాయి పరీక్షలు పూర్తిచేశామని తెలిపారు. మరో 2300 పరీక్షలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. జాతీయ భద్రత, సరి హద్దు సంక్షోభం వంటి సమయాల్లో అంతరిక్ష రంగం కీలకంగా వ్యవ హరిస్తుందన్న విషయం ఆపరేషన్ సిందూర్ సమయంలో మరోసారి స్పష్ట మైంది. ఆ సమయంలో విస్తృతంగా డ్రోన్లు, మందుగుండు సామగ్రి భారీ స్థాయిలో వినియోగించడం, దేశీయంగా అభివృద్ధి చేసిన ఆకాశ్‌తీర్ వంటి రక్షణ వ్యవస్థ సామర్థ్యాలను పరిశీలిం చడం లోనూ ఇస్రో కీలక పాత్ర పోషి స్తోం ది. ఇందుకు సం బంధించి ఆ యా శాఖలతో ప నిచేస్తోంది. ఇస్రో ప్రస్తుతం టెక్నాలజీ డెమా న్‌స్ట్రేషన్ శా టిలైట్ (టిడిఎస్), నౌకాదళం కోసం సిద్ధం చేసిన జీశాట్7ఆర్ ప్రయో గించనుంది. ఇది ఇప్ప టికే కక్ష్యలో ఉన్న జిశాట్–7 (రు క్మి ణి) స్థానాన్ని భర్తీ చేయనుంది.




**ఏకంగా 40 అంతస్తుల భవనమంత భారీ రాకెట్ నిర్మించే పనిలో ఇస్రో**

అంత కుముందు ఏకంగా 40 అం తస్తుల భవనమంత భారీ రాకెట్ నిర్మించే పనిలో నిమగ్నమైనట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. ఇటీవలె హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడాది నావిక్ ఉపగ్రహం, ఎన్–1 రాకెట్ ప్రయోగం, అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన కమ్యునికేషన్ శాటిలైట్‌ను కక్ష్యలోకి చేర్చడం వంటి ప్రాజెక్టులు చేపట్టనుందని వివరించారు.

## హిమాచల్‌కు రూ. 1500 పంజాబ్‌కు రూ. 1600 కోట్లు

**▶తక్షణ సాయం ప్రకటించిన ప్రధాని మోదీ**
**▶మృతుల బంధువులకు ఒక్కొక్కరికీ రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు**
**▶వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే**



**షిమ్లా/ధరంశాల :** వరద బాధిత హిమాచల్‌ప్రదే, పంజాబ్‌లో ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం పర్యటించారు. హిమాచల్‌కు తక్షణసాయంగా రూ. 1500 కోట్లు , పంజాబ్‌కు రూ. 1,600 ప్రకటించారు. హిమాచల్‌లో రాష్ట్రంలో వరదలు, కొండచరియలు విరిగిపడిన పరిస్థితిని సమీక్షించిన మోదీ, మృతుల బంధువులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50,000 ప్రకటించారు. వరద బాధిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేశారు. అదే విధంగా 1988 తర్వాత అత్యంత దారుణమైన వరదలతో సతమతమవుతున్న పంజాబ్ రాష్ట్రంలో పరిస్థితిని, నష్టాన్ని సమీక్షించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఆ రాష్ట్రానికి రూ.1,600 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న రూ.12,000 కోట్లకు అదనంగా సరిహద్దు రాష్ట్రానికి మోదీ సహాయం ప్రకటించారు. వరదలు, ప్రకృతి వైపరీత్యాలలో మరణించిన వారి బంధువులకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియాను కూడా ఆయన ప్రకటించారు. కాగా, హిమాచల్‌లో ఏరియల్ సర్వే అనంతరం సహాయ, పునరావాస చర్యలను సమీక్షించడానికి, నష్టాన్ని అంచనా వేయడానికి కాంగ్రాలో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, బిజెపి నాయకులు, బాధిత కుటుంబాలు, కాంగ్రాలో సహాయ సేవలలో నిమగ్నమైన వ్యక్తులతో జరిగిన సమావేశంలో, ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, పునర్ని ర్మాణానికి మోదీ అన్ని విధాలుగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. పి ఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఎస్‌డిఆర్‌ఎఫ్ కింద రెండవ విడతలో ముందుగా రూ. 1500 కోట్ల ఆర్థిక సాయం అందనుంది. వరద ప్రభావిత ప్రాంతాలను, ప్రజలను తిరిగి ఆర్థికంగా నిలబెట్టడానికి బహుముఖ చర్యలు తీసుకోవాలని మోదీ సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్ల పునర్నిర్మాణం, జాతీయ రహదారుల పునరుద్ధరణ, పాఠశాలల పునర్నిర్మాణం, పిఎంఎన్‌ఆర్‌ఎఫ్ కింద ఉపశమనం అందించడంతో పాటు పశువులకు మినీ కిట్‌లను విడుదల చేయడం వంటి అనేక చర్యలను చేపట్టనున్నారు. ఈ క్లిష్ట సమయంలో కేంద్రం హి మాచల్ ప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందని, సాధ్యమైన అన్ని సహా యాన్ని అందిస్తుందని మోదీ చె ప్పారు. నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయడానికి, సహాయం వేగంగా అందేలా చూడటానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద దెబ్బతిన్న ఇళ్లకు జియోట్యాగింగ్ చేయనున్నట్లు ఆయన అన్నారు. పరిస్థితిని పరి ష్కరించడానికి కేంద్రం అన్ని ప్రయత్నాలు చేస్తుందని హామీ ఇచ్చారు. ముం దుగా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు విధ్వంసం సృష్టించిన మేఘావృతాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై ఒక ప్రజెంటేషన్‌ను కూడా ఆయన చూశారు. జూన్ 20 నుండి సెప్టెంబర్ 8 వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో కుంభవృష్టి, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల రూ.4,122 కోట్ల నష్టం వాటిల్లిందని, రాష్ట్రంలో వర్ష సంబంధిత సంఘటనలు, రోడ్డు ప్రమాదాలలో 370 మంది మరణించారని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ తెలిపింది. వీటిలో కొండచరియలు విరిగిపడటం వల్ల 43 మరణాలు, మేఘావృతాల వల్ల 17 మరణాలు, ఆకస్మిక వరదల వల్ల తొమ్మిది మంది మరణించారు. అదనంగా, 41 మంది ఇంకా కనిపించకుండా పోయారు, రోడ్డు ప్రమాదాల్లో 165 మంది మరణించారు.

# ఇసిఐకి ‘సుప్రీం’ మొట్టికాయ

ప్రజాపక్షం
10-09-2025, బుధవారం

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కొద్దినెలల ముందు భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) బుద్ధిపూర్వకంగా కావచ్చు లేదా కేంద్రప్రభుత్వ బాధ్యుల ఆదేశంపై కావచ్చు – హడావుడిగా ఆరంభించిన ఓటర్ల ముమ్మర రివిజన్ (ఎస్ఐఆర్) ఆదినుంచీ సందేహాస్పదంగా, వివాదాస్పదంగా మారినందున, దానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ల విచారణ సందర్భంగా, యూనిక్ ఐడెంటిటీ కార్డు ‘ఆధార్’ను కూడా ఓటర్ల నివాస ధృవీకరణ పత్రంగా అనుమతించటాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు బెంచి ఒకటికి రెండుసార్లు ఇచ్చిన సలహాను ఇసిఐ పట్టించుకోకపోవటం దాని చర్మం ఎంత దళసరిగా ఉందో విదితం చేస్తున్నది. చివరకు, సోమవారం నాటి విచారణలో సుప్రీంకోర్టు, ఇసిఐ 11 డాక్యుమెంట్స్ జాబితాకు 12వ డాక్యుమెంట్‌గా ఆధార్‌ను చేర్చాలని ఆదేశించాల్సి వచ్చింది. ఆధార్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాదు – పౌరసత్వ నిర్ధారణ ఎన్నికల సంఘం పనికాదు. అయినా ఎవరో ఆదేశించినట్లు ‘చొరబాటుదారులను’ ఓటర్ల జాబితానుంచి ఏరివేసే బాధ్యతను ఇసి నెత్తికెత్తుకుంది. అందువల్లనే ఇంత రాద్ధాంతం.

మన దేశంలో జనన–మరణాలన్నీ రిజిస్టర్ కాకపోవటం,విద్యావంతులు ఉద్యోగ, వ్యాపారాలకై, పేదలు పొట్టచేతబట్టుకుని ఉపాధి వెతుక్కుంటూ అవకాశాలున్న ప్రదేశాలకు పెద్ద సంఖ్యలో వలసలు పోవటం, కిరాయి ఇళ్లు మారుతూ ఉండటం తత్కారణాలతో రెండుచోట్ల ఓటు కలిగి ఉండటం సాధారణ విషయం. అది ఎన్నికల కమిషన్ దృష్టిలో చట్టవ్యతిరేకం కావచ్చు. కాని సొంత ఊర్లో ఓటు లేకపోతే మరణించిన లెక్కలో చేరిపోతామని సామాన్యుల భయం. ఎన్నికల సమయంలో స్వగ్రామం వచ్చి ఓటుహక్కు వినియోగించుకుంటూ ఉంటారు. అయితే ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరు తో 65 లక్షల పేర్లను బిహార్ ఓటర్ల జాబితాలనుంచి ఇసి తొలగించింది. జనవరిలో సమ్మరీ రివిజన్ తర్వాత మొత్తం ఓటర్ల సంఖ్య 7.89కోట్లు. తాజా ముమ్మర రివిజన్‌లో – మరణాలు, రెండు చోట్ల ఓట్లు, శాశ్వతంగా వలసవెళ్లటం అనే కారణాలతో ఆ 65లక్షల ఓటర్ల పేర్లను ఇసి తొలగించింది. సుప్రీంకోర్టు ఆదేశంపైనే ఆ తొలగించిన పేర్లు ప్రకటించింది. ఆ జాబితాలో పేర్ల చేర్పు లేదా తొలగింపుకు వ్యక్తులు, రాజకీయ పార్టీలు నిర్ణీత ఫాంలో దరఖాస్తులు సమర్పించవచ్చన్నది.

ఇసిఐ మొండితనాన్ని అర్థం చేసుకోవటానికి ఈ టైంలైన్స్ సహాయపడతాయి. ఒక డాక్యుమెంట్‌గా ఆధార్‌ను అంగీకరించే విషయాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు జులై 10న సలహా ఇచ్చింది. జనాల గుర్తింపు, నివాస ఆధారంగా ‘ఆధార్’ను గుర్తించాల్సిందిగా ఆగస్టు 14న కోర్టు లాంఛనంగా ఆదేశించింది. ఇసి ప్రకటించిన 11 ఆధారాల్లో ఏదో ఒక దానితో ఆధార్ సమర్పించవచ్చుగాని, అదొక్కటే ఆధారం కాదని బిజెపి అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా భాష్యం చెప్పారు. బహుశా కిందిస్థాయి ఎన్నికల అధికారులు దాన్నే పాటించారేమో. అభ్యంతరాలు – క్లెయిములకు ఆధార్‌ను అధికారులు ఆమోదించటం లేదని కోర్టుకు ఫిర్యాదులు అందాయి. ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన ఓటర్లు తమ క్లెయిములకు ఆధార్ కార్డు గాని లేక ఇసి11 పత్రాల్లో ఏదేనిగాని జతచేయవచ్చని సోమవారం సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది.

“పాస్‌పోర్టు, జనన సర్టిఫికేట్ మినహా, ఇసి 11 డాక్యుమెంట్లలో మిగతా 9లో ఏదీ పౌరసత్వానికి నిర్ధారణపూర్వకమైన డాక్యుమెంట్ కాదు. ఆధార్ పౌరసత్వానికి రుజువు కాదని పిటిషనర్‌లు కూడా అంగీకరిస్తున్నారు. అటువంటప్పుడు మీ జాబితాకు ఆధార్‌ను ఎందుకు చేర్చరు? దీన్ని పరిశీలించాలని కోర్టు మీకు చాలాసార్లు చెప్పింది. మీరెందుకు పట్టించుకోవటం లేదు” అని జస్టిస్ బాగ్చి ఇసి కౌన్సెల్‌ను ప్రశ్నించారు. ఆధార్‌ను అంగీకరించాల్సిందిగా బిహార్‌లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్‌లకు ఆదేశాలు జారీ చేయండని బెంచి ఆదేశించింది.

బిహార్ ఎన్నికల అనంతరం పశ్చిమ బెంగాల్, ఒడిశాల్లో ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ఇసిఐ ఇప్పటికే ప్రకటించింది. అన్ని రాష్ట్రాల్లో అట్టి పరిశీలనకు రాష్ట్ర ఎన్నికల అధికారులను సన్నద్ధం చేస్తున్నది. ఈ తరుణంలో ఆధార్‌కార్డును కూడా ఓటరు గుర్తింపుకు ధృవీకరణ పత్రంగా గుర్తించాలని సుప్రీంకోర్టు ఇసిఐని ఆదేశించటంవల్ల తమ ఉనికిని ధృవీకరించుకునేందుకు బిహార్ ప్రజలు ఆఫీసులచుట్టూ తిరుగుతూ పడిన కష్టాలనుంచి దేశ ప్రజలను తప్పించినట్లయింది.

అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఇసిఐ ఓటర్ల జాబితాల తారుమారుకు సహాయపడుతోందని, ‘ఓట్ చోరీ, అధికారం చోరీకి’ తోడ్పడుతోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ధ్వజమెత్తుతున్నారు. కర్నాటక, మహారాష్ట్రలో కొన్ని నియోజకవర్గాల్లో ఓటింగ్ తీరుగూర్చి వారు అడిగిన సమాచారాన్ని నిరాకరించటం, కొంత డేటాను చెరిపివేయటం ప్రతిపక్షం ఆరోపణకు బలం చేకూర్చింది.

రాహుల్‌గాంధీ, ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్, సిపిఐ, సిపిఐఎంఎల్ తదితర ఇండియా కూటమి పార్టీలు బిహార్‌లో 15 రోజులపాటు ‘ఓటర్ అధికార్’ జీపు యాత్ర నిర్వహించి ఇసిని ఎండగట్టా రు. జవాబుదారీతనం బదులు ఇసి గోప్యతను పాటించటం, దాన్ని గట్టిగా సమర్థించుకోవటం, దాని నిజాయితీని ప్రశ్నార్థకం చేస్తున్నది.

# ఘనంగా వియత్నాం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**అమియాద్ రోవిట్జ్**

వియత్నాం ప్రజలు 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా దేశ చరిత్రలోనే అతిపెద్ద కవాతును రాజధాని హనోయ్‌లో పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా భావి తరాలకు స్ఫూర్తినిచ్చే సైనిక కవాతులో యువత, మహిళలు, పౌరులు పెద్ద సంఖ్యలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం స్వాతంత్ర్యం ప్రకటించిన మొట్టమొదటి దేశాలలో వియత్నాం ఒకటి. 1945 సెప్టెంబర్ 2న అధ్యక్షుడు హోచిమిన్ మాట్లాడుతూ, వియత్నాం ఎప్పటికీ విదేశీ ఆధిపత్యానికి లొంగదని ప్రపంచానికి ప్రకటించిన విషయాన్ని వేడుకల్లో గుర్తు చేశారు. వియత్నాం విప్లవ విజయం ఆఫ్రికా నుంచి లాటిన్ అమెరికా వరకు వలసవాద వ్యతిరేక సోషలిస్టు ఉద్యమాలకు మార్గదర్శిగా మారింది. వియత్నాం ప్రపంచంలోని సామ్రాజ్యవాద శక్తులను ఓడించగలదని నిరూపించింది.

కవాతు ప్రారంభంలో, కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి టో లామ్, బా దిన్ స్క్వేర్‌లో హోచిమిన్ స్వాతంత్ర్య ప్రకటనను చదివిన క్షణాన్ని గుర్తుచేసుకున్నారు. వియత్నాం ఆగ్నేయాసియాలో మొట్టమొదటి ప్రజాస్వామ్యదేశమని, దేశానికి స్వాతంత్ర్యం, స్వేచ్ఛ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాంకు నాంది పలికిందన్నారు. వియత్నాం విజయాలన్నీ “హోచిమిన్ ఆలోచన, నైతికత, నాయకత్వ లక్షణాలకి” తార్కాణమన్నారు. వియత్నాం విజయానికి మార్క్సిజం – లెనినిజం సిద్ధాంతాలు, హోచిమిన్ ఆలోచనా విధానానికి నిదర్శనమని టో లామ్ పేర్కొన్నారు.. “మా పార్టీ, సోషలిజంతో ముడిపడి జాతీయ స్వాతంత్ర్య లక్ష్యంతో దృఢంగా ఉందని పేర్కొన్నారు. దేశ పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం – లెనినిజం, హోచిమిన్ ఆలోచనలను సృజనాత్మకంగా అన్వయించి అభివృద్ధి చేసిందన్నారు. ప్రజల ప్రయోజనాలు ప్రాతిపదికగా వియత్నాం అభివృద్ధి చెందిందని టామ్ విశ్వాసం వెలిబుచ్చారు.

హనోయ్‌లో అత్యంత కన్నుల పండుగగా జరిగిన కవాతు ఆ దేశ చరిత్రను తిరిగి పరిశీలించడంతో





పాటు వియత్నాం ప్రస్తుత విజయాలకు తార్కాణం. స్వాతంత్ర్య, పునరేకీకరణ కోసం వియత్నాంకు అండగా నిలిచిన కంబోడియా, లావోస్, చైనా, రష్యా దళాలు వియత్నాం పీపుల్స్ ఆర్మీతో పాటు కవాతులో పాల్గొనడం విశేషం. వియత్నాంలోని విభిన్న ప్రాంతాలు, పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పౌర ప్రతినిధులు, యుద్ధం, దిగ్బంధన రోజుల నుంచి ఏ విధంగా అభివృద్ధి చెందాయో, అనంతర పరిస్థితుల్లో వియత్నాం సాధించిన విజయాలను ప్రదర్శించారు.

1986లో వియత్నాం పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టిన నాటినుంచి వియత్నాం ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న దేశంగా మారింది. వియత్నాం ఆర్థిక వ్యవస్థ అనేక రెట్లు పెరిగింది, దేశంలో పేదరికం దాదాపు పూర్తిగా తగ్గింది. వియత్నాం వాణిజ్యం, తయారీ రంగం, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా మారింది. ఇతర దేశాల మాదిరిగా వియత్నాం నయా ఉదారవాద, ప్రపంచీకరణ మార్గాన్ని అనుసరించలేదు, బదులుగా దాని స్వంత సోషలిస్ట్ ఆధారిత మార్గాన్ని రూపొందించుకుంది. దేశంలో సంస్కరణలు, స్వాతంత్ర్యం ప్రాతిపదికగా వియత్నాం బహుముఖంగా అభివృద్ధి చెందింది. ఈ మార్గం ప్రజల సంకల్పంలో పాతుకుపోయిందని టో లామ్ నొక్కిచెప్పారు. “ఆ బలం ప్రజల నుంచి ఉద్భవించింది, ప్రజలకు చెందినది. ప్రజల కోసం వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ అద్భుతమైన అజెండా కింద ఉన్న జాతీయ సంఘీభావ కూటమి బలం”గా పేర్కొన్నారు. ప్రజల బలాన్ని దేశ భవిష్యత్తు లక్ష్యాలతో ముడిపెట్టారు. 2045 నాటికి, వియత్నాం స్వాతంత్ర్య శతాబ్ది లక్ష్యంగా “శక్తిమంతమైన, సంపన్నమైన, సంతోషకరమైన దేశంగా” ఉండాలని తమ లక్ష్యంగా పేర్కొన్నారు. ఇది ఆ దేశ ప్రజల ఆకాంక్షగా తెలిపారు.

వియత్నాం స్వాతంత్ర్యం, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి తమ సంసిద్ధతను పునరుద్ఘాటిస్తూ, టో లామ్ దేశంలో శాంతిని సంపూర్ణంగా నెలకొల్పడమే తమ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. “మేము ప్రపంచంలోని అన్ని దేశాలకు స్నేహితుడిగా, నమ్మకమైన భాగస్వామిగా ఉండాలనుకుంటున్నాము. మేము అంతర్జాతీయ చట్టాన్ని, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను గౌరవిస్తాము, శాంతియుత చర్చల ద్వారా విభేదాలు, వివాదాలను పరిష్కరిస్తాము.” అయితే, వియత్నాం “స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, ఐక్యత, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించే ఎటువంటి కుట్రలు లేదా చర్యలతో ఏ మాత్రం రాజీపడదు” అని ఆయన నొక్కి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా దేశాలు వియత్నాం పోరాట ఔచిత్యాన్ని నొక్కి చెబుతూ, అత్యంత శక్తిమంతమైన సామ్రాజ్యవాద దేశాలను కూడా ఓడించవచ్చని ప్రపంచం ఇప్పటికీ వియత్నాం వైపు చూస్తుందని అన్నారు.

వియత్నాం ఆధునిక సైనిక సాంకేతికత ప్రదర్శనలపై ప్రధానంగా మీడి యా తన దృష్టిని సారించింది. ఈ ఉత్సవాలు కార్మికవర్గం, ప్రజా ప్రాతినిధ్యాన్ని కూడా హైలైట్ చేశాయి. కార్మికులు, రైతులు, యువకులు హనోయ్ వీధుల గుండా కవాతులో పాల్గొనడం అత్యంత ఆకర్షణగా నిలిచింది. ఎనభై సంవత్సరాల అనంతరం వియత్నాం ప్రజల త్యాగం, సంఘీభావం ద్వారా ఏర్పడిన దేశంగా కీర్తి గణించింది. వలసవాద గొలుసులను విచ్ఛిన్నం చేయడానికి పెట్టుబడిదారీ ఆధిపత్య ప్రపంచ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, సోషలిజం వైపు తమ మార్గాన్ని అనుసరిస్తున్నదని ప్రజలు పేర్కొన్నారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, శ్రేయస్సు ప్రాతిపదికలుగా దేశాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపిస్తామని లామ్ విశ్వాసం వెలిబుచ్చారు.

# లేబర్ కోడ్‌లపై ప్రభుత్వంలో భిన్నాభిప్రాయాలు

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) వేతన కోడ్ 2019, సామాజిక భద్రత కోడ్ 2020లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసినప్పటికీ, రాజకీయ నాయకత్వం, అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అండదండలు కలిగిన బిఎంఎస్ ఇతర రెండు కార్మిక కోడ్‌ల (పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020,వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020) లలో ఉన్న అనేక నిబంధనలు కార్మిక వ్యతిరేకమైనవని పేర్కొనడం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వానికి బిఎంఎస్ కొత్త తలనొప్పిని సృష్టించింది. పది కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ఇప్పటికే ఈ నాలుగు కార్మిక కోడ్లన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేసింది. దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహించింది.

29 కార్మిక చట్టాలను కలిపి తయారు చేసిన నాలుగు కార్మిక కోడ్లు ఒక సమగ్ర ప్యాకేజీ అని, అందువల్ల వాటిని విడదీయడం సాధ్యం కాదని ప్రభుత్వంలో నెలకొన్న ప్రధాన అభిప్రాయం. వీటిని ఒకేసారి అమలు చేయాలి లేదంటే అసలు అమలు చేయకూడదు. దశలవారీగా అమలు చేస్తే, అది పరిష్కరిం చే సమస్యల కంటే ఎక్కువ సమస్యలను సృష్టించవచ్చు.

బిఎంఎస్ చేస్తున్న ఇతర రెండు డిమాండ్‌లు ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేశాయి. భోపాల్‌లో ఆగస్టు 22,24 తేదీలలో జరిగిన 159వ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి)ని నిర్వహించాలని కోరుతూ తీర్మానం చేసింది. కార్మిక సమస్యలపై అత్యున్నత త్రైపాక్షిక సంస్థ అయిన ఐఎల్‌సిని మోదీ ప్రభుత్వం 2015 నుండి నిర్వహించలేదు. ఈ విధంగా డిమాండ్ చేయడమే ప్రభుత్వం కార్మిక వ్యతిరకమైనదని భావించవచ్చు. ఎందుకంటే ప్రభుత్వం ఐఎల్‌సిని పట్టించుకోకుండా నాలుగు కార్మిక కోడ్లను తీసుకువచ్చింది. బిఎంఎస్ అధ్యక్షుడు హిరణ్మయ్ పాండ్యా మాట్లాడుతూ “చివరిసారిగా 2015లో ఐఎల్‌సి జరిగింది. కార్మిక మంత్రిత్వ శాఖ కింద అత్యున్నత త్రైపాక్షిక సంస్థ ఐఎల్‌సి. ఇది భారత ప్రజాస్వామ్యంలో ఉత్తమ భాగస్వామ్యాలలో ఒకటి. 2015 తర్వాత, ఉద్యోగ ప్రపంచం బహుళ కోణాల్లో గణనీయమైన మార్పులకు లోనైంది. టెక్నాలజీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, డిజిటల్ పరివర్తన, సామాజిక జీవితం, ఆర్థిక పరిస్థితులలో అనేక మార్పులను తీసుకువచ్చాయి. అత్యున్నత నిర్ణయాలను తీసుకునే సంస్థలో కార్మిక సమస్యలపై చర్చించడం అత్యవసరం” అని అన్నారు.

కనీస వేతనం,వేతనాలను సకాలంలో చెల్లించడంపై వేతనాల కోడ్ దృష్టి పెడుతుందని, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులతో సహా అన్ని రకాల కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, ప్రసూతి, బీమా వంటి ప్రయోజనాలను సామాజిక భద్రత కోడ్ విస్తరింపజేస్తుందని పాండ్యా అన్నా రు. అయినప్పటికీ, పారిశ్రామిక సంబంధాల కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లలో కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న అనేక నిబంధనలను బిఎంఎస్ వ్యతిరేకిస్తోంద ని ఆయన నొక్కి చెప్పా రు. రెండు కార్మిక కోడ్లలో గణనీయమైన మార్పు లు లేకుండా క్షేత్రస్థాయి లో కార్మికులు వాటిని అంగీకరించడానికి సిద్ధంగా లేరని చెప్పేందుకు వాటిపై విమర్శలు సూచిస్తున్నాయి. ప్రభుత్వం వాటిని అమ లు చేయడానికి ప్రయత్నిస్తే నిరసనలను ఉధృతం చేస్తామని 10 కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ఇప్పటికే హెచ్చరించింది.

ఈ నేపథ్యంలో బిఎంఎస్ డిమాండ్ చేసినట్లుగా, కార్మిక కోడ్లను దశలవారీగా అమలు చేయడం సాధ్యమేనా అని కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయడం ప్రారంభించింది. ప్రభుత్వం తుది నిర్ణయానికి వచ్చే వరకు కోడ్ల అమలు మరింత ఆలస్యం అవుతుందని ఇవన్నీ సూచిస్తున్నాయి.

ఈలోగా తనపై కార్మిక వ్యతిరేకి అని ఉన్న ముద్రను మార్చుకోవడానికి, దేశంలో కార్మికుల సంక్షేమానికి తాము పాటుపడుతున్నామని చూపించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రభుత్వం ఇటీవల

> *కార్మిక కోడ్లు అమలు చేయడానికి ముందు కార్మిక వర్గం విశ్వాసాన్ని పొందాలనే ఆశతో ప్రభు త్వం ప్రచార యంత్రాంగం ప్రస్తుతం సామాజిక భద్రతా పథకాలపై దృష్టి సారించడం ద్వారా రాజకీయ నాయకత్వాన్ని కార్మికులకు అనుకూలమని చూపించడానికి పనిచేస్తోంది. బిఎంఎస్ వైఖరిలో ఎటువంటి మార్పు రాకపోవడం ప్రభుత్వానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇది వేతన కోడ్, సామాజిక భద్రత కోడ్ల అమలుకు మద్దతు ఇస్తున్నప్పటికీ, పారిశ్రామిక సంబంధాల కోడ్, వృతిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ల అమలుకు వ్యతిరేకంగా ఉంది.*

అనేక సామాజిక భద్రతా పథకాలను ప్రారంభించింది.

ఉద్యోగ సృష్టిపై ప్రధాన్ మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పిఎం విబిఆర్‌వై) కింద ఒక సంవత్సరం ఆలస్యం తర్వాత, ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ స్కీమ్ (ఇఎల్ఐ) చివరకు 2025 ఆగస్టు 1న ప్రారంభమైంది. ఇది 2027 జూలై 31 వరకు అమలులో ఉంటుంది. ఈ పథకం ఇపిఎఫ్ఓ ద్వారా అమ లు చేయబడుతుంది. ఇపిఎఫ్ఓలో సభ్యులుగా మారే ప్రతి కార్మికునికి సబ్సిడీ ఇవ్వబడుతుంది. కొత్తగా ప్రారంభించిన పథకం ప్రభావాన్ని అంచనా వేయడానికి కార్మిక , ఉపాధి మంత్రిత్వ శాఖ, గణాంకాలు , కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ (ఎంఒ ఎస్‌పిఐ)తో సహకరించాలని కోరింది.

కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, కుటుంబ పెన్షన్ ద్వారా ఇపిఎఫ్ఓ సామాజిక భద్రతను అందిస్తుంది. అయితే, భారతదేశంలో సంఘటిత రంగం లో, అసంఘటిత రంగంలో కలిపి 90 శాతానికి పైగా ఉద్యోగాలు అనియత ఉద్యోగాల్లో ఉండడమే సమస్య. ఇపిఎఫ్ఓ ద్వారా కార్మికులకు సామాజిక భద్రతను కల్పిస్తున్నట్లు చూపించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అయితే, ఈ పథకం 90 శాతానికి పైగా అనియత కార్మికులకు వర్తించకపోవడం దురదృష్టకరం.

కార్మికుల కోసం ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) పథకం కింద సామాజిక భద్రతను విస్తరించడానికి స్ప్రీ(ఎస్‌పిఆర్ఇఇ) 2025 అనే మరో పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమం 2025 డిసెంబర్ 31 వరకు అందుబాటులో ఉంటుంది. ఇది యజమానులు, కార్మికులకు చట్టబద్ధమైన సామాజిక భద్రతలోకి రావడానికి ఒక కొత్త అవకాశాన్ని అందిస్తుంది. కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, కార్మికులు అందరికీ ఉదారంగా, సమగ్రమైన సామాజిక భద్రత చట్రాన్ని అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబ డి ఉంది అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

ఈ కార్యక్రమం లక్షల మంది నమోదు కాని ఉద్యోగులను, ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగాలలో ఉన్నవారితో సహా, ఇఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చి, ఆరోగ్య సంరక్షణ, ప్రసూతి మద్దతు, ఆర్థిక భద్రత, ఇతర ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకువస్తుంది. స్ప్రీ 2025 కింద నమోదు చేసుకునే యజమానులు గణనీయమైన సడలింపులను పొందుతా రు. గతంలో యాజమాన్యాల వంతు చెల్లించాల్సిన ( కాంట్రిబ్యూషన్‌ల) మొత్తం కోసం జరిమానాలు లేదా పాత డిమాండ్లు ఉండవు. గత కాలాలకు తనిఖీలు ఉండవు. యజమాని ప్రకటించిన తేదీ నుండి రిజిస్ట్రేషన్ చెల్లుబాటు అవుతుంది.

స్ప్రీ 2025 తో పాటు, ప్రభుత్వం అమ్నెస్టీ స్కీమ్ 2025ను ఆమోదించింది. ఇది 2025 అక్టోబర్ 1 నుండి 2026 సెప్టెంబర్ 30వరకు అమలులో ఉంటుంది. ఇది యజమానులకు ఇఎస్ఐ చట్టం కింద వివాదాలు, పెండింగ్ కేసులను పరిష్కరించుకోవడానికి ఏక కాల అవకాశాన్ని కల్పిస్తుంది.

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు (అనియత కార్మికులలో ఒక ఉపవిభాగం) సంబంధించి, ఇంకా అమలు చేయని సామాజిక భద్రత కోడ్, 2020 కింద వారికి చట్టపరమైన గుర్తింపు, సామాజిక భద్రత ప్రయోజనాలు లభిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. భారతదేశంలో గిగ్ వర్కర్స్ 2024–25లో 1 కోటి నుండి 2029–30 నాటికి 2.35 కోట్లకు పెరుగుతారని అంచనా. అయినప్పటికీ, 1 కోటి గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులలో ఇప్పటివరకు 3.37 లక్షల మంది మాత్రమే ఈ–శ్రమ్ పోర్టల్‌లో స్వయంగా నమోదు చేసుకున్నారు. ఈ పోర్టల్ ఇప్పటివరకు సుమారు 30.98 లక్షలమంది అనియత కార్మికులను నమోదు చేసింది.

కార్మిక కోడ్లు అమలు చేయడానికి ముందు కార్మిక వర్గం విశ్వాసాన్ని పొందాలనే ఆశతో ప్రభు త్వం ప్రచార యంత్రాంగం ప్రస్తుతం సామాజిక భద్రతా పథకాలపై దృష్టి సారించడం ద్వారా రాజకీయ నాయకత్వాన్ని కార్మికులకు అనుకూలమని చూపించడానికి పనిచేస్తోంది. బిఎంఎస్ వైఖరిలో ఎటువంటి మార్పు రాకపోవడం ప్రభుత్వానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇది వేతన కోడ్, సామాజిక భద్రత కోడ్ల అమలుకు మద్దతు ఇస్తున్నప్పటికీ, పారిశ్రామిక సంబంధాల కోడ్, వృతిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ల అమలుకు వ్యతిరేకంగా ఉంది.

(ఐపిఎ సర్వీస్)

చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21–25 సెప్టెంబర్, 1925
చండీఘడ్ (పంజాబ్)

## నిబంధనావళిలో పెనుమార్పులు తెచ్చిన
# సిపిఐ 5వ (అసాధారణ)కాంగ్రెస్
### అమృత్‌సర్ (పంజాబ్) 1958

కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన (1957) నేపథ్యంలో 1958 (ఏప్రిల్ 6–13)లో అమృత్‌సర్‌లో ఈ ఐదవ (అసాధారణ) కాంగ్రెస్ (జాతీయ మహాసభ) సిపిఐ చరిత్రలో ఒక మైలురాయి. అది పార్టీ నిబంధనావళిలో ప్రధానమైన మార్పులు తెచ్చింది. కొత్త నిబంధనావళిని ఆమోదించింది.

భారత కమ్యూనిస్టు పార్టీ విధానంలో గుణాత్మక మార్పు తెచ్చిన ఈ మహాసభకు ముందు సంవత్సరాల్లో దేశంలో జరిగిన పరిణామాలను సూక్ష్మ ంగా గుర్తుచేసుకుందాం. 1948–50 సంవత్సరాల మధ్య బిటిఆర్ నాయకత్వంలో పార్టీ అనుసరించిన పిడివాద సాయుధ తిరుగుబాటు పంథా విడనాడి దిద్దుబాటు చర్యలు తీసుకున్నప్పటికీ పార్టీ నిర్మాణ రీత్యా కోలుకుని ప్రజల మధ్యకు వెళ్లటానికి, ప్రజా ఉద్యమాల్లో భాగస్వామి కావ




టానికి, నిర్మించటానికి కొంతకాలం పట్టింది. పార్టీలో సిద్ధాంత సమస్యలు కొనసాగుతున్నప్పటికీ ప్రజా ఉద్యమాల నిర్మాణంలో పార్టీ అగ్రభాగాన ఉండి వారి అభిమానాన్ని పొందుతూ వచ్చింది. స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రధానాంశమైన భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా దేశ పునర్నిర్మాణం కోసం ఉద్యమం మొదలైంది. దక్షిణాదిని తీసుకుంటే, తెలంగాణలో సాయుధ పోరాటం విరమణ తర్వాత, 1952 సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ మంచి ఫలితాలు సాధించింది. అయితే తెలంగాణ స్టేట్‌లో భాగంగా ఉన్న కన్నడ, మరాఠా భాషా ప్రాంతాలు కాంగ్రెస్‌కు పట్టం గట్టాయి. పక్కనే ఉన్న ఆంధ్ర ప్రాంతం అప్పుడు బ్రిటీష్‌వారి మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా మద్రాసు స్టేట్‌లో ఉంది. ఆంధ్రలో ఫ్యూడల్ – భూస్వామ్య వ్యతిరేక పోరాటం పెద్ద ఎత్తున సాగింది. 1952 ఎన్నికల్లో ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు మంచి ఫలితాలు సాధించినా తమిళ, మళయాళ ప్రాంతాల్లో కాంగ్రెస్ తదితరులు అత్యధిక స్థానాలు గెలిచారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల ముమ్మర పోరాటాల పర్యవసానంగా 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 1955లో అసెంబ్లీకి మధ్యంతర ఎన్నికల్లో కమ్యూనిస్టులదే అధికారం అన్న వాతావరణంలో సిపిఐ ఒంటెత్తుపోకడ, సిపిఐకి వ్యతిరేకంగా ఇతర పార్టీలన్నీ ఏకం కావటం వల్ల, పార్టీ ఘోరమైన ఓటమికి గురైంది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఉద్యమం ఉధృతం కావటంతో మద్రాసు ప్రెసిడెన్సీ బద్దలై అటు కేరళ, తమిళనాడు రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగింది. ఇటు తెలంగాణ స్టేట్ నుంచి కన్నడ, మరాఠా జిల్లాలను ఆయా రాష్ట్రాల్లో కలిపారు. విశాలాంధ్ర (ఆంధ్రప్రదేశ్) రాష్ట్రం ఏర్పాటుకోసం ఇరు ప్రాంతాల్లోని కాంగ్రెస్ ప్రముఖులు, కమ్యూనిస్టులు ఉద్యమించారు. ఇరుప్రాంతాల కాంగ్రెస్ నాయకుల మధ్య ‘పెద్దమనుషుల ఒప్పందం’తో 1956 నవంబరు 1న తెలుగు భాషా ప్రాంతాలను ఐక్యం చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. (అయితే కొండా వెంకట రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి మరికొందరు ఆ విలీనాన్ని వ్యతిరేకించారు. అదే అనంతర దశాబ్దాల్లో ఉద్యమంగా, సెంటిమెంట్‌గా కొనసాగుతూ 2000 సంవత్సరం తదుపరి ప్రజా ఉద్యమంగా ఉధృతమై 2014 జూన్ 2న ఆంధ్రప్రదేశ్ విడిపోయి ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.)



మద్రాసు స్టేట్‌లోని మలబార్ జిల్లాను ట్రావెన్కూర్–కొచ్చిన్ సంస్థానంతో విలీనం చేయటం ద్వారా 1956 నవంబర్ 1న కేరళ రాష్ట్రం ఏర్పడింది. మళయాళం భాష ప్రాతిపదికపై కేరళ రాష్ట్రం ఏర్పాటుకోసం, అంతకుముందు ట్రావెన్కూర్ ఫ్యూడల్ సంస్థానానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుపార్టీ పెద్ద ఉద్యమాలు నడిపింది. సౌభాగ్య కేరళ నిర్మాణానికి కార్యక్రమాన్ని కూడా ప్రజల ముందు ఉంచింది. 1957 ఎన్నికల్లో ప్రజలు సిపిఐకి 126 స్థానాల్లో 60 ఇచ్చి పట్టం కట్టారు. పార్టీ బలపరచగా గెలుపొందిన ఐదుగురు ఇండిపెండెంట్లను కలుపుకుని 1957 ఏప్రిల్ 5న ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వాన కమ్యూనిస్టు ప్రభుత్వం పదవీ ప్రమాణ స్వీకారం చేసింది.

కేరళలో బ్యాలెట్‌ద్వారా కమ్యూనిస్టులు అధికారంలోకి రావటం పార్టీలోపల, బయట పలు సిద్ధాంతం, ఆచరణ ప్రశ్నలను పరిష్కరించింది. ఓటు ద్వారా కమ్యూనిస్టులు ఎన్నడూ అధికారానికి రాలేరనే వాదన పటాపంచలైంది. పార్టీ ఎంచుకున్న పార్లమెంటరీ సంస్థల ఎన్నికలను ఉపయోగించుకోవటం శాంతియుత పరివర్తన అనే పంథాకు బలం చేకూరింది. ఇటలీ, స్పెయిన్ లాంటి దేశాల్లో సంకీర్ణ ప్రభుత్వాల్లో కమ్యూనిస్టులు అధికారం పంచుకోవటం మినహా ఓటు ద్వారా అధికారంలోకి వచ్చిన సందర్భం అప్పటికి లేదు. అయితే స్వార్థపరులు, కాంగ్రెస్ సహా మితవాదులు ఆ ప్రభుత్వాన్ని పూర్తికాలం పని చేయనీయలేదు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1959లో ఆ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది.

దేశంలోని కొత్త పరిస్థితులు, కొత్త అనుభవాలను పరిగణనలోకి తీసుకుని అమృత్‌సర్ మహాసభ ఆమోదించిన నూతన కాన్స్టిట్యూషన్ (నిబంధనావళి)లో పొందుపరచబడిన మౌలికమైన మార్పులు ఇలా ఉన్నాయిః

1. ‘కార్మికవర్గ నియంతృత్వం’ (కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యం అని అర్థం) అనే భావనను విడనాడటం జరిగింది.
2. భారతదేశంలో భవిష్యత్‌లో సోషలిజంలో ప్రతిపక్ష పార్టీల అస్తిత్వం గుర్తించబడింది.
3. పరిపూర్ణ ప్రజాస్వామ్యం, సోషలిజంలను శాంతియుత మార్గాల ద్వారా సాధించేందుకు సిపిఐ పాటుబడుతుంది.
4. సకల దేశభక్తియుత, ప్రజాస్వామిక శక్తులను ఐక్యపరచటం ద్వారా జాతీయ స్వాతంత్ర్య పరిరక్షణకు ప్రతినబూనింది.
5. జాతీయకరణ, ప్రభుత్వరంగం వంటి మంచి లక్షణాలపై మితవాద, అభివృద్ధి నిరోధకులు దాడి చేస్తున్నారని పార్టీ కాంగ్రెస్ పేర్కొన్నది.
6. పార్టీ నిర్మాణంలో రెండంచెలు (కేంద్రకమిటీ, పోలిట్ బ్యూరో) స్థానంలో మూడంచెలు (జాతీయ సమితి, జాతీయ కార్యవర్గం, కార్యదర్శివర్గం) పద్ధతిని నిబంధనావళి ఆమోదించింది.

ఇఎంఎస్ నంబూద్రిపాద్ ‘న్యూ ఏజ్’లో అమృత్‌సర్ కాంగ్రెస్‌పై ఇలా వ్యాఖ్యానించారు. “సిపిఐ వాస్తవికంగా – జాతీయవాదం, ప్రజాస్వామ్యం, ప్రజలకు సేవచేయటం అనే కార్యక్రమాన్ని అనుసరిస్తున్నది; గాంధీజీ అహింస, సహాయ నిరాకరణ, స్వరాజ్ స్ఫూర్తిని పాటిస్తున్నది!!

కామ్రేడ్ అజయ్ ఘోష్‌ను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది. తొలిసారి కార్యదర్శివర్గం, కేంద్ర కార్యవర్గాలను ఎన్నుకుంది.

**కేంద్ర సెక్రటేరియట్ సభ్యులు**

అజయ్ ఘోష్(జనరల్ సెక్రటరీ) 2. ఎస్.ఎ.డాంగే, 3. భూపేష్ గుప్తా, 4. డాక్టర్ జడ్.ఎ.అహ్మద్, 5.బి.టి.రణదివె, 6.పి.సి.జోషి,7.ఎ.కె.గోపాలన్,8. ఎం.బసవ పున్నయ్య,

**కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ః**

1.అజయ్ ఘోష్, 2. ఎస్.ఎ.డాంగే, 3. భూపేష్ గుప్తా, 4. డాక్టర్ జడ్.ఎ.అహ్మద్, 5. బి.టి.రణదివె, 6. పి.సి.జోషి, 7. ఎ.కె.గోపాలన్, 8. ఎం.బసవ పున్నయ్య, 9. ఇఎంఎస్. నంబూద్రిపాద్,10.జ్యోతిబసు, 11.పి.రామమూర్తి, 12. ఎం.ఎన్.గోవిందన్ నాయర్,13. భవాని సేన్, 14. సి.రాజేశ్వరరావు, 15. నండూరి ప్రసాదరావు, 16. కె.దామోదరన్, 17. సోహాన్ సింగ్ జోష్, 18. ఎం.ఆర్.వెంకటరామన్, 19. హరికిషన్ సింగ్ సూర్జిత్, 20. గురుచరణ్ పట్నాయక్, 21. ఎస్.జి.సర్దేశాయ్, 22. రావి నారాయణ రెడ్డి, 23. రమేష్ చంద్ర, 24. ఫణి బోర, 25. హరే కృష్ణ కోనార్, 26. ఎస్.వి.ఘాటే (ఛైర్మన్ సిసిసి)(శాశ్వత ఆహ్వానితుడు)

## 'పొల్యూషన్ తనిఖీ' వాహనాన్ని తనిఖీ చేసేదెవరూ ?




**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** పెరుగుతున్న వాహనాలతో కాలుష్యం కూడా పెరుగుతూ వస్తుంది. వాహనదారులు ఎప్ప టికప్పుడు వాహన కాలుష్యాన్ని తనిఖీ చేసుకోవడానికి వాహన కాలుష్య తనిఖీ కేంద్రాలు (వాహనాలు) ఉ న్నాయి. కానీ జగి త్యాల జిల్లా కేంద్రంలోని వాహనాల కాలుష్యతను తనిఖీ చే సే వాహనం నుంచి వెలువడే పొగ (ఉద్గారాలు) పరిమితికి మించి రావడం చూసిన వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాల కాలుష్యం తనిఖీ చేసే వాహనం నుంచి వెలువడే పొగ పరిమితికి మించి వెలువడుతుందని జగి త్యాల జిల్లా కేంద్రంలోని పొల్యూషన్ తనిఖీ వాహనాన్ని సీజ్ చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు సామాన్య ప్రజలు వాహనాలు అన్ని విధాలు పర్మిషన్ పేపర్స్ ఉండాలని తెలిపే అధికారులకు పొల్యూషన్ తనిఖీ వాహనం కనిపించడం లేదా అని నేరుగా ప్రశ్నిస్తున్నారు.

## ఎల్ఎండి 2 గేట్ల ఎత్తివేత...



**ప్రజాపక్షం/కరీంనగర్:**లోయర్ మానేరు జలాశయానికి సు మారు 8 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడం, ఇప్పటికే 24.034 టిఎంసిల కెపాసిటీ గల డ్యామ్ నీటిమట్టం 23.516 టిఎంసిలకు చేరుకోవడంతో మంగళవారం సా యంత్రం రెండు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నీటి విడుదల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చై ర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సిపి గౌస్ ఆ లంతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు పూజ కార్యక్రమం నిర్వ హించి స్విచ్ ఆన్ చేసి నీటి విడుదల ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క వ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఏడాది సాగు, తాగునీటి కొరతఉండదన్నారు.ఎల్ఎండిపూర్తి సామ ర్థ్యం920 అడుగుల నీటిమట్టానికి గాను 919.40 అడుగులకు చేరింది. మొ త్తం 7,642 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా స్పిల్ వే ద్వారా 4 వేల క్యూ సె క్కులు, కాకతీయ కెనాల్‌కు ఐదువేల క్యూసెక్కులు నీటి విడుదల చేస్తున్నారు.

## లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం :ఎస్పి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం చేకూరుతుందని ఈనెల 13న నిర్వహించే జాతీయ మెగా లోక్ అ దాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరి సిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రకటనలో పేర్కొ న్నారు. రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కం పౌం డబుల్, సివిల్ తగాదా,ఆస్తి విభజన, కుటుంబపరమైన నిర్వహణ ,వైవాహిక జీవితానికి సంబంధించిన, బ్యాంకు రికవరీ,విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని జిల్లా ఎస్పీ సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని సమయాన్ని ,డబ్బులను వృధా చేసుకోవద్దని సూచించా రు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వ హించే కానిస్టేబుల్ లు పోలీస్ సిబ్బంది రాజీ పడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగా హన కల్పించాలని పేర్కొన్నారు.

## పట్టణ పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం /హుస్నాబాద్ :** పట్టణంలోని స్వచ్ఛతపై 100 రోజుల కార్యక్ర మంలో భాగంగా మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు అందరు తమ ఇంటి వంటకు మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు తడి చెత్త పొడి చెత్త వేరే వేరుగా ఇవ్వాలని సూచించారు, ఇంటి యజమానులు వారి ఇంటి పరిసరాల్లో పెంచిన మొక్కల చెత్తను పడేవేయకుండ వాటిని నిల్వ చేసి కంపోస్టు ఎరువుల తయారు చేసుకుని పెరటి మొక్కలకు వినియోగించు కోవాలని అన్నారు. అలాగే పట్టణ ప్రజలు అందరు వాడి పరిసరాల్లో మలమూత్రాలను , మరుగు దొడ్డిని విసర్జించకుండ చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం కూరగాయలు కొనుగోలు చేయువారు ఇంటి నుండి తట్టు సంచులను తీసుకువెళ్లాలని అన్నారు. లేని ఎడల 120 మైక్రోన్స్ పరిమాణ గల కవర్లను మాత్రమే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికా రులు, మేనేజర్ సంపత్, సానిటర్ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ఆర్ ఐ ప్రసాద్, సి ఐ శంకర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి అండర్ 14, 17 ఖోఖో , కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిధిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి. నరేందర్‌రెడ్డి హాజరై మాట్లా డారు. విద్యార్థులు క్రీడలలో పాల్గొనడమే కాకుండా విజయం సాధించడమే లక్ష్యంగా సాధన చేసి అగ్రగామిగా ఉండాలని కోరారు. ఆల్ఫోర్స్ విద్యాసం స్థల ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థమై ఎన్నో క్రీడల పోటీలు నిర్వహిం చడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ ఎంపిక పోటీలలో గెలుపొందిన వారు జిల్లా స్థాయిలో ఆడతారని చెప్పారు. విద్యాసంస్థల ద్వారా క్రీడారంగా నికి ఎనలేని ప్రోత్సాహం అందిస్తామని, అదే సాంప్రదాయాన్ని ఈ యేడాది కొనసాగించడానికి సుముఖతతో ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్షుడు బాబు శ్రీనివాస్, గిన్నె శ్రీనివాస్, ఇ.హరీష్, బి.వేణు గోపాల్, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

## తల్లి మందలించినందుకు గడ్డిమందుతాగి..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**గడ్డి మందుతాగి మధుమతి ఆత్మహత్యకు పాల్ప డి గత తొమ్మిది రోజులుగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది మృత్యువుతో పోరాడి మరణించిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలంలో చోటుచేసుకుం ది.వివరాల్లోకి వెళితే దుమాల గ్రామంలో స్థానికులు,కుటుంబికులు తెలిపిన ప్రకారం లకావత్ లలిత పరంగి ఇదేనెల ఒకటో తారిఖున బడికి వెళ్ళడం లే దని మందలించిందన్న కోపంతో తన కూతురు(విద్యార్థిని) పదహారు సంవ త్సరాలు గల మధుమతి పదవ తరగతి చదువుతోంది. గడ్డిమందు త్రాగి ఆ సుపత్రి పాలైంది.ఈ సంఘటన ఆలస్యంగా తెలపడంతో పరిస్థితి విషమించి ంది.మండలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఎనిమిది రోజులుగా చికిత్స పొ ందుతూ మరణించింది.పోలీసులు సంఘటన వివరాలు సేకరించారు.

## పేద ప్రజలకు అండగా ఎల్‌ఒసి: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చొప్పదండి:**పేద ప్రజలకు ఆపద సమయంలో ఎల్‌వోసి అండగా ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం చొప్పదండి పట్టణానికి చెందిన వల్లాల రమ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎని మిది లక్షల ఐదు వేల రూపాయులు (8.05 లక్షలు) ఎల్‌ఒసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మావురపు రాములు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పట్టాల కొరకు దరఖాస్తుల స్వీకరణ: కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మధ్య మానేరు ప్రాజెక్టు ముంపు గ్రామాలు కొదురుపాక, వర దవెల్లి, నిరోజుపల్లి గ్రామాల నిర్వాసితుల నుంచి ఇందిరమ్మ ఇండ్ల పట్టాల కొరకు దర ఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. బోయిన్పల్లి మండలం కొదురు పాక, వరదవెల్లి, నిరోజుపల్లి గ్రామాల నిర్వాసితులు ఎవరైతే ఆర్ & ఆర్ పట్టా ధ్రువీకరణ పత్రం పొంది ఉన్నారో వారు సంబం ధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో తేదీ 10 సెప్టెంబర్ 2025 మరియు 11 సెప్టెంబర్ 2025 రెండు రోజులలో గ్రామసభల ద్వారా దర ఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఈ ప్రకటన లో పేర్కొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా

* 'ఏక్‌పేడ్ మాకే నామ్ 'కార్యక్రమంలో 15వేల మొక్కలు నాటిన ఉద్యోగులు
* పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి: జిల్లా కలెక్టర్ హైమావతి

# సిద్దిపేటలో 22.847 మొక్కలు నాటివేత

**ప్రజాపక్షం/సిద్దిపేట :** పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా జిల్లాలో ప్రతి ఉద్యోగి తన తల్లి పేరిట ఒక్క మొక్కను నాటాలని నిర్వహించిన కార్యక్రమంలో 15వేల మొక్క లను నాటినట్లు జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. అలాగే జిల్లాలో నిర్వహించిన వనమహోత్సవంలో 22.827లక్షల మొక్కలను నాటినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వనమహోత్సవంలో 22లక్షలు నాటాలని లక్ష్యంగా పెట్టుకొని వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా 100శాతం మొక్కలను నాటినట్లు వెల్లడించారు. పర్యా వరణ పరిరక్షణ లక్ష్యంగా ఏక్ పేడ్ మాకే నామ్ స్ఫూర్తితో జిల్లా కలెక్టర్ ఆలోచన మేరకు ప్రతి ఉద్యోగి వారి తల్లిపేరిట మొక్కను నాటే వినూత్న కార్యక్రమా నికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. జిల్లా అదనపు కలె క్టర్ గరిమా అగర్వాల్ పర్యావేక్షణలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూపకల్పన చేసి మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఒక్కో ఉద్యోగి ఒక్క మొక్కను నాటే కార్య





క్రమం చేపట్టారు. జిల్లాకలెక్టర్ నుండి వివిధ శాఖల అధి కారులు, ఉద్యోగులు తమ నివాస గృహాల వద్ద ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన స్థలంలో ర్యాలీగా వచ్చి ఉద్యో గులు మొక్కను నాటి,సెల్ఫిదిగి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లా డుతూ ఏక్ పేడ్ మాకే నాక్ కార్యక్రమంలో జిల్లా పరి ధిలోని ఉద్యోగులు సంతోషంగా మనస్ఫూర్తిగా ఉత్సా హంగా పాల్గొన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పోలీ స్‌శాఖతో సహా 15వేల మొక్కలనునాటడం జరిగింద న్నారు. తల్లికి ఏమిచ్చిన రుణం తీర్చుకోలేమని,అందుకే తల్లి పేరిట మొక్కను నాటి సంరక్షించే బాధ్యతను ఉద్యోగి చూసుకోవాలన్నారు. తల్లి తర్వాత భూమిని మాతతో పోలుస్తామన్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై భూమాత రుణాన్ని తీర్చు కునే అవకాశం లభిస్తుందన్నారు. జిల్లా అదనపు కలె క్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిర క్షణలో భూ మాతకు సహకరించటంలో చిన్న ప్రయత్నం ఒక్క ఉద్యోగి ఒక్క మొక్కను నాటడం కార్య క్రమంలో జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. దీన్ని స్ఫూర్తితో ప్రజలందరు కూడ మొక్కలు నాటి సంర క్షించాలన్నారుస. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఓ జైదేవ్ ఆర్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

## ఎస్‌టి జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే కుట్రను మానుకోవాలి

శాతవాహన యూనివర్సిటీ విద్యార్థి జెఏసిధర్నా

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**ఎస్‌టి జాబితా నుంచి బంజారా, లంబాడి సుగాలీలను తొలగించాలని సుప్రీం కోర్టులో వేసి అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ ఆదివాసీ గిరిజన నేతలకు హితవు పలికారు. మంగళవారం కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ముందు గిరిజన విద్యార్థుల జెఏసిఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో బీమా సాహెబ్ మాట్లా డుతూ ఎస్‌టిజాబితాలో లంబాడీ, బంజారాలను ఆర్టికల్ 342 ప్రకారం రాజ్యాంగబద్ధంగానే చేర్చారని అన్నారు. అయి నప్పటికీ కొందరు ఆదివాసీ నేతలు తమ స్వార్ధ రాజకీయ ఉనికి కోసమే అక్రమ కేసులు వేస్తూ అన్నదమ్ముల్లా ఉన్న లంబాడీ, ఆదివాసీ సోదరుల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. 1976లో ఎస్‌టిజాబితాలో లంబాడీలతో పాటు ఎరుకల, రాజ్ గొండు తెగలను సైతం చేర్చారని, మరి మిగతా రెండు తెగలను సైతం తీసివేయాలని ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. ఇది కేవలం బంజారాలపై వ్యక్తి గత కక్షతో చేస్తున్న దుష్ప్రచారామని అన్నారు. ఈ వివాదంపై రాజకీయ పార్టీలు తమ వైఖరి తెలపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఆదివాసీ గిరిజన నేతలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ విద్యార్థి జెఏసి అధ్యక్షుడు రంజిత్ నాయక్, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడా మోహన్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపా ధ్యక్షుడు భూక్య సంతోష్, రాష్ట్ర నాయకుడు మాలో రాజేష్, విధ్యార్థి నాయకులు ప్రేమ్ నాయక్, వంశీ నాయక్, మాలోత్ నాయక్, కృష్ణ, సురేష్, రమేష్, జగన్ తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణం వేగ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగ ళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ధర్మారం మండలంలో విస్తృతంగా పర్యటిం చారు. పత్తిపాక గ్రామంలోని పల్లె దవాఖానా, అంగన్వాడి సెంటర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, మల్లా పూర్ లోని సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్, బంజే రుపల్లి లోని ప్రాథమిక పాఠశాల,లంబాడి తండా లోని ప్రాథమిక పాఠశాల, ధర్మారం గెస్ట్ హౌస్, తహసీల్దార్ కార్యాలయం ఎంపిడిఓ కార్యాలయ ం, నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేం ద్రం భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. అ నం తరం మాట్లాడుతూ పత్తిపాక ఉన్నత పాఠశాల లో ర్యాంపు, అంతర్గత రోడ్డు, కాంపౌండ్ వాల్ ని ర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.మల్లాపూర్ రెసిడెన్షియల్ స్కూల్ న ందు వంట గది సెక్షన్ , డార్మెంటరీ మరమ్మత్తులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.లంబాడితండా (బి) ప్రాథమిక పాఠశాలలో ప్రహరి గోడ నిర్మాణా నికి కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ధర్మారం మండలంలో ఉన్న పంచాయతీ రాజ్ అతిథి గృ హం మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించా రు.ఎంపిడిఒకార్యాలయం పరిశీలించిన కలెక్టర్ ఇ ందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, మండలంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇం డ్లను పూర్తిస్థాయిలో గ్రౌండ్ చేయాలని, లబ్ధిదారు లు ఇండ్ల నిర్మాణ పనులు వెంటనే చేపట్టేలా చ ర్యలు తీసుకోవాలని, నిరుపేదలకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయలు ము ందస్తు రుణం అందజేయాలని కలెక్టర్ ఆదేశించా రు.అనంతరం ధర్మారం మండలంలో కోటి 56 లక్షల ఎంతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కే ంద్రం భవనం పనులను పరిశీలించి పనులు 40 రోజులలో పూర్తి చేయాలని అన్నారు.ఈ పర్యట నలో జిల్లా కలెక్టర్ వెంట ధర్మారం ఎంపి డిఒప్రవీణ్ కుమార్, మండల పంచాయతీ అధి కారి రమేష్, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీ ర్‌రాజశేఖర్,సంబంధితఅధికారులు,పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు



**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ జిల్లా కేంద్రంలోని దీపికా ఆసుప త్రిలో జ్వ రంతో బాధపడుతూ చి కిత్స పొందుతున్న పేషెంట్‌పై లైంగిక దాడి చేసిన నిందితున్ని అరెస్టు చేసినట్లు పోలీ స్ కమిష నర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ మేరకు కమిషనరేట్‌లో విలేకర్ల సమావేశంలో ఘటనకు సంబం ధించిన వివరాలను మంగళవారం సిపివెల్లడించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఈ నెల 6న జ్వరంతో బాదపడుతున్న యువతి సదరు హస్పిటల్‌లో అడ్మిట్ కాగా, అదే ఆసుపత్రిలో కాంపౌండర్ (ఓటి టెక్నిషియ న్)గా పని చేస్తున్న పెద్ది దక్షిణ్ మూర్తి అలియాస్ దక్షిణా మూర్తి(23)బాధితురాలికి మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడని సిపి తెలిపారు. విషయాన్ని బాధితురాలు తండ్రికి చెప్పడంతో అతను త్రీ టౌన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కే సు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన త్రీటౌన్ పోలీసులు సాక్షులను,టెక్నికల్ ఆధారాలన్ని సేకరించి పరిశీలించిన అన ంతరంనిందితున్ని సోమవారం అరెస్టు చేసినట్లు సిపితెలిపారు. మహరాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరోంచ తాలుకాలక్ష్మి దేవి పేటకు చెందిన నిందితుడు ఇంటర్ వరకు చదువుకొని నా లుగు సంవత్సరాల క్రితం కరీంనగర్ వచ్చాడని, మొదట వా ర్డు బాయ్‌గా అర్కిడ్ హస్పిటల్‌లో పని చేసి తర్వాత హరిణి హ స్పిటల్ లో మేల్ నర్సుగా చేరాడని తెలిపారు. తరుచూ మద్యం సేవించి డ్యూటికి రావడంతో అక్కడ ఉద్యోగం నుంచి తొలగిం చారని, అనంతరం కొంతకాలం స్వగ్రామానికి వెళ్లి తిరిగి క రీంనగర్ వచ్చి ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో కాంపౌండర్ గా చేరా డని, నిందితుడు తరుచూ అశ్లీల వెబ్ సైట్లు చూస్తూ, మద్యం సేవిస్తూ విధులకు హాజరయ్యేవాడని సిపి పేర్కొన్నారు.

**ఆసుపత్రి నిర్లక్ష్యం ఉంటే చర్యలుంటాయి..**

హస్పిటల్ నిర్లక్ష్యం వహించినట్లు దర్యాప్తులో తేలితే సంబం ధిత అధికారులకు నివేదిక పంపి హస్పిటల్‌పై తగు చర్యలు తీసుకోనున్నటుసిపి తెలిపారు. జిల్లా కేంద్రం మెడికల్ హబ్‌గా ఉందని భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ఆసుపత్రుల్లో భద్రతపై పటిష్టమైన చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా సిపితెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో టౌన్ ఎసిపి వెంకటస్వామి, త్రీటౌన్ సిఐ జాన్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాలలో నిర్మాణంలో ఉన్న పనులు పూర్తి చేయాలి

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగి త్యాల రూరల్ మండలం కండ్లపల్లి, హనుమాజీపేట్, వెల్దుర్తి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల, అంగన్వాడి భవనం, గ్రామపంచాయతీ భవన నిర్మాణ పను లను, కండ్లపల్లి మోడల్ స్కూల్ లోని వ ంట గది నిర్మాణ పనులను మంగళవారం జగితా ్యల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదా రులు ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి అన్నారు. కండ్లపెల్లి గ్రామంలోని మోడల్ స్కూల్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీ ణ ఉపాధి హామీ పథకం (ఈజిఎస్) ద్వారా మ ంజూరైన అంగన్వాడీ కిచెన్ షెడ్ పనులను నాణ్య తగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంజనీ రింగ్ పంచాయతీ అధికారి లక్ష్మణరావు, జగి త్యాల ఆర్‌డిఒ మధుసూదన్, జగిత్యాల రూరల్ ఎంపిడిఒ రమాదేవి, ఎంపిఒ రవిబాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అరుణ్ కుమార్, కండ్లపెల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్య దర్శిలు, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజాప్ర తినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి కార్యాలయంపై బాధితులను ఉసిగొల్పారు

ఎఐటియుసి యూనియన్ వ్యతిరేకులపై మండిపడ్డ సీతారామయ్య




**ప్రజాపక్షం/పెద్దపల్లి :**సింగరేణి లో గుర్తింపు సంఘంఎఐటియుసి ని బద్నాం చెయ్యడానికే మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెం డెంట్ లను కొన్ని కార్మిక సంఘాలు, ఏఐటి యుసి యూనియన్ వ్యతిరేకులు ఉసిగొల్పి గోదా వరిఖని యూనియన్ ఆఫీస్ ముందు వారిచే ధర్నా చేయించి నా పై మరియు మా యూని యన్ పై నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేయడం గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్షులు వాసి రెడ్డి సీతారామయ్య తీవ్రంగా ఖండించారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెం డెంట్ లకు సింగరేణి లో ఉద్యోగాలు కల్పించే సమస్య ఈనాటిది కాదని, గత తొమ్మిది సంవత్స రాలుగా ఉందని, వీరికి ఉద్యోగాలు ఇవ్వాలని ఎఐటియుసి గత ప్రభుత్వ హయాంలో టిబిజికె ఎస్ గుర్తింపు లో ఉన్నప్పుడు డిమాండ్ చేయడం జరిగిందని, అప్పటి ముఖ్యమంత్రి కేసిఆర్ కూడా బహిరంగ సభలో మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్ లకు ఉద్యోగాలు కల్పిస్తా మని హామీ ఇచ్చినా అది నెరవేరలేదని, ఏఐటి యుసి గుర్తింపు సంఘంగా గెలిచిన తరువాత 2024 నవంబర్ 28 జరిగిన స్ట్రక్చర్ సమావేశం లో ఇట్టి సమస్యను పరిష్కరించాలని యాజమా న్యాన్ని అడగడం జరిగిందని ఆయన పేర్కొ న్నారు. యాజమాన్యం వారికి ఎట్లా ఉద్యోగాలు ఇస్తామని, ఒప్పుకునేది లేదని అంటే ఎఐటియుసి యాజమాన్యం వైఖరిని తప్పుపడుతూ వారికి న్యాయంగా ఉద్యోగాలు ఇవ్వాలని గట్టిగా పట్టు బడితే యాజమాన్యం ఇది లీగల్ సమస్య పరి ష్కారం కోసం దీనిని రాష్ట్ర ప్రభుత్వం లోని అడ్వ కేట్ జనరల్ కు పంపిస్తామని చెప్పి, పంపించి ఆరునెలలు గడిచిందని, ఇట్టి సమస్య యాజ మాన్యం పరిది లో లేదని రాష్ట్ర ప్రభుత్వం పరి ధిలో ఉందని, ఏఐటియుసి యూనియన్ ఎన్నో సార్లు సింగరేణి సమస్యల పై రాష్ట్ర ప్రభుత్వం తో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తున్నప్పటికీ, ముఖ్యమంత్రి బిజీ షెడ్యూల్ వల్ల అపాయిం ట్మెంట్ దొరకక ఆలస్యం జరుగుతుందని ఇందులో ఎఐటియుసి నిర్లక్ష్యం ఏం లేదని ఆయన అన్నారు. గుర్తింపు సంఘం గా ఏఐటి యుసి యాజమాన్యం పై ఒత్తిడి చేయడం జరుగు తుందని, లీగల్ డిపార్ట్మెంట్ పరిధిలో ఉన్నందున ఆలస్యం జరుగుతుందని, ఇది రాష్ట్ర ముఖ్య మంత్రి అడ్వకేట్ జనరల్ తో మాట్లాడితే ఇట్టి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన పేర్కొ న్నారు. గుర్తింపు సంఘం గా సింగరేణి లో కొత్త గనులు రావడం కోసం, లాభాల్లో వాటా ప్రకటిం చడం కోసం, మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మి కుల డిపెండెంట్ లకు ఉద్యోగ నియామకాల కోసం తదితర సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరిపేందుకు ప్రయత్నం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరి సమస్యను అడ్డం పెట్టు కొని కొన్ని కార్మిక సంఘాలు, ఎఐటియుసి యూనియన్ వ్యతిరేకులు ఎఐటియుసి ని బద్నాం చెయ్యడానికే వారితో మా ఆఫీస్ ముందు ధర్నాలు చెయడం దుర్మార్గమైన చర్య అని, తీవ్రంగా ఖండిస్తున్నామని, దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వం పై ఆందోళనలు చేయండి మా యూనియన్ పై బాధితులను ఉసిగొల్పడం కాదని ఆయన మండిపడ్డారు. ఎఐటియుసి ఆఫీ స్ ముందు ఆందోళన చేస్తున్న మారుపేర్లు, విజి లెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్ లతో సీతారా మయ్య వారితో మాట్లాడి సమస్య పరిష్కారం కో సం కృషి చేస్తామని చెప్పడం జరిగింది. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్య దర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, రాష్ట్ర సమితి నాయకులు గోసిక మోహన్, గౌతం గోవ ర్ధన్, ఎఐటియుసి నాయకులు అక్బర్ అలీ, బి. సుదర్శన్, దాసరి శ్రీనివాస్, బలుసు రవి, అజీం పాషా, బుర్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా వృద్ధి చెందాలి



జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలై జర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు పకడ్బం దీగా వ్యాపారం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండలం కేంద్రంలో తేజశ్రీ గ్రామ సమైక్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు & విత్తనాల దుకాణాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్,ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలి పారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నా మని, ఇందులో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని వివ రించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరు లను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగం, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు బాలికల జట్టు ఎంపిక

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని విద్యార్థినీలు 44వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన నిజామాబాద్ జిల్లా క్రీడాకారులకు సన్నద్ధత శిభిరం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 12వ తేది నుంచి 14వ తేది వరకు జనగామ జిల్లాలో జరిగే 44వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన బాలికల జట్టుకు మోర్తాడ్ జిల్లా పరిషత్ హై స్కూల్ బాలికల పాఠశాలలో సన్నదత శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. మోర్తాడ్ యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అరుగుల రమేష్, ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకోవడం జరిగింది. డాక్టర్ మురళి మోర్తాడ్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు అశోక్, నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

## చాకరిమెట్ల హుండీ ఆదాయం రూ.6.42లక్షలు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి దేవాలయం హుండీని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్స్పెక్టర్ రంగారావు, ఆలయ ఫౌండర్ చైర్మన్ భాస్కరరాయిని ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో మంగళవారం లెక్కింపు చేపట్టారు. గత 6నెలలకు సంబంధించిన హుండీని లెక్కించగా రూ.6లక్షల 42వేల 43రూపాయలు వచ్చాయని అధికారులు తెలిపారు. హుండీ ఆదాయాన్ని శివ్వంపేటలోని ఇండియన్ బ్యాంకులోని దేవాలయం ఖాతాలలో జమ చేస్తున్నట్లు ఇఒ శ్రీనివాస్ తెలిపారు. ఆలయ హుండీ లెక్కింపును శివకేశవ సేవా సమితి గ్రూపు సభ్యుల సంపూర్ణ సహకారాలతో చేపట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నగొట్టిముక్ల మాజీ ఎంపిటిసి నర్సింగరావు, సింగాయపల్లి నారాయణరావు, చంద్రయ్యరావు, డీలర్ పాపయ్యచారి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాళోజీ ఆశయాల స్ఫూర్తిగా సమాజాభివృద్ధికి కృషి : కలెక్టర్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తన రచనల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చిన ప్రజా కవి కాళోజీ నారాయణరావు ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళోజీ జయంతి వేడుకల్లో ఎస్పి కాంతిలాల్ సుభాష్, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాకవి కాళోజీ తన కవిత్వం, నవలల ద్వారా సామాజిక సమస్యలను స్పష్టంగా చూపించారు. ఆయన మాటలు ప్రజలను సంఘటితం చేశాయి. ఒక్క సిరా చుక్క లక్షల మంది మనసుల్లో కదలిక రాబడుతుందనే సత్యాన్ని ఆయన నిరూపించారు. మన తెలుగు భాషకు పట్టం కట్టిన మహాకవి కాళోజీ రచనలు తరతరాలకు స్ఫూర్తి అని అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతిని రాష్ట్ర భాషా దినోత్సవంగా ప్రకటించడం గర్వకారణమని, ఆయన ఆశయాల సాధనకు అందరం సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సజీవన్, రవాణా శాఖ అధికారి రామ్‌చందర్, సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణ, సహకార శాఖ అధికారి బిక్కు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ప్రజాకవి కాళోజి ఆశయాలు ఆచరణీయం

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** ప్రజా శ్రేయస్సు కోసం చేసిన త్యాగాల వల్లే మహనీయులుగా కీర్తించబడతారని, వారి మార్గాన్ని ఆచరించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిఎం కార్యాలయంలో నిర్వహించిన ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని మన నిత్య విధుల్లో నిజాయితీగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకుడు బయ్య మొగిలి, సిఎంఒఎఐ ఎస్వి టు జిఎం కె.రాజమల్లు, డిజిఎం (ఐఇడి) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ డిపార్ట్‌మెంట్ హెచ్ఒడి ఎం.శ్రీనివాస్, అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఫోటోగ్రఫీ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/మంచిర్యాల :** ఫోటోగ్రఫీ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత వినియోగించుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో మంచిర్యాల జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని ఓం కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ఒక సృజనాత్మక రంగమని, డిజిటల్ టెక్నాలజీలు, ఆధునిక పరికరాలు ఈ రంగాన్ని పూర్తిగా మార్చేశాయని అన్నారు. ఇలాంటి ఎక్స్‌పోలు కొత్త పరికరాలు, టెక్నాలజీలను ప్రజలకు చేరువ చేయడంలో దోహదపడతాయని, కెమెరాలు, లెన్సులు, డ్రోన్లు, ప్రింటింగ్ పరికరాలు, లైటింగ్ సిస్టమ్స్, ఫోటో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లు, స్టూడియో మోడల్స్ వంటి అత్యాధునిక పరికరాలు ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచబడతాయని, ఈ అవకాశాన్ని ఫోటోగ్రాఫర్లు, ప్రొఫెషనల్ స్టూడియోలు, ఆసక్తి గల యువత తప్పక వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు అప్పసు రామన్న, ప్రధాన కార్యదర్శి పోతరవేణి తిరుపతి, కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



**ప్రజాపక్షం/పెంచికలపేట :** పెంచికలపేట మండల కేంద్రంలోని కబరస్తాన్ సమీపంలో మంగళవారం ఉదయం చుక్కల దుప్పి కుక్కల దాడిలో మృతి చెందింది. స్థానికుల సమాచారం ప్రకారం, గాయాలతో కొట్టుమిట్టాడుతున్న దుప్పిని చూసి ఎఫ్ఆర్ఒ అనిల్ కుమార్‌కు సమాచారం అందించగా, ఆయన సిబ్బందితో కలిసి చేరుకుని చికిత్స అందించారు. అయితే అప్పటికే తీవ్ర రక్తస్రావంతో దుప్పి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మృతదేహాన్ని అటవీశాఖ కార్యాలయానికి తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. గ్రామస్థులు పేర్కొన్నదాని ప్రకారం.. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, అడవులు అంతరించిపోవడం, చెట్ల నరికివేత పెరగడం, అడవుల్లో నీటి వనరులు తగ్గిపోవడంతో అడవి జీవాలు ఆహారం కోసం గ్రామాల్లోకి వస్తున్నాయని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లోకి వచ్చే జంతువులు వేటగాళ్ల బారిన పడుతున్నాయని, కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్నాయని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

# యూరియా కోసం రైతన్నల పడిగాపులు

**ప్రజాపక్షం/హాజీపూర్ :** సాగు సీజన్ మధ్యలో యూరియా కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సహకార సంఘాల్లో సరిపడా బస్తాలు అందకపోవడంతో పంటలు ఎండిపోతాయనే ఆందోళనలో రైతులు రోడ్డు మీదకు దిగారు. రోజూ పనులు వదిలి గోడౌన్ల ముందు క్యూలలో నిలబడ్డా, చివరికి ఎరువు చేతికందక విసిగిపోయిన రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో ఆధార్ కార్డు చూపిస్తే ప్రతి ఒక్కరికి మూడు బస్తాలు ఇస్తామని సొసైటీ సభ్యులు చెప్పారని, కానీ పది రోజులుగా రేపు వస్తుంది అంటూ కాలం గడిపేస్తున్నారని, సాగు పనులు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు యూరియా అందకపోతే విత్తనాలు వృధా అవుతాయని, దిగుబడి దెబ్బతింటుందని, అప్పుల బారిన పడతామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణమామిడి, గొల్లపల్లి, టీకన్నపల్లి, దొనమండ, గుడిపేట్, నర్సింగాపూర్ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. రోడ్డుపై కూర్చొని నినాదాలు చేస్తూ ఎరువులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్, ఎఒ కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చించారు. మంగళవారం రాత్రికల్లా యూరియా వస్తుందని హామీ ఇచ్చి ధర్నాను సద్దుమణిగేలా చేశారు. వాగ్దానం చేసినట్టుగా యూరియా రాకపోతే మరింత తీవ్రంగా ఆందోళన చేస్తామని, ఎరువుల కొరత కొనసాగితే పంటలు నష్టపోయే అవకాశం ఉందని, దీనికి సహకార సంఘాల నిర్లక్ష్యమే కారణమని రైతులు ఆరోపించారు.





### రోడ్డుపై బైఠాయించి ఆందోళన

**కాగజ్‌నగర్ రూరల్ :** యూరియా కోసం నిత్యం రైతులకు కష్టాలు తప్పడం లేదు. యూరియా వస్తుందని రైతులకు సమాచారం తెలిస్తే చాలు యూరియా కోసం రైతులు అన్ని పనులు మానుకొని వర్షం కురుస్తున్నా సొసైటీల ముందు గంటలతరపడి పడిగాపులు కాస్తున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానాకాలం పంటకు అత్యవసరమై యూరియా ఎరువు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండల రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీకి యూరియా కోసం వచ్చారు. రైతులు కార్యాలయం తెరువకపోవడంతో ఆగ్రహించిన రైతులు మార్కెట్ కమిటి కార్యాలయం ముందు భట్టుపల్లి చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి రైతులు ధర్నా చేపట్టారు. దీంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో రాకపోకలకు కొంత సేపు ఇబ్బంది ఏర్పడింది. టోకెన్లు ఇచ్చి నెలలు గడుస్తున్న యూరియా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం మార్కెట్ కమిటి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని, పంటలు ఎండిపోతున్నాయని వెంటనే యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి రామకృష్ణను రైతులు యూరియా కోసం నిలదీశారు. రెండు రోజుల్లో రైతులకు సరిపడ యూరియా అందుబాటులో ఉంటుందని ఎఒ చెప్పగా రైతులు ఆందోళన విరమించారు. కాంగ్రెస్ నాయకులు పొన్న రమేష్, ముజీమిలుద్దీన్ రైతుల ఆందోళనకు మద్దతు పలికారు. రైతులకు తగినట్లుగా యూరియా పంపిణి చేయని కారణంగా, అధికారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఉద్దేశ్యంతో రైతులు ధర్నాలు చేస్తున్నారని వారు రోపించారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ డిఎస్‌పి వాహిదుద్దీన్ పోలీసు సిబ్బందితో అక్కడి వెళ్లి రైతులను సముదాయించి ధర్నాను విరమింపచేశారు.

**దహేగాం/పెంచికల్‌పేట :** రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు సిర్పూర్ మాజీ ఎంఎల్‌ఎ కోనేరు కోనప్ప అండగా నిలిచారు. దహేగాం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం వద్ద మంగళవారం యూరియా కోసం ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్లలో వేచి చూస్తున్న రైతులకు ఆయన ఆదేశాల మేరకు స్థానిక నాయకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా అన్నదాన వితరణలో మాజీ ఎంపిపి కంభాగౌని సులోచన, సంతోష్ గౌడ్, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కోనేరు కోనప్ప అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతులకు ఈ భోజన సదుపాయం తాత్కాలిక ఊరటనిచ్చింది. కష్టకాలంలో రైతుల కష్టాలను గుర్తించి భోజనం అందించినందుకు రైతులు మాజీ ఎంఎల్‌ఎ కోనప్పకు కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం లక్ష్యం

కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/ భీమారం/ నస్పూర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. మంగళవారం భీమారం మండలం కాజీపల్లి పాఠశాలను సందర్శించిన ఆయన, విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందిస్తోందని, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా శుద్ధమైన తాగునీరు, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా అందించాలి అని తెలిపారు. దాంపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, బిల్లుల చెల్లింపులు సులభతరం చేస్తున్నామని, గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి సాధారణ స్థితికి తీసుకురావాలని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో తరగతిలో పాఠాలు చెప్పి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సదుపాయాలు కల్పిస్తున్నామని, విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల్లో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కెజిబివిలో ఇంటర్మీడియట్ అదనపు గదుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని పరిశీలించిన ఆయన, పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలన్నారు. ప్రజల సౌకర్యార్థం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** రిమ్స్, సూపర్ స్పెషలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికుల అగస్టు నెల వేతనాలు వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రిమ్స్‌లో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎఫ్, ఇఎస్ఐలు జమ చేసి ఇఎస్ఐ కార్డులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అనుబంధం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి. ముజీబ్, యూనియన్ రిమ్స్ బ్రాంచ్ కార్యదర్శి ఎం.డి ఖాసీం, యూనియన్ జిల్లా నాయకులు ఎం.డి. ఇర్ఫాన్ ఖాన్, వెంకటేష్, పోలసాని, జక్కుల రాము, సరౌండింగ్ రాము తదితరులు ఉన్నారు.

## మంత్రి జూపల్లి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/నిర్మల్ :** జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ సమీపంలోని చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే స్టాళ్లు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, పలు పథకాల కింద ధ్రువీకరణ పత్రాల పంపిణీకి సంబంధించి,ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. అదేవిధంగా స్టాళ్లు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, పలు పథకాల కింద ధ్రువీకరణ పత్రాల పంపిణీకి సంబంధించి,ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశిత సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఒ రత్నకళ్యాణి, జెడ్పి సిఇఒ గోవింద్, డిఆర్డీఓ విజయలక్ష్మి ,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు రాజు, సంతోష్, తదితర అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, 10వ తరగతి విద్యార్థులను ఇప్పటి నుంచే వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధవహించాలని, మధ్యాహ్న భోజనంలో పౌష్టిక ఆహారం, శుద్ధి చేసిన తాగునీరు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. తరగతిలో విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఉదయ్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## యూరియా అందక తీవ్ర ఇబ్బందులు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని బాబాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ మాట్లాడారు. యూరియా అందక రైతులు హరిగోస పడుతుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం యూరియా కొరతకు కారణం కేంద్ర ప్రభుత్వమని కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయటం తగదని, రైతులకు సకాలంలో యూరియా అందించడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల గానీ, ప్రజల పట్ల గాని చిత్తశుద్ధి లేదని విమర్శించారు. నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులలో పౌరసరఫరాల శాఖ ద్వారా సరఫరా చేయబడుతున్న రేషన్ కార్డున్న ప్రతిఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం 5 కేజీలు, రాష్ట్ర ప్రభుత్వం ఒక కేజీ మాత్రమే బియ్యం ఇస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యాన్ని మేమే ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కలెక్టర్లకు స్పష్టంగా తెలిపారు. ప్రతి రేషన్ షాప్ వద్ద పిఎం మోదీ ఫోటోతో ఉండిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని మరోసారి మండల శాఖ తరపున రేషన్ డీలర్లకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఖచ్చితంగా తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో యోగేశ్వర నర్సయ్య, నాయకులు కిషన్, రామకృష్ణ, గంగాధర్, అశోక్, ప్రేమ్‌చంద హాకీం, వెంకటేష్, సంధ్యరాజ్, అంజయ్య, భూమన్న, గంగాధర్, అన్వేష్, రమేష్, మారుతి, రమేష్, ప్రవీన్, ప్రదీప్, రవి, అశోక్, గంగాధర్, కిషోర్ పాల్గొన్నారు.

## ప్రజల్లోకి అమరుల త్యాగాలు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** సెప్టెంబర్ 11 నుండి 17 వరకు గ్రామాల నుంచి పట్టణ మండల కేంద్రాల వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాస్ మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర, అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడానికి సెమినార్లు, సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. సెప్టెంబర్ 17న ముగింపు సభ హైదరాబాద్ రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరుగుతుందని, ఈ సభకు పార్టీ, ప్రజాసంఘాల శ్రేణులు జిల్లా వ్యాప్తంగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిందని రామడుగు లక్ష్మణ్ గుర్తుచేశారు. తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ప్రాణ త్యాగం, ఆంధ్ర మహాసభ పిలుపుతో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్‌లు గెరిల్లా దళాలను ఏర్పాటు చేసి మూడు వేల గ్రామాలను విముక్తి చేయడం, పది లక్షల ఎకరాలను పంచడం చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. ఈ పోరాటంలో సుమారు 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు వదిలారని వివరించారు. హైదరాబాద్ సంస్థానం విలీనం కావడానికి సాయుధ పోరాటమే మూల కారణమని, అయితే బిజెపి, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు ఈ పోరాటంలో ఎప్పుడూ పాల్గొనలేదని, అయినప్పటికీ ఇప్పుడు చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్న సమయంలో తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇదేవిధంగా అధికారికంగా నిర్వహించాలని, అమరవీరుల త్యాగాలను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కళిందర్ అలీ ఖాన్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, చాడ మహేందర్ రెడ్డి, కుంచాల శంకరయ్య, కాదండి సాంబయ్య, పూజారి రామన్న, ఎగుడ మొండి, నాయకులు నరసయ్య, రాయమల్లు పాల్గొన్నారు.

## ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం కింద లబ్ధిదారులను గుర్తించాలి

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అర్హులైన గిరిజన పోడు పట్టాదారులకు సాగునీరందించేందుకు ప్రభుత్వం ఇందిరా సౌర గిరిజల వికాసం పథకంతో చర్యలు చేపడుతున్న నేపథ్యంలో అర్హులైన వారిని లబ్ధిదారులుగా గుర్తించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన గిరిజల వికాసం పథకం అమలుపై జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ పథకం అమలు కోసం చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని 15 మండలాల్లో పోడు భూములలో పంటలు సాగు చేసుకుంటున్న 5009 మందికి 10172 ఎకరాలకు సంబంధించి ఆర్ఒఎఫ్ఆర్ కింద పట్టాలు అందించటం జరిగిందన్నారు. పంపిణీ చేసిన పోడు భూములలో సాగునీటి వసతి కల్పన కోసం సౌరగిరి జల వికాసం పథకం కింద దశల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేయటం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా తొలి దశ లబ్ధిదారుల ఎంపిక కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ పథకం పక్కాగా అమలు జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డిఎఫ్ఒ వికాస్‌మీనా, బోధన్, ఆర్మూర్ సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డిఆర్‌డిఒ సాయగౌడ్ అధికారులు పాల్గొన్నారు.



# క్రీడ

## టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్



ఆసియా కప్ 2025 టోర్నీలో భాగంగా హాంగ్ కాంగ్‌తో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ తెలిపాడు. ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నమోదు చేస్తామన్నాడు. 'మేం ముందుగా బ్యాటింగ్ చేయాలనుకుంటున్నాం. బ్యాటింగ్‌కు అనుకూలమైన వికెట్ ఇది. మంచి స్కోర్ బోర్డుపై ఉంచితే బౌలర్ల పని ఈజీ అవుతుంది. టీ20ల్లో టాస్ గెలిచామా? లేదా? అనేది ముఖ్యం కాదు. కానీ మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయడం చాలా కీలకం. అందుకు కావాల్సిన అవకాశాలను సృష్టించుకోవాలి. ముక్కోణపు సిరీస్ ఫైనల్ ముగిసిన కథ. తాజా మ్యాచ్‌పైనే మేం ఫోకస్ పెట్టాం. ఒకవేళ ఆ ఫైనల్ మ్యాచ్‌లో గెలిచినా కూడా ఈ రోజు మేం ఈ మ్యాచ్‌పై ఫోకస్ పెట్టేవాళ్లం. ఆ ఫైనల్ టీమ్‌లో ఒకే ఒక్క మార్పు చేశాం. డార్విష్ స్థానంలో గుల్బదిన్ రీఎంట్రీ ఇచ్చాడు. అని రషీద్ ఖాన్ పేర్కొన్నాడు. టాస్ గెలిచినా తాము బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని హాంగ్ కాంగ్ కెప్టెన్ మాసిమ్ ముర్తజా తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. టాస్ ఓడినా.. బౌలింగ్ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ టోర్నీ ఆడేందుకు మేం చాలా కష్టపడ్డాం. క్వాలిఫయర్స్‌లో మేం మంచి క్రికెట్ ఆడాం. మా ప్రధాన ఆటగాడైన కల్హన్ చల్లు ఈ వేదికపై ఎలా రాణిస్తాడో కెప్టెన్‌గా చూడాలని ఉంది.' అని హాంగ్ కాంగ్ కెప్టెన్ చెప్పుకొచ్చాడు.

**తుది జట్లు**

| అఫ్ఘానిస్థాన్ | హాంగ్ కాంగ్ |
|---|---|
| రహ్మానుల్లా గుర్బాజ్(కీపర్), సెదిఖుల్లా అటల్, ఇబ్రహీం జద్రాన్, గుల్బదిన్ నైబ్, అజ్మతుల్లా ఒమర్జాఈ, మహమ్మద్ నబీ, కరీమ్ జనత్, రషీద్ ఖాన్(కెప్టెన్), నూర్ అహ్మద్, ఏఎం ఘన్జాఫర్, ఫజల్హాక్ ఫారూఖీ. | జీషన్ అలీ(W), బాబర్ హయాత్, అన్షుమన్ రథ్, కల్హన్ చల్లు, నిజాకత్ ఖాన్, ఐజాజ్ ఖాన్, కించిత్ షా, యాసిమ్ ముర్తజా(C), ఆయుష్ శుక్లా, అతీక్ ఇక్బాల్, ఎహ్సాన్ ఖాన్. |

## ఫిబ్రవరిలో పొట్టి ప్రపంచకప్..

### అహ్మదాబాద్‌లో ఫైనల్..!




వచ్చే ఏడాది జరుగబోయే పొట్టి వరల్డ్ కప్‌కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి త్వరలోనే ఈ మెగా టోర్నీ షెడ్యూల్ ఖరారు చేయనుంది. అయితే.. ఫిబ్రవరిలో వరల్డ్ కప్ ప్రారంభం అవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఫైనల్ మ్యాచ్‌ను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహిస్తారని టాక్. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే శ్రీలంకలోని కొలంబోలో టైటిల్ ఫైట్ ఉండనుంది. వచ్చే ఏడాది ఆరంభంలోనే అభిమానులు క్రీడా వినోదంలో మునిగితేలనున్నారు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకూ వరల్డ్ కప్ జరుగనుంది. గత ఎడిషన్ మాదిరిగానే టోర్నీలో పాల్గొనే 20 జట్లను 'నాలుగు' గ్రూప్‌లుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ 8కు వెళ్తాయి. వీటిని నాలుగు చొప్పున రెండేసి గ్రూప్‌లుగా చేస్తారు. ఈ దశలో ఒక్కో గ్రూప్ నుంచి టాప్‌లో ఉన్న రెండు జట్లు సెమీస్‌కు దూసుకెళ్తాయి. మనదేశంలోని ఐదు స్టేడియాల్లో, శ్రీలంకలోని రెండు మైదానాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అహ్మదాబాద్‌లో లేదా కొలంబోలో ఫైనల్ నిర్వహిస్తారని సమాచారం. ఒకవేళ పాకిస్థాన్ టైటిల్ పోరుకు అర్హత సాధిస్తే కొలంబోనే వేదికగా ఎంపికవుతుంది. భారత్ 2016, శ్రీలంక 2012లో చివరిసారిగా టీ20 ప్రపంచ కప్ పోటీలకు వేదికయ్యాయి. ప్రస్తుతానికి 15 జట్లు మాత్రమే వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీమిండియా అడుపెట్టనుండగా.. శ్రీలంక, అఫ్గనిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, యుఎస్ఎ, వెస్టిండీస్, న్యూజిలాండ్ పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, నెదర్లాండ్స్, ఇటలీ మాత్రమే క్వాలిఫై అయ్యాయి. ఆఫ్రికా క్వాలిఫయర్, ఆసియా – ఈస్ట్, ఆసియా ఫసిఫిక్ క్వాలిఫయర్ ఫలితాల ఆధారంగా మిగిలిన ఐదు స్థానాలు భర్తీ అవుతాయి.

## ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌కు షాకిచ్చిన అభిమన్యు మిశ్రా



ఫిడె గ్రాండ్ స్విస్ 2025లో భారత చెస్ స్టార్, ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌కు అమెరికా గ్రాండ్ మాస్టర్‌ను అభిమన్యు మిశ్రా ఓడించాడు. 16 ఏళ్ల వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి చరిత్ర సృష్టించాడు. మిశ్రా 61 ఎత్తుగడలతో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. కానీ తన ప్రదర్శనతో అతడు సంతృప్తి చెందలేదు! నేను గెలిచినప్పటికీ, ఈ టోర్నమెంట్ మునుపటి గేమ్స్ అంత ఆహ్లాదకరంగా అనిపించలేదు. కానీ టోర్నమెంట్ నేను ఊహించిన దానికంటే బాగా జరుగుతోంది. నేను ఇదే ఫామ్ను కొనసాగిస్తే, టోర్నమెంట్‌ను కూడా గెలిచే అవకాశం ఉంది. నిన్న కూడా నేను ప్రాగ్‌పై కొన్ని తప్పులు చేశాను. కానీ నేను ఈ ఆటగాళ్ల కంటే (గుకేశ్, ప్రాగ్) తక్కువ అని నాకు ఎప్పుడూ అనిపించ లేదు. నేను వారితో సమంగా ఉన్నా అని భావిస్తున్నా..' అని మిశ్రా తన విజయం అనంతరం అన్నాడు. అలాగే ఆర్.ప్రజ్ఞానందకు జర్మనీకి చెందిన మథియాస్ బ్లూబామ్ వల్ల షాక్ తగిలింది. అతడు 55 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై విజయం సాధించాడు.

# ఫోకస్

## ఎటు పోతున్నాం?

# మహిళ



ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో, అత్యాచారానికి గురైన 14 ఏళ్ల బాలిక ఒక శిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటన ప్రస్తుతం మన దేశంలో అమ్మాయిల పరిస్థితికి అద్దం పడుతుంది. గతం చాలా ఘనమని చెప్పుకొంటున్న మనం ఎటు పోతున్నామనే ప్రశ్న తలెత్తుతున్నది. ఆ బాలికపై జరిగిన అత్యాచారం, ఆమె బిడ్డను ఇటీవలనే జన్మించడం మన సమాజంలో అనేక లోపాలు ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ఇది ఒక దయనీయమైన ఘటన అయినప్పటికీ, ఇది భారతదేశంలో మహిళల భద్రత విషయంలోని తీవ్రమైన సమస్యలను మన ముందుకు తెస్తున్నది. గణాంకాలను పరిశీలిస్తే, మన దేశంలో ప్రతి రోజు సగటున గంటకు సుమారు 3.7 ఆరోపణలు మహిళలపై అత్యాచార ఘటనలు నమోదవుతున్నాయి. పరిస్థితి మారకపోతే, ప్రతి ఎనిమిది మందిలో ఒక బాలిక ఇలాంటి లైంగిక వేధింపులకు, అత్యాచారానికి గురవుతుందని మహిళా ఉద్యమకారులు హెచ్చరిస్తున్నారు. గణాంకాలు కూడా దాదాపు ఇదే అభిప్రయాన్ని వెల్లడిస్తున్నాయి. దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నదని పాలకులు ప్రకటించడమే తప్ప, మహిళల భద్రత విషయంలో దేశం ఇంకా దశాబ్దాలు వెనుకబడి ఉందనేది వాస్తవం. మహిళలపై ఉండే వివక్ష, కుటుంబ సభ్యుల అనధికార ప్రవర్తనలు, సమాజం లోని నిర్లక్ష్యం వంటి కారణాలతో దారుణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. యుపిలో జరిగిన ఘటన విషయానికి వస్తే, బాధితురాలికి ఏ విధమైన న్యాయం జరుగుతుందనేది ప్రశ్న. తల్లిగా మారుతున్న ఆమె బాల్యం ఎప్పటికీ తిరిగి రాదు. అత్యాచారం కారణంగా ఆమె ఎదుర్కొన్న మానసిక, శారీరక బాధ ఇప్పట్లో తీరేది కాదు. దోషుల పట్ల ఉదాసీనత... వారికి కఠిన శిక్షలు విధించడంలో చట్టపరంగా ఉన్న లొసుగులు... కోర్టుల్లో పేరుకుపోతున్న కేసులు.. అంతులేని ఉదాసీనత బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు కారణమవుతున్నాయి. ప్రభుత్వాలు, వ్యవస్థలు ఇంకా మేలుకోకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారడం ఖాయం. సభ్యసమాజాన్ని సిగ్గుతో తలవంచుకునేలే చేస్తున్న ఇలాంటి ఘటను పునరావృతం కాకుండా జాగ్రత్తలు అవసరం. మహిళల భద్రత కోసం ప్రభుత్వ స్థాయిలో, సమాజ స్థాయిలో చట్టాను కఠినంగా అమలు చేయడం, బాధితులకు సత్వర న్యాయం అందేలా న్యాయవ్యవస్థ స్పందించడం అత్యవసరం. స్త్రీల విద్య, ఆర్థిక సాధికారత పెంపొందించడం, చట్టాలను మరింత ఖచ్చితంగా అమలు చేయడం ముఖ్యం. మన కుటుంబాలు, విద్యా సంస్థలు, సమాజం మొత్తం మహిళలపై జరిగే ఇలాంటి దాడులను నిరోధించేందుకు ముందుకొస్తేనే ఇలాంటి దారుణాలకు కొంతైనా అడ్డుకట్ట పడుతుంది.



## ఒక శిల్పం.. అంతులేని భావం..



ఈ శిల్పంపై ఎంతైనా చెప్పచ్చు. ఎన్ని కవితలైనా అల్లవచ్చు. ఎన్ని పుస్తకాలైనా రాయవచ్చు. ఒక సాధారణ గృహిణి, ప్రత్యేకించి ఒక అమ్మను గురించి ఇంత కంటే గొప్పగా ఎవరూ వర్ణించలేరేమో! స్పెయిన్‌లోని బార్సిలోనా నగరం, కారెర్ డె లా ప్రిన్సెసా సమీపంలో, వియా లైయెటనా కూడలి వద్ద ఈ విగ్రహం ఉంది. దీని పేరు 'ఎల్ ఎఫూర్జియో' (ది ఎఫర్ట్ లేదా ప్రయత్నం అని అర్థం). దీనిని 'లా కార్గా' (ది బర్డెన్ లేదా భారం అని అర్థం). ఒక తల్లి తన పిల్లలతోపాటు, వాషింగ్ మెషిన్, గిన్నెలు, వంటింటి సామాన్ల భారాన్ని మోస్తున్న ఈ తల్లి బొమ్మను ప్రముఖ శిల్పి జౌమీ ప్లెన్సా అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఇది తల్లులు జీవన యాత్రలో ఎదుర్కొనే అసలైన బాధ్యతలు, కృషిని ప్రతిబింబించే శిల్పం. వారి కష్టాలను కళ్లకు కడుతుంది. అంత కష్టపడుతున్నా, పిల్లలను జాగ్రత్త చూసుకోవడం తల్లి హృదయానికి అద్దం పడుతుంది. ఆమెది ఒంటరి నడక... ఉన్నతమైన ఆశయం... అనంతమైన ఆత్మస్థైర్యం.

## సమాన హక్కులే నిజమైన వికాసం

మహిళా వికాసం అనే మాట నిత్యం వినిపిస్తునే ఉంటుంది. అయితే, వికాసం అనేది ఏమిటనేదే ప్రశ్న. నిజానికి, స్త్రీల సమాజంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ, శైక్షణ, సాంస్కృతిక రంగాల్లో సాధించే అభివృద్ధి, సాధికారత, సమాన హక్కులు పొందే ప్రక్రియను మాత్రమే వికాసంగా పేర్కోవాలి. ఇది స్త్రీల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు వారి ప్రాధాన్యతను, సామర్థ్యాలను పెంపొందించి సమాజాన్ని సాధారణంగా అభివృద్ధి పథంలో నెట్టే కీలకమైన దశ. ఏ సమాజం లేదా దేశంలో స్త్రీలకు సమున్నత స్థానం కల్పిస్తే ఆ సమాజం పూర్ణ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తుందనేది వాస్తవం. శ్రామిక రంగంలో, మహిళల ఉత్పాదక శక్తిని వినియోగించుకోగలిగితేనే ఆ దేశం సమగ్ర అభివృద్ధిని సాధిస్తుంది. స్త్రీలకు ఆర్థిక స్వతంత్ర్యం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా సాధికారత ఉంటే సమాజం ఆరోగ్యంగా, సుస్థిరంగా అభివృద్ధి చెందుతుంది. మహిళల అభివృద్ధికి విద్య మూలాధారం. ప్రధానంగా గ్రామీణ, దారిద్ర ప్రాంతాలలో, ఆది వాసి ప్రాంతాలలో మహిళల విద్యాభివృద్ధి జరగడం ద్వారా వారి సామాజిక స్థానం మెరుగుపడుతుంది. ఆర్థికవికాసం కూడా నేటి మహిళలకు అత్యవసరంగా మారింది. మహిళలకు రుణాలు అందించడం, బ్యాంకుల సహకారం వలన మహిళలు స్వయం ఉపాధి, స్వయం సహాయం సంఘాల ద్వారా ఆర్థికస్వాతంత్ర్యం సాధిస్తున్నారు. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక వ్యవస్థను బలపరిచింది. మహిళలు తమ వ్యాపారాలు నడుపుతూ కుటుంబ, సమాజ పరిపూర్ణ వికాసానికి దోహదపడుతున్నారు.

## 11 నుండి రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబాద్ జిల్లా కార్యవర్గ,మండల కార్యదర్శుల సమావేశం వారి పెల్లి వెంకన్న అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడారు. ఈ నెల 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జిల్లా నలుమూలల జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సాయుధ పోరాటంలో పాల్గొన్న వారసుల సన్మానించుకుని, స్థూపాల వద్ద ఘనంగా నివాళులర్పించాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి బిజెపికి సంబంధం లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజంగా పోరాడింది కమ్యూనిస్టులే అన్నారు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అసువులు బాసిన సాయుధ పోరాట వీరుల స్థూపాల వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబాలను సత్కరించి జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధిరెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి , కట్టెబోయిన, శ్రీనివాస్ నాయకులు వరి పెల్లి వెంకన్న, పెరుగు కుమార్, రేష పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబ లక్ష్మి , కట్లోజు పాండురంగ చారి, నెల్లూరి నాగేశ్వరరావు, తండ సందీప్, చొప్పరి శేఖర్, బైసా స్వామి, బందు మహేందర్, సారిక శ్రీను ,జంపాల వెంకన్న, మారగాని బాలకృష్ణ, తురక రమేష్ పాల్గొన్నారు

**మంచిర్యాలలో..**



**ప్రజాపక్షం/మంచిర్యాల :** ఈ నెల 11 నుండి 17 వరకు గ్రామాల నుంచి పట్టణ మండల కేంద్రాల వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాస్ మాట్లాడారు. సెప్టెంబర్ 17 ముగింపు సభ హైదరాబాద్ రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరుగుతుందని, ఈ సభకు పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు జిల్లావ్యాప్తంగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిందని రామడుగు లక్ష్మణ్ గుర్తుచేశారు. తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ప్రాణ త్యాగం, ఆంధ్ర మహాసభ పిలుపుతో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్‌లు గెరిల్లా దళాలను ఏర్పాటు చేసి మూడు వేల గ్రామాలను విముక్తి చేయడం, పది లక్షల ఎకరాలను పంచడం చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. ఈ పోరాటంలో సుమారు 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు వదిలారని వివరించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కళిందర్ అలీ ఖాన్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, చాడ మహేందర్ రెడ్డి, కుంచాల శంకరయ్య, కాదండి సాంబయ్య, పూజారి రామన్న, ఎగుడ మొండి, నాయకులు నరసయ్య, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా అడిగితే అరెస్టులు చేస్తారా?

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్
### కేంద్రమంత్రి కార్యాలయ ముట్టడికి యత్నం




**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి యూరియా తెప్పించాలని కోరితే అరెస్టులు చేస్తారా.. అని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. కేంద్ర మంత్రి కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న సీపీఐ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు సీపీఐ నేతలకు మధ్య తోపులాట జరిగి స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.అనంతరం సీపీఐ నేతలను పోలీసులు అరెస్టు చేసి తరలించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని,వేసినపంటలు అదును దాటిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు రైతుల బాధలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని, రైతుల సమస్యను పరిష్కరించే చిత్తశుద్ధి వారికి ఉన్నట్లు కనబడుట లేదన్నారు. కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు ఉన్న బీహార్ రాష్ట్రంలోయూరియా కొరత లేకుండా అత్యధికంగా సరఫరా చేసిందని,ఇతరరాష్ట్రాలపట్ల వివక్ష చూపిస్తుందన్నారు. రాజకీయాలకు, ఎన్నికలకు సంబం ధం లేకుండా కేంద్రం వ్యవహరించాలని, రైతుల కన్నీళ్లతో ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి గెలిచి కేంద్ర ప్రభుత్వంలో మం త్రిగా ఉన్న బండి సంజయ్ ఇక్కడి రైతుల సమస్యను ప్రధాని మోడీతో మాట్లాడి రాష్ట్రానికి సరిపడా యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని రైతులు యూరియా కోసం రాత్రుళ్లు క్యూ లైన్లలో నిల్చొని ఇబ్బందులు పడుతుంటే కేంద్ర మంత్రి కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. రైతుల పట్ల కేంద్ర మంత్రుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.సమస్యనుంచి తప్పించుకోవడం కాకుండా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి , తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, బామండ్ల పల్లి యుగేందర్, బీర్ల పద్మ, కొట్టే అంజలి, రామారపు వెంకటేష్, రైతు సంఘం జిల్లా నాయకులు గోలి బాపురెడ్డి, కోమటి రెడ్డి జయపాల్ రెడ్డి, నాయకులు కేశబోయిన రాము, మామిడిపల్లి హేమంత్ కుమార్, మల్లేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



### పలువురు నాయకుల ముందస్తు అరెస్టు

జిల్లాలోయూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ తలపెట్టిన నిరసన కార్యక్రమం సందర్భంగా కరీంనగర్‌తో పాటు జిల్లాలోని వివిధ మండలాల్లో పలువురు సీపీఐ నాయకులను పోలీసులు మంగళవారం తెల్లవారుజామునే ముందస్తు అరెస్టు చేశారు. కరీంనగర్ లో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, పైడిపల్లి రాజును, చిగురుమామిడిలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందే స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డిని, తిమ్మాపూర్ లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యు లు పొనగంటి కేదారి, మానకొండూర్‌లో మండల కార్యదర్శి బండ రాజిరెడ్డి, మండల నాయకులు ఎర్రబోయిన సదయ్య, నాంపల్లి కొంరయ్య, రామడుగు మండలంలో మండల కార్యదర్శి ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గొడిశెల తిరుపతి గౌడ్, కనకయ్య, మల్లేశంలను అక్రమంగా అరెస్టు చేశారు.

## ప్రజలకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

### బికెయంయు జిల్లా కార్యదర్శి అంజయ్య



**ప్రజాపక్షం/షాబాద్(రంగారెడ్డి):** ప్రజలకు ఇచ్చిన హమీలను వెంటనే అమలు చేయాలని బికేయంయు జిల్లా కార్యదర్శిఅంజయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల ఆర్డీవో కార్యలయం ముందు బికేయం రాష్ట్ర కమిటి పిలుపు మెరకు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండ పార్టీ కార్యకర్తలకు పైరవికారులకు మంజూరు అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు, పింఛన్లు రూ.4 వేలు, 6వేలు అస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి అమలు చేయడం లేదన్నారు. నాయకులు స్వరుప, పెంటయ్య, చంద్రమౌళి, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

## సాయుధపోరాట వారోత్సవాలు అధికారికంగా నిర్వహించాలి

### సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాలను రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్‌చేశారు. ఈ నెల 11నుంచి 17వరకు జరిగే తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 11న మన్ననూరులో సైమన్‌రాములు స్థూపందగ్గర నుండి సాయుధపోరాటాలు ప్రారంభమవుతాయన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లక్ష్మణచారిభవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ జిల్లా కౌన్సిల్‌సభ్యులు మర్యాదవెంకటయ్య, ఎఐటియూసి నాగర్‌కర్నూల్ జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, సిపిఐజిల్లా కౌన్సిల్ సభ్యులు తుమ్మల శివుడు, ఎఐవైఎఫ్ జిల్లావైస్‌ప్రెసిడెంట్ ఎండి యూసుఫ్ పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోరాట ఫలితంగా పెరిగిన పరిహారాలు



**ప్రజాపక్షం/ములుగు:** ఎఐటియుసి పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మిక సంఘంలో పరిహారాలు పెరిగాయని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా కమిటీ సమావేశం ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జిల్లా అధ్యక్షులు పోలం కొండయ్య అధ్యక్షతన జరిగింది.ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా 2009లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాంటి సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదయినకార్మికులకు సంబంధించిన వివాహాలకు, ప్రసూతికి రూ.30వేల చొప్పున, నార్మల్ డెత్‌కు రూ.1లక్ష 30వేలు, ప్రమాద మరణానికి రూ.6, 30,000ల చొప్పున అందిస్తున్నారు. అది కూడా అనేక పోరాటాల ఫలితంగా వస్తున్నాయన్నారు. కార్మికుడు చనిపోతే ప్రస్తుతం చెల్లిస్తున్న సరిపోయే పరిస్థితులు లేనందున పరిహారాలు పెంచాలని ఏఐటియూసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అనేక రకాలుగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహించిన ఫలితంగా సహజ మరణానికి రూ.2లక్షల 30వేలు, ప్రమాద మరణానికి రూ.10లక్షల 30వేలకు పెంచడం జరిగిందని, అందుకు ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేందర్, కోశాధికారి సామల దేవేందర్, సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, సీనియర్ నాయకులు ఇంజం కొమురయ్య, బుర్రి క్రాంతి, ఇండ్ల లక్ష్మి నారాయణ, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుడిమె సదయ్య, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## సాగునీటి వనరులు పెంచడమే లక్ష్యం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** గ్రామాలలో చెరువుల పునరుద్ధరణ చేపట్టి సాగునీటి వనరులు పెంచడమే లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తొర్రూరు జె గ్రామంలో చెరువు పూడిక తీత పనులు చేపట్టి చెరువు మత్తడి పోయడంతో ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులు బలపడితేనే గ్రామాల వ్యవసాయం, పశుపోషణలు చక్కగా సాగుతాయన్నారు. చెరువులో నీరు నిల్వ కావడంతో ఈ నీటితో సాగు సౌకర్యం కలుగుతుందని, పశువులకు తాగు నీరు లభిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావుడ్య మంజుల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు మైసిరెడ్డి, బాలరాజు, నాగయ్య, సంపత్, శ్రీనివాస్, ప్రభాకర్, కార్తీక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/టేకుమట్ల:** భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అంకుషాపూర్ గ్రామం నుండి సుబ్బక్కపల్లి వరకు రూ. 10లక్షలలో రోడ్డు నిర్మణం, రామకృష్టపూర్ (టి) ఆర్ అండ్ బి రోడ్డు నుండి అంకుషాపూర్ గ్రామం వరకు రూ.10 లక్షలతో రోడ్డు, రామకృష్టపూర్ (టి) గ్రామం నుండి రైతుల కోసం వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే రోడ్డుకు రూ.1 కోటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి వెలిశాల గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మంచిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని ప్రజా ప్రతినిధుల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో సిఎం నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఎంపిడిఒ అనిత, డిఇ రవికుమార్, ఎఇ మానస,మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, మాజీ జెడ్‌పిటిసి పులి తిరుపతి రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగంపెల్లి కిరణ్‌రావు, ఓరం సమ్మయ్య, కత్తి సంపత్, దాసారపు సదానందం, దొంతుల శ్రీనివాస్, శాస్త్రాల కిరణ్, దావరవేని నారయణరావు, బండి రవి, ఎండి ఖంరోద్దీన్, బొడ్డు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేంతవరకూ పోరాటాలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**గత బిఆర్ఎస్. ప్రభుత్వం ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసుల విషయంలో కోర్టుకు హాజరైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీ,. దస్రు నాయక్, కేదాసు రమే,. రాములు నాయక్, మేక వీరన్న మాట్లాడుతూ బయ్యారంలో ఉగ్గు పరిశ్రమ ఏర్పాటు చేయాలని పోరాడినందుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా కోర్టుల చుట్టూ తిరగడానికి కారణమైంది బి ఆర్ ఎస్. ప్రభుత్వం అన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట ప్రకారం. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయవలసింది అని పోరాడితే గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సిగ్గుమాలిన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కై ఆలోచించకపోతే రానున్నటువంటి రోజుల్లో బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేంతవరకు ప్రజలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

## స్ఫూర్తి ప్రదాత కాళోజీ

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**సాహిత్యం ద్వారా సమాజ మార్పుకు కృషి చేసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావును స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కాళోజీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ రచనలు ప్రజల్లో చైతన్యం నింపాయని, ఆయన జీవితం అందరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. తన కవిత్వం ద్వారా స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించి, తెలంగాణ ప్రజలను జాగృతం చేసిన మహాకవి కాళోజి నారాయణరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. తెలంగాణా భాషా దినోత్సవంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9న నిర్వహించడం ద్వారా కాళోజి సాహిత్య సేవలను స్మరించుకోవడం గర్వకారణమని, కాళోజి కవిత్వంలో మన భాష, మన భూమి, మన సం స్కృతి ప్రతిబింబించాయని పేర్కొన్నారు. కాళోజి చూపిన మార్గంలో సాగితే మన భాష, మన సంస్కృతి మరింత వెలుగొందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు మరింత మెరుగుపడాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగుపరిచే విధంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ లష్కర్ బజార్ లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య, సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఐదు, ఆరు, ఏడు తరగతులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు తెలుగు ఆంగ్లం గణిత పాఠ్యాంశాలను విద్యార్థులతో కలెక్టర్ చదివించారు. ఈ నెలలో నిర్వహించనున్న మిడ్లైన్ టెస్ట్ కు ఏవిధంగా సన్నద్ధమవుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ ను పరిశీలించి భోజనం ఎలా ఉంటుంది, మెనూ ప్రకారం అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. హాస్టల్లో సదుపాయాలు బాగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, హనుమకొండ ఎంఈవో నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరపై సిఎం ప్రత్యేక దృష్టి

మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/ములుగు:**వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను పురస్కరించుకొని భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, మేడారంలో జరగనున్న పనులను పరిశీలించడానికి వారం లోగా ముఖ్యమంత్రి మేడారాన్ని పర్యటిస్తారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం జిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి డాక్టర్ శబరీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచంద్రలతో కలిసి ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న విఐపి పార్కింగ్ రోడ్డు, పోలీస్ కంట్రోల్ రూమ్, హరిత హోటల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మేడారంలోని ఐటిడిఎ సమావేశపు హాల్‌లో అమ్మవార్ల పూజారులు, అన్ని శాఖల అధికారులతో మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర 2026పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తుల సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.150 కోట్ల రూపాయలను కేటాయించిందని, కేటాయించిన నిధులతో ఆయా శాఖల అధికారులు 100 రోజుల నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గద్దెల ప్రాంతంలో పూజారుల మనోభావాలు దెబ్బ తినకుండా వారి సూచనలు మేరకు నూతన హంగులతో శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేయాలని, మేడారం గ్రామస్తులు పూజార్ల అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట పండగనే కాకుండా మరో కుంభమేళా తరహాలో జరగనున్న జాతరకు సామాన్య



పౌరుని నుండి రాష్ట్రపతి, ప్రధానమంత్రి లాంటి ముఖ్యులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వివిఐపిలకు ఇబ్బందులు రాకుండా విమానాలు సైతం దిగే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈసారి చేపట్టనున్న పనులు శాశ్వతంగా ఉండే విధంగా పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. దేవుళ్ల కలిగిన ప్రాంతంలో రాజకీయాలు చేసే ఏ రాజకీయ నాయకుడు ఎదగలేదని, రానున్న మహాజాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకొని సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. భక్తులకు అమ్మవార్లపై భక్తి విశ్వాసం పెంపొందించేలా జాతర ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ స్థపతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఈ శివ నాగిరెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, ఇఒ వీరస్వామి, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రోడ్డు నిర్మాణ పనులకు అత్యధిక ప్రాధాన్యత

**ప్రజాపక్షం/ములుగు:** గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లా మండల కేంద్రాలలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 163 నుండి మదనపల్లి క్రాస్ రోడ్డు వరకు నాలుగు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రోడ్డు వెడల్పు, డివైడర్, సెంటర్ లైటింగంవ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేయడమే కాకుండా ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని వివరించారు. ఇప్పటికే జిల్లా కేంద్రం



నుండి పలు గ్రామాలకు వెళ్లే రహదారులను విస్తరించి పనులను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. బతుకమ్మ పండగ వరకు రోడ్డు పనులను, నాణ్యత లోపించకుండా పూర్తి చేయానలి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దాస్యం రామ్మూర్తి సేవలు మరువలేనివి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :**అమరజీవి ప్రజానేత మాజీ వార్డు కౌన్సిలర్, సిపిఐ పట్టణ నేత దాస్యం రామ్మూర్తి రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ రామ్మూర్తి సేవలు మరువలేనివి అన్నారు వార్డు కౌన్సిలర్‌గా వార్డు ప్రజల మన్నల ను గెలుచుకున్నాడు అన్నారు. ఆపదలలో ఉన్న వారిని ఆదుకునే తత్వం అని కొనియాడారు. ప్రతి ఒక్కరికి స్నేహితుడిగా కష్టసుఖాల్లో పాలుపంచుకునే వాడు అన్నారు. రామ్మూర్తి నీ కోల్పోవడం పట్టణ పార్టీకి తీరని లోటని, దాస్యం రామ్మూర్తి ఆశయాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన లేని లోటు పూడ్చ లేనిది అన్నారు. ఈ కార్యక్ర



మంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారథి రెడ్డి నల్లు సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , కట్లోజు పాండురంగ చారి, వరిపల్లి వెంకన్న, నెల్లూరు నాగేశ్వరరావు, కరణం రాజన్న, తండ సందీప్, చొప్పరి శేఖర్, బైస స్వామి, సారిక, జంపాల శ్రీను, మారగాని బాలకృష్ణ, బందు మహేందర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిఎంలో క్యాన్సర్ కేర్ సెంటర్ ప్రారంభం

మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/ వరంగల్ :** వరంగల్ పట్టణంలోని ఎంజిఎం హాస్పటల్ 10 పడకల సామార్థ్యంతో ఏర్పాటైన జిల్లా క్యాన్సర్‌కేర్ సెంటర్‌ను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం మర్చువల్ విధానంలో ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు క్యాన్సర్ చికిత్సను సమీప ప్రాంతంలోనే అందించాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందని, వివిధ జిల్లాలకు చెందిన రోగులు ప్రాథమిక స్థాయి క్యాన్సర్ నిర్ధారణ అనంతరం, కిమో థెరిఫీ సేవలను హైదరాబాద్ వంటి దూరా ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే సేవలు అందించడం జరుగుతుందన్నారు. దీంతో ప్రయాణ ఖర్చుల భారం, కుటుంబ సభ్యులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఆధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య బృంధం, శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. రాబోయే రోజుల్లో ఈసెంటర్‌ను విస్తరించి మరిన్ని పడకల సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి , ఎంజిఎం సూపరింటెండెంట్ మురళీ, ఆస్పత్రి ఆర్ఎంఓ అశ్విని కుమార్, అంకాలజి ప్రొఫెసర్, విభాగాధిపతి సంజీవ కుమారి, సర్జికల్ అంకాలజీ నిపుణులు డాక్టర్ వినోద్ కుమార్, వైద్యసిబ్బంది, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఉత్తమ ఐటిఐ ప్రిన్సిపాల్‌గా పెచ్చెట్టి

మంత్రి చేతుల మీదుగా రాజధానిలో అవార్డు ప్రదానం




**ప్రజాపక్షం/కాజీపేట :** కృషి.. పట్టుదలకు మారుపేరు పెచ్చెట్టి వెంకటేశ్వర్ రావు...దీనికి తోడు క్రమశిక్షణ, వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉన్న ఆయన కాజీపేట ప్రిన్సిపాల్ గా ఎందరో విద్యార్థులను పారిశ్రామిక రంగంలో తీర్చిదిద్దారు. తాజాగా ఆయన మూడు దశాబ్దాలకు పైగా అందించిన సేవలకు గుర్తింపుగా మంగళవారం రాజధానిలో తెలంగాణా ప్రభుత్వ పురస్కారం లభించింది.ఈ మేరకు రాష్ట్ర పారిశ్రామిక, ఉపాధి కల్పనల శాఖా మంత్రి వినోద్ నేతృత్వంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఐటీఐ ప్రిన్సిపాల్ గా పెచ్చెట్టి వెంకటేశ్వర్ రావు తెలంగాణ ప్రభుత్వ అవార్డు ను మంగళవారం అందుకున్నారు. ఏడాది కాలం గా కాజీపేట ఐటీఐ / అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ హోదాలో ఆయన నూటికి నూరు శాతం అడ్మిషన్స్ తీసుకోవడం... పాస్ అయిన విద్యార్థులకు 60 శాతం ప్లేస్మెంట్స్ ఇప్పించి వారి జీవితాల్లో వెలుగు దివ్వెలు ప్రసరింపచేసిన వెంకటేశ్వర్ రావును ఆ శాఖ తరపున ఉపాధి శిక్షణ శాఖ మంత్రి వినోద్, ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్ సంయుక్తంగా ఈ అవార్డ్ ఇచ్చి స్వయంగా అభినందించడం విశేషం.కాగా, పెచ్చెట్టి వెంకటేశ్వర్ రావు పూర్వ వరంగల్ జిల్లా బచ్చన్నపేట స్వస్థలమైనప్పటికీ విధినిర్వహణలో భాగంగా.. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో సేవలు అందించారు. ఇలా ఏటూరునాగారం, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, కాజీపేట ప్రిన్సిపాల్ గా ఉన్నారు.వెంకటేశ్వర్ రావు సతీమణి సీతామహాలక్ష్మి హన్మకొండ మిషన్ భగీరథ ప్రభుత్వ అధికారి కాగా... కుమారుడు డాక్టర్ నాగార్జున జనరల్ సర్జన్, కుమార్తె డాక్టర్ స్నిగ్ధ డెంటల్ స్పెషలిస్ట్ కావడం..మొత్తం కుటుంబం సేవా దృక్పథం తోనే పనిచేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. జిల్లా స్థాయిలో అనేక అవార్డులు తీసుకున్న పెచ్చెట్టి వెంకటేశ్వర్ రావు తొలి రాష్ట్ర స్థాయి ప్రభుత్వ అవార్డు దక్కించుకోవడం ద్వారా తన బాధ్యతలు మరింత పెరిగాయంటున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి ఆన్‌లైన్‌లో నమోదు

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్

**ప్రజాపక్షం / జనగామ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని ఆన్‌లైన్‌లో వెం టనే నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు దశల వారి నగదు త్వరగా చెల్లించాలన్నారు. మం డల స్థాయిలో అధికారులు కోఆర్డినేషన్‌తో పనిచేయాలని సూచించారు. మం గళ వారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, గ్రామీణ ఉపాధి హామీ పథకం, కొత్త అంగన్‌వాడీలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ మంజూ రై ఇంకా నిర్మాణం ప్రారంభం కానీ ఇళ్లకి సంబంధించి గ్రౌం డింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. వివిధ ధశల్లో నిర్మాణం పూర్తి అయిన ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో తొందరగా నమోదు చేయాలని, నగదు త్వరగా లబ్ధిదారులకు అందించేలా చూడాలన్నారు. వారంవారం మండలాల్లో ఇం దిరమ్మ కమిటీ సమావేశాలు జరగాలని, ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణ పురోగతి మీద నిర్మాణాలకు కావల్సిన ఇసుక మొరం తదితర అంశాలపై రివూ చేయాలన్నారు. కొత్తగా మంజూ అయినా గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు ప్రారంభించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణాల కు మంజూరు ఇవ్వడం జరిగిందన్నారు. డిఆర్‌డిఓ, డిపిఓ, జిల్లా పరిషత్ సి ఈఓ,డిడబ్ల్యూ, హౌసింగ్ డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు రావాలి**



విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ దశ చాల కీలకమైందని, ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ఇంటర్మీడియట్ విద్యపై రివ్యూ నిర్వయించారు. ఇంటర్మీడియట్ విద్యతోనే విద్యార్థులు తమ భవిష్యత్తు తీర్చిదిద్దుకోగలరన్నా రు. ఉద్యోగాలకు సంబంధించిన ఐచ్ఛిక విషయాలను ఎంచుకుంటారని, తల్లిదండ్రులు కూడా ఈ స్థాయిలో విద్యార్థులపైన ఎక్కువ దృష్టి పెడతారన్నాను. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లోఓ నమోదు చేయాలని, పేస్ రికగ్నైజ్ సిస్టంగా ద్వారా హాజరు శాతం నూరు పూర్తి చేయాలనానరు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా మూడవ స్థా యంలో నిలవడంతో ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెరిగాయన్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్‌లోనూ ఉత్తమ ఫలితాలు రావాలన్నారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ అధికారి జితేందర్, కెజిబివి, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు.

## వరంగల్ ఉమ్మడి జిల్లా పునర్నిర్మాణం వేగవంతం


రాష్ట్ర ఉద్యమకారుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ

**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** ఉమ్మడి రాష్ట్రంలో వలస పాలకుల వివక్షతో, స్వరాష్ట్రంలో కల్వకుంట్ల పాలకుల కుటుంబ ప్రయోజనాల కొరకు వరంగల్ ఉమ్మడి జిల్లాను ముక్కలు చెక్కలు చేసి తీవ్ర విధ్వంసానికి గురి చేశారని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అన్నారు. మంగళవారం అదాలత్ సెంటర్లో రాచకొండ ప్రవీణ్ కుమార్ స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ వెంకట్ నారాయణ తో పాటు వేదిక కోఆర్డినేటర్ సోమ రామ మూర్తి, బిసి యువ న్యాయవాదుల సంఘం నాయకులు రాచకొండ ప్రవీణ్, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్, చాపర్తి కుమార్ గాడ్గే, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ వెంకట్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి పది మంది శాసనసభ్యులను ఎన్నుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు ఆదుకున్నారని, ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, అందరూ కలిసి ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉత్తర తెలంగాణలో వరంగల్ మహానగరంగా ఎదిగి వేలాది మంది యువతి యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.గత శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేస్తామని ప్రకటించిన విధంగా వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒకే వరంగల్ జిల్లాగా ఏర్పాటు చేయా



లని, కాకతీయుల వైభవాన్ని చరిత్రను సంస్కృతిని కాపాడడానికి తగిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా రూ.6000 కోట్ల అభివృద్ధి నిధులను సమకూర్చి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మామునూరు ఎయిర్పోర్ట్ ఇన్నర్ రింగ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం మొదలగు అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన అమలు చేయాలని అన్నారు. సోమ రామ మూర్తి మాట్లాడుతూ ములుగు పట్టణంలో ఏర్పాటు చేయబడిన సెంట్రల్ యూనివర్సిటీ బాలారిష్టాలు ఎదుర్కొంటుందని అభివృద్ధికి నోచుకోకుండా కాలయాపన జరుగుతుందని స్థానిక ఎంపీలు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించిన అడ్డంకులను తొలగింప జేసి సాంప్రదాయ, ఆధునిక కోర్సులను ప్రారంభించి ఏజెన్సీ ప్రాంతంలో యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

## నల్లా పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించండి : సుధారాణి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**నల్లా పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఆర్ఓలు, ఆర్ఐ లతో నల్లా పన్ను బకాయిల వసూళ్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇప్పటివరకు వసూళ్లు జరిపిన నల్లా బకాయిలను ఆర్ఐల వారిగా అడిగి తెలుసుకొని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించడం జరిగిందని, పేరుకుపోయిన నల్లా బకాయిల వసూళ్ల లక్ష్యం రూ.45 కోట్లు ఉందన్న మేయర్ ఎబిసి మూడు కేటగిరీలుగా విభజించి వసూళ్లు చేయాలని, పెద్ద మొత్తం లో బకాయి ఉన్న వారి జాబితాను బిల్ కలెక్టర్ల వారిగా అందజేసి వసూళ్లు చేయాలని, గత సంవత్సరం కంటే ఈసారి సుమారు 12 అధిక లక్ష్యాన్ని సాధించాలని సిడిఎంఎ నుండి ఆదేశాలు ఉన్నాయని, అందుకోసం ఇప్పటినుండి సమాయత్తం కావాలని, ఇందుకోసం పెద్ద మొత్తంలో బకాయి ఉన్న 150 మంది జాబితా తయారుచేసి బిల్ కలెక్టర్‌ల వారిగా అందజేసి వసూళ్లు జరపాలని ఈ సందర్భం గా మేయర్ అన్నారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య,ఆర్ఓలుషెహజాదిభేగం,శ్రీనివాస్,ఆర్ఐలుతదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికలు ఆవిష్కరణ

ప్రజాపక్షం/ఎర్రుపాలెం : జమలాపురం దివ్య క్షేత్రం నందు ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న శ్రీ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల గోడ పత్రికలను తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఎర్రుపాలెం మండలంలో పర్యటనలో భాగంగా మంగళవారం జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, వేద పండితులు, ఆలయ కార్య నిర్వాహణాధికారి జగన్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.





## సిఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి పేదలకు వరం : ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పేద వర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం రూ.44.28 లక్షల విలువుచేసే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పేద వర్గాలు పథకాలను మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులతో పాటు పౌరులపై ఉందన్నారు. ఐతే ఫండ్ మొత్తంలో కోతలు విధించి తక్కువ స్థాయిలో మంజూరీ చేయడం సరైంది కాదన్నారు. వైద్యం కోసం ఖర్చు చేసిన మొత్తంలో 75శాతం బిల్లును ప్రభుత్వం చెల్లించాలన్నారు. పిల్లల పెళ్లిల్ల కోసం కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పంథకం ఎంతగానో సహాయ పడుతుందన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి ఎక్‌సే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మి పతి, దారా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లను తక్షణమే విడుదల చేయండి

### రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆందోళన

ప్రజాపక్షం/ ఖమ్మం : మూడు నెలలుగా పెన్షన్ రాక వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పింఛన్ మొత్తాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మంలో ఆందోళనను నిర్వహించింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి జూన్ మాసం నుంచి నెలవారి పింఛన్ రావడం లేదు. ఈవిషయమై పలుసార్లు అధికారుల దృష్టికి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉద్యోగులు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సంయుక్త అధ్యక్షులు జి. వీరస్వామి మాట్లాడుతూ పింఛన్ సొమ్ముపై ఆధారపడి జీవితాన్ని నెట్టుకొస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఒక జూన్ మాసంలోనే ఉద్యోగులకు సంబంధించి పెన్షన్, వేతనానికి సంబంధించి రూ.90,33,442 రావాల్సి ఉందని జులై మాసంలో పింఛన్లకు సంబంధించి రూ. 37,97,311, ఆగస్టు మాసానికి సంబంధించి పింఛన్ల సొమ్ము రూ.38,56,481రావాల్సి ఉందని ప్రభుత్వం తక్షణం పింఛన్ మొత్తాన్ని విడుదల చేసి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత రావాల్సిన బకాయిలు రాక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం తగు రీతిలో స్పందించక పోతే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవి కుమార్, కోశాధికారి గుర్రాల శ్రీనివాసరావు, పెన్షనర్ల సంఘం నాయకులు మేరీ ఏసుపాదం, పి. సత్యనారాయణ, కొల్లికొండ శరత్‌బాబు, వెంకటేశ్వర్లు, జే. వెంకటేశ్వర్లు, బెల్లం రాధాకృష్ణమూర్తి, హుస్సేన్ పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పరిశీలన



ప్రజాపక్షం/ బోనకల్ : మండల పరిధి ముష్టి కుంట్లలోని ఆయుష్మన్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ బి. కళావతిభాయ్, డిపిఓ ఎం.దుర్గ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వర్షంకారణంగా దెబ్బతిన్న ముష్టికుంట్ల ఉప కేంద్రంను సందర్శించి చుట్టూ ఉన్న పరిసరాలను తనిఖీ చేశారు. నెల క్రితం వర్షం వల్ల ఉప కేంద్రంలోకి వర్షం నీరు చేరటం ద్వారా ఉప కేంద్రంలోకి వెళ్లేందుకు కష్టంగా ఉందని, ఫర్నీచర్‌కూడా నీటిలో ఉండి పోయాయని, ఇంకా ఈ నీరు అక్కడ ఉండటంచూసిపంచాయతీ సెక్రటరీని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయం పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయటం జరుగుతుందని వారు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి, సిహెచ్‌ఓ దానయ్య, పల్లదవఖానా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, సెక్రటరీ సైదులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామ సమీపంలో లారీ ఢీకొని బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గనిఆత్కూర్ గ్రామానికి చెందిన దామినేని శ్రీనివాసరావు(54), దామినేని రజినికుమారి(50)లు తక్కెళ్లపాడు నుండి బైక్ మీద మొలుగుమాడు వైపు వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతోభార్యాభర్తలుఅక్కడికక్కడేదుర్మరణం చెందారు. శ్రీనివాసరావు దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు.

## కర్షకునికి యూరియా కష్టం



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు,పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, పోచవరం గ్రామాలలో రైతు వేదికలు సొసైటీలు వద్ద మంగళవారం యూరియా కోసం కర్షకునికి కష్టం వచ్చింది. చాలీచాలని యూరియాతో ఈ తరుణంలో యూరియా వేసేందుకు రైతుకు అవసరాలు నిమిత్తం పంటకు వేసేందుకు యూరియా అందుబాటులో లేనందున వస్తుందని తెలుసుకొని తెల్లవారుజామున వేచి ఉండి ఆరు గంటలకే కూపన్లు అయిపోవడంతో నిరాశతో ఆగ్రహానికి గురై ఏఈఓ, ఏవో, సీఈఓలపై వాగ్వాదానికి దిగారు. చాలీచాలని ఎరువులు బస్తాల వలన మరోసారి వస్తాయని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కల్లూరు ఎస్సై హరిత, సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగయ్య, ఏవో రూప, ఏఈఓ, వెంకట లీల, వెంకట్ ఆధ్వర్యంలో ఎరువుల బస్తాలను పంపిణీ చేశారు.

# మౌలిక వసతులతోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : గ్రామీణ మౌలిక వసతులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఎర్రుపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌తో కలిసి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద ఎస్సీ కాలనీలో రూ.45లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్దగోపవరం గ్రామంలో రూ.85లక్షలతో నిర్మించే రోడ్లకు, రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ కేంద్రం నూతన భవనంకు శంకుస్థాపన చేశారు. అనంతరం బుచ్చిరెడ్డిపాలెంలో రూ.40లక్షలు, బనిగండ్లపాడులో రూ.175లక్షలతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. అయ్యవారిగూడెం గ్రామంలో రూ.55లక్షలతో రోడ్లు, భీమవరం విద్యానగర్‌లో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి శంకస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. భట్టివిక్రమార్క మాట్లాడుతూఅభివృద్ధిపథంలో మధిర నియోజకవర్గ ముందుండేలా ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి గ్రామానికి అభివృద్ధి వసతులు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మౌలిక వసతులు అభివృద్ధి ద్వారా గ్రామీ ప్రజల జీవ ప్రమాణాలు మెరుగుపడతాయని, గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసాచారి, భద్రాద్రి జిల్లా డిఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, పిఆర్ఇ వెంకటరెడ్డి, తహశీల్దార్ మన్నె ఉషాశారద, ఎంపిడిఓ బి.సురేందర్, వివిధ శాఖల అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మండల పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, చావా రామకృష్ణ, శీలం శ్రీనివాస్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు,యరమలపూర్ణచంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్లస్టర్ ఇన్ చార్జిలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులపై సమీక్ష

ఎర్రుపాలెం మండలంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మంగళవారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. బనిగండ్లపాడులో భోజన విరామం అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో కలిసి రెవెన్యూ, ఫారెస్టు, పంచాయతీరాజ్, విద్యా శాఖ, ఆరోగ్యశాఖ, పర్యాటకశాఖ అధికారులతో విడివిడిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వాటిని త్వరగతిన పూర్తి చేసేందుకు అధికారులు చేపట్టాల్సిన చర్యలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

## ప్రణాళికాబద్ధంగా ఏదులాపురం అభివృద్ధి

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న,కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి లోనితెల్దారుపల్లి,మద్దులపల్లిలలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. తెల్దారుపల్లిలో రూ. 1.54 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మద్దులపల్లిలో రూ. 69 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను మంత్రి ప్రారంభించారు.మంత్రి మాట్లాడుతూ తెల్దారుపల్లి ప్రాంతానికి ప్రజా ప్రభుత్వం వచ్చిన 20 నెలల్లోనే రూ. 12.35 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మద్దులపల్లి ప్రాంతానికి బిటి రోడ్డు, అంతర్గత సిసి రోడ్లు నిర్మించామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలెండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు భరోసా కల్పించామన్నారు. దేశంలో ఎక్కడలేనివిధంగా రేషన్ ద్వారా పేదలకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన రేషన్‌కార్డుల సమస్యలను ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరించి కొత్త కార్డులను పంపిణీ చేశామన్నారు. పేదలకు అండగా ఉండే కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. త్వరలో రెండవ విడత కూడా మంజూరు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ఇండ్లను అందిస్తామన్నారు. తెల్దారుపల్లిలో 24 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాల పట్టాలు, మద్దులపల్లిలో 22 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీవో నర్సింహారావు, ఆర్అండ్‌బి ఈఈ పవార్, తహసీల్దార్ రాంప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అమాయక గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ముమ్వ వెంకటేశ్వరరావు





ప్రజాపక్షం/బూర్గంపాడు:అమాయక గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముమ్వ వెంకటేశ్వరరావు (లడ్డా)అన్నారు. మంగళవారం సారపాక సిపిఐ ఆఫీస్‌లో సిపిఐ అత్యవసర సమావేశం పేరాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన ఛలో ఐటిడిఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్న పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అనేక సమస్యల మీద సారపాక నుండి ఐటిడిఏ కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తున్నామని, దీన్ని జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా పోడు భూములు సర్వే చేసి ఇంత వరకు వారికి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదని, రోడ్లు, మంచినీళ్లు, విద్యుత్ లేక చీకటిలోనే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కనీసం చదువుతున్న పిల్లలకు కూడా కులం, ఆదాయం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, అందుకు నిరసనగా 12వ తేదీన తలపెట్టి ఛలో ఐటిడిఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బాలకృష్ణ, శ్రీరాంపురం కాలనీ పెద్ద మనిషి సోడే చంద్రయ్య, చింతల గుంపు పెద్ద మనిషి పోడియం సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.

## 'సీతారామ'భూ సర్వే పనులపై శ్రద్ధ పెట్టాలి

ప్రజాపక్షం/పెనుబల్లి: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూమి సర్వే పనుల వేగం పెంచాలని కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సర్వే వివరాలను సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన పనుల కంటే 20 శాతం పనులు అధికంగా పూర్తి చేశామని తహశీల్దార్ సూర్యనారాయణ మూర్తి వివరించారు. ప్యాకేజ్ వన్‌లో బయ్యనగూడెం, గౌరారం, చౌడవరం, మండాలపాడు,అడవిమల్లెల, బవన్నపాలెం, పెనుబల్లి, లింగగూడెం, కారాయి గూడెం, కొండ్రుపాడు తుమ్మలపల్లి, ప్యాకేజ్ 2 లో గౌడారం, పెనుబల్లి, తాళ్లపెంట, లింగగూడెంలలో భూములు సర్వే నిర్వహించినట్లు తహశీల్దార్ సూర్యనారాయణమూర్తి, సర్వేయర్ లు వివరించినట్లు తెలుస్తుంది.

## కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయండి

### రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నేత వీరస్వామి





ప్రజాపక్షం/ ఖమ్మం : కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు జి. వీరస్వామి డిమాండ్ చేశారు. పెన్షనర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య, నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మంజిల్లా జనరల్ బాడీ సమావేశం మంగళవారం దుగ్గినేని సత్యనారాయణ రావు హాల్ (జెడ్పి మీటింగ్ )లో జరిగింది. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరస్వామి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు 15 మాసాలు గడిచిన రావడం లేదని ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే మొత్తంతో కొందరి జీవితం ఆధారపడి ఉందని ఆ విషయాన్ని ప్రభుత్వం మరిచిపోతుందని వీరస్వామి తెలిపారు. పింఛన్‌దారులకు సంబంధించిన బకాయిలను తక్షణం విడుదల చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయాలు మార్కెట్ కమిటీలలో సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ఇతర పెన్షనర్ల మాదిరిగా ట్రెజరీల ద్వారా చెల్లింపులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసి డైరక్టర్ స్థాయి అధికారిని నియమించడంతో పాటు హైదరాబాద్ నగరంలో పెన్షనర్ల భవనాన్నినిర్మించాలని డిమాండ్ చేశారు. మొదటి పే కమిషన్ ప్రతిపాదించినట్లు 20 ఏళ్ల సర్వీసుకు పూర్తి పెన్షన్‌ను అందించడంతో పాటు పిఆర్‌సి, ఐఆర్ పెంపుదల చేయాలని తెలంగాణఉద్యమంలోపాల్గొని ఉద్యోగ విరమణ చేసిన వారికి ప్రత్యేక ఇన్సెంటివ్ ఇచ్చి గుర్తింపునివ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాంమనోహర్, వరంగల్ జిల్లానాయకులు తుమ్మా వీరయ్య, కె. సుధీర్‌బాబు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శికనపర్తి వెంకటేశ్వర్లు, సంఘ బాధ్యులు మేరీ ఏసుపాదం, అంజలి, పెదమళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, లక్ష్మి సుజాత, అన్నమ్మ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత నిరసనలపై పోలీసు కేసులా?

### ఖమ్మం పోలీసుల అత్యుత్సాహం
### సిపిఐ జిల్లా సమితి ఆరోపణ

ప్రజాపక్షం/ ఖమ్మం : శాంతియుతంగా తమ నిరసనను లేదా డిమాండ్స్‌ను ప్రభుత్వానికి తెలియజేస్తే పోలీసులు కేసులు నమోదు చేయడం ఆక్షేపణీయమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా సమితి తెలిపింది. సిపిఐ జిల్లా సమితి పక్షాన జిల్లా కార్యదర్శి దండి సురేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శాంతియుతంగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేయడం జరిగిందని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరామని ఈ సందర్భంగా ప్రజలకు కానీ అధికార కార్యక్రమాలకు కానీ ఎటువంటి అంతరాయం కలిగించలేదని సురేష్ తెలిపారు. ఆందోళన చేస్తున్న సమయంలో కలెక్టరేట్‌కు వచ్చి పోయే సామాన్య ప్రజలకు, అధికారులకు, ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం కలిగించలేదని కలెక్టరేట్ ఎదుట గల రెండు గేట్లలో ఒక గేటు తీసే ఉన్నా తమ కార్యకర్తలు ఎవరు లోపలికి వెళ్లే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. రాష్ట్ర పిలుపు కావడం, పోలీస్ అధికారులు తమ నాయకత్వాన్ని కార్యక్రమ సమాచారం అడిగినప్పుడు వివరాలు తెలపడంతో పాటు శాంతియుతంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎక్కడ ఎవరికి ఇబ్బంది కలగనివ్వమని తెలిపి అదేవిధంగా ఆందోళన చేస్తే ఎందుకు పోలీసులు కేసులు నమోదు చేశారని ఆయన ప్రశ్నించారు. ఖమ్మం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారనిప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం మానుకోవాలన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు జరిగాయని ఒక ఖమ్మంలోనే కేసులు నమోదు చేయడం శోచనీయమన్నారు. ఖమ్మం పోలీసులు తీరు మార్చుకోకుంటే ప్రజల పక్షాన తగు రీతిలో స్పందించక తప్పదన్నారు. ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయడం కమ్యూనిస్టులుగా మా బాధ్యత అని కేసులకు, నిర్బంధాలకు భయపడి రాజీపడబోమని సురేష్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు.

## శ్రమను దోచుకుంటున్నారు



**భద్రాచలం ఆర్‌టిసి కార్మికుల ఆందోళన బాట**
**విధుల బహిష్కరణ**
**డ్యూటీలోనే సిక్ అవుతున్న కార్మికులు**
**ప్రాణాలుపోయేలా ఉన్నాయంటూ ఆవేదన**

ప్రజాపక్షం/భద్రాచలం: అంతరాష్ట్ర కూడలి భద్రాచలం ఆర్‌టిసి డిపోలో డ్రైవర్లు తమ శ్రమను దోచుకుంటున్నారంటూ ఆందోళన బాటపట్టారు. డిపో మేనేజర్ ఒంటెద్దు పోకడలతో తమ ప్రాణాలు గాల్లో కలిసిపోయేలా ఉన్నాయని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయిస్ యూనియన్,ఎస్‌డబ్ల్యూఎస్,ఐఎన్‌టియూసి,టిఎంయు యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నుండి ఆందోళన బాట పట్టిన సుమారు 60 మంది కార్మికుల పోరాటంమంగళవారం కూడా కొనసాగింది. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకువిధులకుబహిష్కరిస్తామంటూ టిమ్‌డ్రైవర్లు తెగేసి చెబుతున్నారు. దీంతో యాజమాన్యం చేసేది లేక సోమవారం రాత్రి, మంగళవారం పలు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ విఫలమయ్యాయి. ఈ క్రమంలో కార్మికులు డిపో ఆవరణలోనే అల్పాహారాన్ని భుజించారు. మధ్యాహ్నం భోజన, రాత్రి నిద్ర ఇక్కడే అంటూ చెబుతున్నారు.

### డ్రైవర్ల నరకయాతన

డిపో మేనేజర్ తిరుపతి విధుల్లో చేరిన నాటి నుండి నూతన పోకడలకు శ్రీకారం చుడుతూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నట్లు టిమ్ డ్రైవర్లు కొందరు ఆరోపిస్తున్నారు. రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో ఎక్కడా లేని విధంగా భద్రాచలం డిపోలో మాత్రమే టిమ్ డ్రైవర్లపై అధిక పనిభారం మోపుతూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడుతున్నారు. ఒక్కొక్క టిమ్ డ్రైవర్‌వారానికిసుమారు 1890కి.మీ పనిచేయాల్సి వస్తుందని,భద్రాచలంనుండిహైదరాబాద్ సర్వీసు నడిపే క్రమంలో టిమ్ డ్రైవర్లు నరకయాతన పడుతున్నారని, వాటర్ బాటిల్స్ అందించే క్రమం నుండి రిజర్వేషన్ చెక్ చేసుకోవడం, కార్గో పార్సిల్స్ అందించడం, పాసింజర్లకు టిక్కెట్లు ఇవ్వడం వంటి పనులు చేయాల్సి వస్తుందని, ఇలాంటి క్రమంలో కేవలం 7 గం.లలో హైదరాబాద్‌చేరుకోవాలంటూ నిబంధనలు పెడుతున్నారని, మిగులుఆయిల్ ఉండాలంటూ వేదిస్తున్నారని, తద్వారా డ్రైవర్లు పని ఒత్తిడికి గురవుతున్నారని అంటున్నారు. గత కొన్ని రోజుల క్రితం సుమారు 8 మంది డ్రైవర్లు విధి నిర్వహణలోఅనారోగ్యానికిగురయ్యారని, ఇద్దరు ముగ్గురు డ్యూటీలో ఉండగానే ఆస్పత్రి పాలయ్యారని ఆరోపిస్తున్నారు.ప్రజలను సురక్షితంగా గమ్యానికి చేర్చాల్సిన తాము అధిక ఒత్తిడితో విధులు నిర్వహిస్తూ సురక్షిత డ్రైవింగచేయలేకపోతున్నట్లు ఆందోళన చెందుతున్నారు.

### అర్హత లేని వారితో..

తాము విధులు బహిష్కరించడంతో అర్హత లేని ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లను హైదరాబాద్ డ్యూటీకి పంపుతున్నారని, నిబంధనల ప్రకారం ఆ డ్రైవర్లు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తప్ప డీలక్స్, సూపర్ లగ్జరీ, ఆపై సర్వీసులు నడపరాదని అంటున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో లాంగ్‌సర్వీసులు నడపడం ద్వారా ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ ఉండదని, డిపో మేనేజర్ ఆర్థిక లాభాల కోసం, తనకు మంచిపేరు తెచ్చుకోవడం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అంటున్నారు. అంతే కాకుండా అప్పుడే ఇన్‌కమింగ్ అయిన కార్మికులను లాంగ్ సర్వీసులకు వాడుతున్నారని, కార్మికులు సురక్షితంగా వాహనాన్ని నడిపే పరిస్థితి ఉండదన్నారు.

### ఇకనైనా దయచూపండి

పని భారంతో మానిసక ఒత్తిడికి లోనై అనారోగ్యాల పాలవుతున్నామని, ఆర్‌టిసి యాజమాన్యం ఇప్పటికైనా టిమ్ డ్రైవర్లపై దయ చూపాలని అంటున్నారు. లాంగ్ సర్వీలకు కండక్టర్‌ను ఇవ్వాలని, కిలోమీటర్లు తగ్గించాలని, మిగతా డిపోల మాదిరిగానే విధులు, మస్టర్లు సరిచేయాలని, కార్మికుల ఆరోగ్యాల పట్ల యాజమాన్యం శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని చెబుతున్నారు.

# రీల్



## అందరికీ అందుబాటులో 'మిరాయ్' టికెట్ రేట్స్

### నిర్మాత టి.జీ. విశ్వ ప్రసాద్

హీరో తేజ సజ్జా తాజాగా నటించిన 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా వైజాగ్ లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో తేజ మాట్లాడుతూ ఈ సెప్టెంబర్ 12 మిరాయ్ థియేటర్లోకి వస్తుంది. ఇది ఒక యాక్షన్ ఫాంటసీ అడ్వెంచర్. తప్పకుండా అందరూ థియేటర్స్‌కి వచ్చి చూడండి. మీకోసం ఒక వరల్డ్ ని ప్రిపేర్ చేసి ఉంచాము. పిల్లలకు పెద్దలకు అందరికీ నచ్చే సినిమాని తీసుకొస్తున్నాం అన్నారు. మంచు మనోజ్ మాట్లాడుతూ మా ప్రీ రిలీజ్ ఈవెంట్ వైజాగ్ లో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. పర్సనల్ గా చాలా ఎమోషనల్ గా ఉంది. నా ఫస్ట్ సినిమా దొంగ దొంగది మొత్తం వైజాగ్ లోనే తీశాం. మిరాయ్ సినిమానే నాకు కం బ్యాక్ అని ఈ సినిమా ఒప్పుకున్నాను. ఈ సినిమా కోసం తమిళ్ కన్నడ హిందీ భాషల్లో స్వయంగా డబ్బింగ్ చెప్పాను.నిర్మాత విశ్వప్రసాద్ మాట్లాడుతూ మిరాయ్ విజువల్ వండర్. అద్భుతమైన లొకేషన్స్, ఆర్ట్ వర్క్, విజువల్ ఎఫెక్ట్స్‌తో ఒక తెలుగు సినిమా డెఫినెట్ పాన్ ఇండియా మూవీ అవుతుంది. ఈ సినిమాతో మిరాయ్ పాన్ వరల్డ్ ఫ్రాంచైజ్ అవుతుంది. హనుమాన్ తర్వాత తేజ ఈ సినిమా కోసం చాలా డెడికేటేడ గా వర్క్ చేశారు. మనోజ్ ఒక స్పెషల్ క్యారెక్టర్ లో కనిపిస్తారు. హరి గౌర మ్యూజిక్ ఇచ్చారు. ఇందులో హిస్టరీ సూపర్ నేచురల్ పవర్ స్పిరిచువల్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఈ సినిమా థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను. అందుకే టికెట్ ధరలు అందరికి అందుబాటులో ఉంచాం అని చెప్పారు.

## 'భద్రకాళి' డిఫరెంట్ అనుభవం

హీరో విజయ్ ఆంటోనీ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'భద్రకాళి'. ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ తృప్తి రవీంద్ర, రియా జిత్తు మీడియాతో చిట్ చాట్ చేశారు.హీరోయిన్ తృప్తి రవీంద్ర మాట్లాడుతూ మాది మహారాష్ట్ర. తమిళ సినిమాలో హీరోయిన్ గా ఇది నా ఫస్ట్ సినిమా. సినిమాల్లోకి రాకముందు నేను సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పని చేశాను. ఇంజనీరింగ్ సమయంలోనే నాకు సినిమా పట్ల చాలా ఆసక్తి ఉండేది. థియేటర్స్ ప్లేస్ కోసం ఆడిషన్స్ ఇచ్చాను. కెమెరా ముందు నటించడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చే విషయం. కొన్ని టీవీ కమర్షియల్స్ కూడా చేశాను. అరుణ్ డైరెక్షన్ టీం నుంచి ఈ సినిమా కోసం ఆడిషన్ కాల్ వచ్చింది. తర్వాత అడిషన్ ఇచ్చాను. లుక్ టెస్ట్ చేసిన తర్వాత ఈ క్యారెక్టర్ కోసం ఓకే చేశారు. ఈ సినిమాలో చాలా రిలేటబుల్ క్యారెక్టర్ చేస్తున్నాను. అందరూ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. డైరెక్టర్ చాలా అద్భుతంగా క్యారెక్టర్ డిజైన్ చేశారు. షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాను. విజయ్ తో నటించడం చాలా మంచి అనుభవం. తెలుగు ఆడియన్స్ అన్ని రకాల సినిమాల్ని గొప్పగా ఆదరిస్తారు. సినిమాని గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటారు. ఈ సినిమా కూడా ఆడియన్స్ మంచి ఎక్స్పిరియన్స్ ఇస్తుందని కోరుకుంటున్నాను. హీరోయిన్ రియా జిత్తు మాట్లాడుతూ నేను మలయాళీ. తమిళ, మలయాళం సినిమాలు చూస్తూ పెరిగాను. చైల్డ్ ఆర్టిస్ట్ గా నాకు అనుభవం ఉంది. దాదాపు 15 సినిమాలు చైల్డ్ ఆర్టిస్ట్ గా చేశాను. సినిమాల నుంచి కొంత బ్రేక్ తీసుకొని చదువుపై దృష్టి పెట్టాను. చదువు పూర్తయిన తర్వాత మళ్లీ సినిమాల్లోకి వచ్చాను.విజయ్ ఆంటోనీ 25వ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన మ్యూజిక్ వింటూ పెరిగాను. ఆయన మ్యూజిక్ నాకు చాలా ఇష్టం.ఈ సినిమాలో ఒక డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ఇప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు. విజయ్ చాలా హంబుల్ పర్సన్. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. డైరెక్టర్ అరుణ్ చాలా క్లారిటీ ఉన్న మేకర్ . మాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని నిర్మించారు. ఇది చాలా ఇంపాక్ట్ ఫుల్ కథ. ఇలాంటి కథ సొసైటీ కి చాలా అవసరం. తప్పకుండా ఈ సినిమా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది.తెలుగు ఆడియన్స్ మంచి సినిమాలని ఆదరిస్తారు. భద్రకాళి కూడా చాలా ఇంపాక్ట్ ఫుల్ కంటెంట్ తో వస్తున్న సినిమా. తప్పకుండా అందరినీ అలరిస్తుందని కోరుకుంటున్నాను.



తృప్తి రవీంద్ర, రియా జిత్తు



## ఘనంగా 'రోహిణి' పాటల ఆవిష్కరణ

యంగ్ ఛార్మింగ్ హీరో సన్నీ కునాల్ హీరోగా, దేవిక సాహూ, ఆశ హీరోయిన్లుగా, నిర్మాత కుశాల్ రాజు, దర్శకుడు సంగ్ కుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'రోహిణి' మూవీ ఆడియో వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాటలు, ట్రైలర్‌ను ముఖ్య అతిథులు టీఎఫ్‌సీసీ కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాత చదలవడ శ్రీనివాస్, హీరో క్రిష్ణ సాయి కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎఫ్‌సీసీ సెక్రటరీ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ కంటెంట్ బాగుంటే ఏ సినిమా అయినా విజయవంతం అవుతుంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్' నిరూపించినట్టే, అలాంటి లక్షణాలు రోహిణి సినిమాకూ ఉన్నాయి. ఇది హిట్ కావాలని ఆశిస్తున్నాను అన్నారు. దర్శకుడు సంగ కుమార్ మాట్లాడుతూ ఈ సినిమా విజయవంతం కావడానికి యూనిట్‌లో ప్రతి ఒక్కరి కృషి ఉంది. అందరూ శ్రమించారు. పాటలకు వస్తున్న స్పందన సంతోషంగా ఉంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాను హిట్ చేయాలని కోరుతున్నాను అన్నా రు. నిర్మాత కుషల్ రాజు మాట్లాడుతూ ఒక మంచి సినిమా అందించాలనే లక్ష్యంతో పని చేశాం. టీమ్‌లోని ప్రతి ఒక్క రూ ప్రతిభ చూపించారు. అందుకే సినిమా బాగా వచ్చింది. త్వరలోనే విడుదల చేసే మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాము అన్నారు. హీరో సన్నీ కునాల్, హీరోయిన్లు దేవిక సాహూ, ఆశ , దాసరి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ చిత్రానికి మాటలు: మెండెమ్ శ్రీధర్, కెమెరా: అభినయ్ సంగ, కో ప్రొడ్యూసర్: దేవకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: షేక్ వలీ పాషా.

## గీత ఆర్ట్స్‌లో సినిమా ఆలస్యమైంది

## అందుకే కిష్కింధపురి చేశా

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. నా ఫస్ట్ సినిమా 'చావు కబురు చల్లగా'. ఆ సినిమా తర్వాత గీత ఆర్ట్స్‌లోనే మరో సినిమా చేయాలి. అయితే కొన్ని కారణాల వల్ల డిలే అయింది. ఒక సందర్భంలో నిర్మాత సాహుకి ఈ కథ చెప్పాను. ఆయనకి చాలా నచ్చింది. తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ విన్నారు. అందరికీ కథ నచ్చడంతో ప్రాజెక్ట్‌ని మొదలుపెట్టాం. నాకు హారర్ సినిమా చాలా ఇష్టం, ఆ జానెర్‌కి ఒక సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. హారర్‌ని ఇష్టపడే ఆడియన్స్‌కి నచ్చేలా ఒక కథ చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. కిష్కింధపురి హారర్ మిస్టరీ రెండు బ్లెండ అయిన సినిమా. ఇందులో ఎడ్జ్ అఫ్ ది సీట్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ చాలా వున్నాయి. నాకు ప్రతి సినిమాలో ఒక కొత్త విషయాన్ని చెప్పాలని ఆలోచన ఉంటుంది. నాకు తొలి సినిమాలో కూడా చాలా వైవిధ్యమైనటువంటి అంశాన్ని చెప్పడం జరిగింది. ఈ సినిమా కూడా హారర్ లో ఒక కొత్త అనుభూతిని అందించబోతుంది. చాలా ఇంపార్టెంట్ విషయాన్ని ఈ సినిమాతో చెబుతున్నాం. ఈ కథ ఆయనకు చాలా నచ్చి. సాయి యాక్షన్ హీరో. ఆయన ఈ కథ విని ఉన్నది ఉన్నట్లుగా తీయమని చెప్పారు. మేము ఏదైతే అనుకున్నామో అది స్క్రీన్ మీదకి అద్భుతంగా వచ్చింది. కథ, విజువల్, టెక్నికల్ గా ఆడియన్స్ కి ఒక మంచి అనుభవం ఇవ్వాలని సాయి మొదటి నుంచి నన్ను చాలా సపోర్ట్ చేశారు. కిష్కింధపురి అంటే మనకి రామాయణం గుర్తొస్తుంది. ఈ కథకి స్పూర్తి రామాయణం. అయితే ఆ స్పూర్తి చాలా మెటాఫర్ గా వుంటుంది. ఈ సినిమాని డీ కోడ్ చేసుకున్న వారికి రామాయణం నుంచి చాలా రిఫరెన్స్ దొరుకుతాయి.అనుపమ ఇప్పటివరకు చేయని క్యారెక్టర్ చేశారు. ఇందులో హీరో హీరోయిన్ క్యారెక్టర్స్ నేను చూసిన రియల్ లైఫ్ ఇన్సిడెంట్ ఇన్స్పిరేషన్ గా తీసుకున్నాను. ఇద్దరు కూడా కొత్తగా కనిపిస్తారు.ఈ సినిమా అంతా కూడా ఒక తెలియని ప్లేస్ లో జరుగుతుంది. అందుకే చాలావరకు పెక్యులర్ గా ఉండే క్యారెక్టర్స్ ని తీసుకోవడం జరిగింది. ఒక రేడియో స్టేషన్ కి వెళ్లడం వల్ల జరిగిన కథ ఇది. రేడియో స్టేషన్ లో చాలా మ్యాసివ్ గా ఉండాలి. అలాగే ఈ కథ 1989 లో మొదలవుతుంది. అలాంటి ఒక వింటేజ్ వైబ్ ని క్రియేట్ చేశాం. ఈ సినిమాలో కనిపించే లొకేషన్స్ కూడా చాలా డిఫరెంట్ గా ఉంటా యి. మేమైతే కాన్ఫిడెంట్ గా ఉన్నాం. ఒక సెన్సిబుల్, మంచి సినిమా చేశామని నమ్మకం ఉంది. కచ్చితంగా వర్కౌట్ ఉందనే వర్క్ అవుట్ అవుతుందనే నమ్ముతున్నాం. అవుట్ పుట్ చూసుకున్నాక చాలా హ్యాపీగా ఉన్నాం. టెక్నికల్ సినిమా టాప్ నాచ్ ఉంటుంది. గ్రాఫిక్స్ చాలా అద్భుతంగా వచ్చాయి.



డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి

## 'ఛాంపియన్'లో చంద్రకళగా అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ రిలీజ్

రోషన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్'. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాను, జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ , కాన్సెప్ట్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి హీరోయిన్ అనశ్వర రాజన్ ను పరిచయం చేస్తున్నారు. స్వప్న సినిమాస్ కొత్త ట్యాలెంట్‌ని వెలుగులోకి తీసుకురావడంలో ముందువరుసలో వుంటుంది. బ్లాక్‌బస్టర్ సీతా రామంతో తెలుగులోకి అడుగుపెట్టిన మృణాల్ ఠాకూర్ అందుకు నిదర్శనం. ఇప్పుడు ఆమె పరిశ్రమలో అత్యంత బిజీగా ఉన్న నటీమణులలో ఒకరు. ఆ ట్రెడిషన్ ని కొనసాగిస్తూ, ఛాంపియన్‌లో ట్యాలెంటెడ్ మలయాళ నటి అనస్వర రాజన్‌ను పరిచయం చేస్తున్నారు. ఈ సినిమాలో చంద్రకళగా అనశ్వర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. సాంప్రదాయ రెట్రోస్టైల్ దుస్తులలో గాజులు, సిందూరంతో అందంగా కనిపిస్తుంది. కథలో ఇంపాక్ట్ క్రియేట్ చేసే పాత్రను ఫస్ట్ లుక్ చూస్తే అర్థమౌతోంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ఆర్. మాధీ , సంగీతం మిక్కీ జె. మేయర్. ఆర్ట్ డైరెక్టర్ తోట తరణి అందిస్తున్నారు.



## తెలంగాణ శాసనమండలి భవనం పునర్‌నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలోని తెలంగాణ శాసనమండలి భవనం (హెరిటేజ్ బిల్డింగ్) పునర్‌నిర్మాణ పనులను మంగళవారం తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరిశీలించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహా చార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అదే సమయంలో హెరిటేజ్ భవనం అయినందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రానున్న సమావేశాలు ఈ భవనంలో నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనులను పరిశీలించడానికి వస్తారని, పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా , వేగంగా పూర్తి చేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలన్నారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ అధికారులు, అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# బీహార్‌లో సిపిఐ ప్రబల శక్తి

**● అందుకు తగ్గట్లుగానే సీట్లు కోరుతున్నాం ● సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా**



**పట్నా:** బీహార్‌లో సిపిఐ ప్రబలశక్తిగా ఉందని... రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ కోరుకుంటున్నట్లు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. ఈ మేరకు మహాఘట్బంధన్‌లో ప్రధాన పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్‌లు పార్టీలు పొత్తులో భాగంగా సిపిఐకి సహేతుక రీతిలో సీట్లను కేటాయిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు పట్నా వచ్చిన రాజా... మీడియాతో మాట్లాడుతూ... బీహార్‌లో సిపిఐ సంస్థాగతంగా బలంగా ఉందన్నారు. గణనీయ సంఖ్యలో ఓట్లు పొందగలదని తెలిపారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు స్థానాల్లో మాత్రమే పోటీ చేసినందున ఈసారి అంతకన్నా ఎక్కువ స్థానాలు పొందాలన్న పార్టీ వైఖరిని ఆయన సమర్థించారు. "మేము మా కోరికను అనధికారికంగా లాలు ప్రసాద్ (ఆర్జేడీ అధ్యక్షుడు), తేజస్వి యాదవ్‌కు తెలియజేశాం. కూటమిలోని ఇతర పార్టీలు సైతం ఈసారి ఎక్కువ సీట్లను డిమాండ్ చేస్తున్నాయి. కాబట్టి, ఆర్జేడీ, కాంగ్రెస్ వాస్తవికంగా ఉండాలి. బీహార్‌లో సిపిఐ ఉనికిని దెబ్బతీయని రీతిలో సీట్లు ఇవ్వాలి" అని ఆయన అన్నారు. ముఖ్యంగా సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ముకేశ్ సాహ్నికి చెందిన వికాస్‌షీల్ ఇన్సాన్ వంటి పార్టీలు ఎక్కువ స్థానాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో సిపిఐ అంచనాల గురించి విలేకరులడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయనపై విధంగా స్పందించారు. మరొక ప్రశ్నకు స్పందిస్తూ... ఓటు హక్కు కోసం ఆధార్ కార్డులను 12వ పత్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన సంతప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ఏం చేస్తుందో మేము నిశితంగా గమనిస్తామని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 25వ బీహార్ రాష్ట్ర మహాసభలు పట్నాలో ప్రారంభమయ్యాయి. పార్టీ జెండాను సిపిఐ జాతీయ కార్యదర్శి నాగేంద్రనాథ్ ఓఝా ఆవిష్కరించారు. మహాసభలకు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి గిరీశ్ చంద్ర శర్మ రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేశ్ పాండే, రాష్ట్ర నాయకులు, పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీహార్‌లో ప్రజల హక్కులను కాపాడటానికి , ప్రగతిశీల, ప్రజాస్వామ్య బీహార్ నిర్మాణానికి ఉద్యమ కార్యాచరణపై ఈ మహాసభల్లో చర్చించనున్నారు.

### గీత కార్మికులకు రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలు

## తక్షణమే విడుదల చేయాలి

### తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ. 13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిలు గౌడ్ రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, రాష్ట్ర ఉపాధ్యాక్షులు కెవిఎల్‌లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం సమర్పించారు. గీత వృత్తిలో ప్రమాదవశాత్తు చెట్లపై నుండి పడి చనిపోయిన లేదా వికలాంగులుగా మారిన కార్మికుల కుటుంబాలు జీవనాధారం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, వారికి సకాలంలో ఎక్స్‌గ్రేషియా అందకపోవడం సమస్యను మరింత తీవ్రం చేస్తుందని సంఘం నాయకులు మంత్రి దృష్టికి తెచ్చారు. మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన ఎక్స్‌గ్రేషియా బకాయిలు గత కొంతకాలంగా నిలిచిపోయాయని, దీనివల్ల బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. మానవతా దృక్పథంతో ఈ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే వృత్తిలో మరణించిన గీత కార్మికుల భార్యలకు వితంతు పెన్షన్ మంజూరు చేయడంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని సవరించి అర్హులైన వారికి వెంటనే పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్‌ను రూ. 2,000 నుంచి రూ.5,000లకు పెంచాలని కూడా సంఘం ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. గీత కార్మికులకు వృత్తి రక్షణ పరికరాలను కూడా అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి హామీ ఇచ్చినట్లు నాగభూషణం తెలిపారు.

### 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి'

## విస్తృత ఏర్పాట్లు చేయాలి : సిఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 17వ తేదీన నిర్వహించే 'తెలంగాణా ప్రజాపాలన దినోత్సవానికి' విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డిజిపి జితేందర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.విఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డిజి శివధర్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 17న ఉదయం గన్‌పార్క్ వద్ద 'అమరవీరుల స్తూపం' వద్ద ముఖ్యమంత్రి నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో జరిగే ప్రజాపాలన దినోత్సవం లో పాల్గొంటారని వివరించారు. గన్‌పార్క్ వద్ద జరిగే కార్యక్రమానికి జిహెచ్‌ఎంసి కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహారిస్తారన్నారు. పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే సమావేశానికి తగిన ఏర్పాటు చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి వివిఐపిలతో పాటు ప్రజాప్రతిధులందరికీ ఆహ్వాన పత్రికలను అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి అగ్నిమాపక సర్వీసుల డిజి నాగిరెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ప్రోటోకాల్ శాఖ డైరెక్టర్ శివలింగయ్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు హాజరయ్యారు.

## బాంబుదాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఖండించారు. కాగా మరోవైపు ఇజ్రాయెల్‌లో బందీల కుటుంబాలు దోహాదాడుల నేపథ్యంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హమాస్ కక్షగట్టి బందీలుగా ఉన్న తమ బంధువులకు హాని చేస్తుందని భయపడుతున్నారు. గాజాలో హమాస్ వద్ద దాదాపు 20 మంది ఇజ్రాయలీలు బందీలుగా ఉన్నారు. ఇదిలా ఉండగా, గాజా సిటీ ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ప్రజలకు ఆదేశించింది. ఇప్పటికే ప్రజలు దక్షిణ ప్రాంతాలకు తరలివెళుతున్నారు. ఈ ఆదేశాలతో ప్రజలు భయంతో మూటలు సర్దుకుని దొరికిన వాహనాలపై వెళ్ళిపోతున్నారు. భారీసంఖ్యలో వాహనాల్లో ప్రజలు గాజాసిటీని ఖాళీ చేస్తున్నారు. భారీస్థాయిలో నగరంలో యుద్ధం జరుగుతుందిగనుక గాజా సిటీని ప్రజలు వదిలివెళ్ళిపోవాలని ప్రజల కు ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించడంతో ప్రజలు ఆగమేగాలపై ఇళ్ళుఖాళీ చేసి వెళ్ళిపోతున్నారు. గడచిన మూ డు రోజులుగా గాజాసిటీలో 30 హై రైజ్ భవంతులను సైన్యం ధ్వంసం చేసిందని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇ జ్రాయెల్ కట్జ్ మంగళవారం ప్రకటించారు. ఈ భవంతులను హమాస్ ఉగ్రవాదులు తమ కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నాయని తెలిపింది. మరోవైపు గాజాసిటీ శివారులో హమాస్ చేసిన దాడిలో నలుగురు ఇజ్రాయె లీ సైనికులు మరణించారు. గాజాలో యుద్ధం మొదలై మంగళవారంనాటికి 704 రోజులు పూర్తయింది.

## అనుమతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి కేటీఆర్, ఎ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఎ3గా హెచ్‌ఎండిఎ మాజీ ఇంజినీర్ బిఎల్‌ఎన్ రెడ్డిలతో పాటు ఎ4, ఎ5లపై ఎసిబి అధికారులు చార్జ్షీటు దాఖలు చేయనున్నారు. ఈ కేసులో ఇప్పటికే మాజీమంత్రి కెటిఆర్‌ను రెండుసార్లు, ఐఎఎస్ అధికారి అరవింద్‌ను మూడుసార్లు ఎసిబి ప్రశ్నించిన విషయం తెలిసిందే.అయితే, ఫార్ములా ఈకారు రేస్లో భారీగా అవినీతి జరిగినట్లుగా ఏసీబీ తేల్చింది. కేసులో క్విడ ప్రోకోను అధికారులు స్పష్టమైన సాక్షాధారాలతో నిరూపించినట్లుగా సమాచారం అందుతోంది. ఫార్ములా ఈరేసు కోసం స్పాన్సర్షిప్ ఇచ్చిన సంస్థ నుంచి రేసు నిర్వహించిన సంస్థకు రూ.44 కోట్లు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. అందుకు బదులుగా స్పాన్సర్షిప్ సంస్థ నుంచి రూ.44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ను బీఆర్‌ఎస్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది. రామకృష్ణా రావు వద్దకు రిపోర్టు చేరింది. అక్కడి నుంచి అనుమతి రాగానే ఫార్ములా ఈరేసు కేసులో ఎ1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, ఎ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, A3గా హెచ్ ఎండీఏ మాజీ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డిలతో పాటు ఎ4, ఎ5లపై ఎసిబి అధికారులు చార్జ్షీటు దాఖలు చేయనున్నారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ను మూడు సార్లు ఏసీబీ ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే, ఫార్ములా ఈకారు రేస్లో భారీగా అవినీతి జరిగినట్లుగా ఎసిబి తేల్చింది. కేసులో క్విడ్ ప్రోకోను అధికారులు స్పష్టమైన సాక్షాధారాలతో నిరూపించినట్లుగా సమాచారం అందుతోంది. ఫార్ములా ఈరేసు కోసం స్పాన్సర్షిప్ ఇచ్చిన సంస్థ నుంచి రేసు నిర్వహించిన సంస్థకు రూ.44 కోట్లు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. అందుకు బదులుగా స్పాన్సర్షిప్ సంస్థ నుంచి రూ.44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ను బిఆర్‌ఎస్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

### ఇది లొట్టపీసు కేసు : కెటిఆర్

'ఫార్ములా ఈ కార్ ' కేసు ఒక లొట్టపీసు కేసు అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పునరుద్ఘాటించారు. ఈ విషయంలో ఎవరైనా తనతో లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చని సవాలు విసిరారు. హైదరాబాద్ ఫార్ములా ఈ కారు రేసును తీసుకురావడానికి తాను అన్ని ప్రయత్నాలూ చేశానని, ఈ రేసు కోసం ప్రభుత్వం నుండి రూ. 46 కోట్లు ఇవ్వాలని తానే ఆదేశాలు ఇచ్చానని, ఆ డబ్బులు నేరుగా నిర్దేశిత ఖాతాలోకి చేరాయని కెటిఆర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కారు రేసులో ఒక్క రూపాయి కూడా ఎక్కడా తారుమారు కాలేదని, ప్రతి రూపాయికి లెక్క ఉందని, అలాంటప్పుడు అవినీతి ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రాసిక్యూషన్ చేసినా, ఛార్జిషీట్లు వేసినా ఏమీ చేయలేరన్నారు. సిఎం తాను(కెటిఆర్) ఇద్దరం కలిసి టివి ఛానల్ ముందు లైవ్ డిటెక్టర్ పరీక్షను ఎదుర్కొందామని అన్నారు. ప్రజల సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం ఫార్ములాఈ కేసును ముందుకు తీసుకొచ్చారని కెటిఆర్ ఆరోపించారు.

## పట్టుబడిన అధికారిణి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలంటే రూపాయలు 10 లక్షలు ఇవ్వాలని టిపిఓ మణిహారిక డిమాండ్ చేసింది దీంతో వినోద్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. సోమవారం ఎసిబిడిఎస్పి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎసిబి అధికారులు పక్కా ప్లాన్‌తో మున్సిపల్ కా ర్యాలయంలో సోదాలు నిర్వహించారు రూ.4 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి అధికారి డిఎస్పి శ్రీధర్ మా ట్లాడుతూ ఈ సమాచారము మాకు వారం రోజుల క్రితమే అందిందని ఆయ న అన్నారు.మంచిరేవుల గ్రామానికి చెందిన వ్యక్తి సంబంధించిన ప్లాట్ ఎల్‌ఆర్‌ఎస్ ప్రోసిడింగ్ ఇవ్వడానికి మణిహారికను కలిస్తే ఆమె రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు అంతా నేను ఇవ్వలేనని చెప్పడంతో తర్వాత వచ్చి కలిసి రిక్వెస్ట్ చేస్తే నాలుగు లక్షల యాభై వేలకు ఒప్పుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 11:30 గంటలకు మున్సిపల్ ఆఫీస్‌లో టిపిఓ చాంబర్లోనే నాలుగు లక్షలు ఇచ్చాడు. ఆ డబ్బులను ఆమె డ్రాలోనే పె ట్టుకున్నది. మేము రెడ్ హాండెడ్‌గా నాలుగు లక్షలు పట్టుకున్నాం. అల్కాపూర్ టౌన్షిప్‌లో ఆమె ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నామని ఆమెను అరెస్ట్ చేసి కో ర్టులో హాజరు పరుస్తామని ఆయన తెలియజేశారు. ఈ సోదాలు నాలుగు నెల ల పాటు కొనసాగుతాయని అన్నారు. లంచం అడిగిన సందర్భంలో టోల్ ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com